కారు గుర్తుకే ఓటేద్దాం
తెలంగాణని గెలిపిద్దాం

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఖమ్మం : fb.com/vaartha
PUBLISHED FROM KHAMMAM, HYDERABAD, VIJAYAWADA, VISAKHAPATNAM, RAJAHMUNDRY, KADAPA, NIZAMABAD, ONGOLE, WARANGAL, TIRUPATHI, ANANTAPUR, KURNOOL, KARIMNAGAR, MAHABUBNAGAR, NELLORE, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM,SRIKAKULAM
15-11-2023 బుధవారం సంపుటి : 29 సంచిక : 285 పేజీలు : 8+16 వెల : 6.50

కారు గుర్తుకే ఓటేద్దాం
తెలంగాణని గెలిపిద్దాం






సాధించింది చాలా ఉంది.
సాధించాల్సింది
ఇంకా ఉంది.

భారత రాష్ట్ర సమితి

కారు గుర్తుకే ఓటేద్దాం
తెలంగాణని గెలిపిద్దాం

# కాంగ్రెస్ వస్తే కష్టాలే

≫ సరిపోను కరెంటు లేక సాగు నీరు లేక త్రాగునీరు లేక అలమటించేందని సుధీర్ఘ తెలంగాణ ఉద్యమం తర్వాత కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ నేడు అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది దేశానికే తలమానికంగా మారిందని సీఎం కేసిఆర్ అన్నారు. ఎన్నికలు వచ్చాయంటే కాంగ్రెస్, బిజెపి పార్టీలు కల్లబొల్లి మాటలు చెప్పి ఓట్లు దండుకోవడానికి కుట్రలు పన్నుతున్నారని ప్రజలు వారి మాటలు నమ్మి మోసపోవద్దని 2014 నుండి ఇప్పటి వరకు బిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధితో పాటు అనేక సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని, రైతు బరోసా క్రింద రైతు బంధు, రైతు బీమా, రైతులకు 24గంటల ఉచిత కరెంట్ ఇస్తున్న ఏకైక ప్రభుత్వం బిఆర్ఎస్ ప్రభుత్వమే అని అదే బిజెపి కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో రైతుబంధు ఇస్తున్నారా రైతులు ఆలోచించాలని కోరారు. నాడు కాంగ్రెస్ హయాంలో కరెంటు లేక రైతులు అరిగోస పడ్డారని నేడు నిరంతర విద్యుత్‌తో పాటు సాగునీటి ప్రాజెక్టుల ద్వారా ప్రతి పల్లెకు సాగునీరందిస్తున్నామని సాగునీటితో బీడుబారిన భూములన్ని పంట భూములుగా మారి నేడు సస్యశ్యామలం అయ్యాయని, నాడు త్రాగునీటికి ప్రజలు ఇబ్బంది పడే వారని మిషన్ భగీరథ క్రింద ఇంటింటికి నీరందిస్తున్న ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానిదే అని కేసిఆర్ అని అన్నారు. ఆసరా పెన్షన్‌ల క్రింద వృద్దులకు, వికలాంగులకు, వితంతువులకు ఇస్తున్న పెన్షన్ 2వేల నుండి 3వేలకు పెంచామని దశల వారిగా సంవత్సరానికి 500 పెంచుతూ 5వేలు చేస్తామని, మహిళలకు 400 రూపాయలకు గ్యాస్ సిలెండర్ అందిస్తామని, ప్రజలందరికి బీమా సౌకర్యం కల్పిస్తామని, బడుగు బలహీన వర్గాలు దళితులు బాగుపడాలనే ఉద్దేశంతో దళిత బందు బీసీబందు, మైనార్టీ బందు, తీసుకొచ్చిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానిదే అని కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, పథకాలు ఏ రాష్ట్రంలో అయినా ఉన్నాయా ఆలోచించాలని సీఎం కేసిఆర్ అన్నారు. గత పది సంవత్సరాల క్రితం పాలకుర్తి నియోజకవర్గం ఎట్లుండే ఇప్పుడు ఎట్లుందో బేరీజు వేసుకోవాలని నాడు పాలకుర్తి నుండి ఎంతో మంది బ్రతుకుదెరువు కోసం వలసలు వెళ్లేవారని ఇప్పుడు పట్టణాల నుంచి పల్లెలకు తిరిగి వస్తున్నారని, వ్యవసాయ రంగం అభివృద్ధితో పాటు విద్యా, వైద్య, ఐటీ రంగాల్లో ముందుకు వెళుతున్నామని సీఎం కేసిఆర్ అన్నారు. అభివృద్ధిని కాంక్షించే బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఓర్వలేక కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి గోల్‌మాల్ మాటలు మాట్లాడుతున్నారని అట్టి గోల్‌మాల్ మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని ప్రజలు మోసపోయి కాంగ్రెస్‌కు ఓట్లు వేస్తే ఐదు సంవత్సరాలు కష్టాలే అని అభివృద్ధిలో పరుగులు పెడుతున్న తెలంగాణ అదోగతి పాలవుతుందని కేసిఆర్ అన్నారు. అభ్యర్థుల గుణగణాలు మంచి చెడులు చూడాలని ప్రజలకు ఏ కష్టం వచ్చినా ప్రజల మధ్యనే ఉంటూ తనతో కొట్లాడి అత్యధిక నిధులు తీసుకొచ్చి పాలకుర్తిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ పాలకుర్తిని ప్రగతి పథంలో నడుపుతున్న ప్రజల మనిషి దయాకర్‌రావు కావాలా అని... ఎన్నికలు వస్తేనే చుట్టపు చూపుగా వచ్చిపోయే అమెరికా అభ్యర్థిని నమ్మవద్దని ప్రజల మధ్య ఉండే దయాకర్‌రావును ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని సీఎం కేసిఆర్ పాలకుర్తి ప్రజలకు పిలుపునిచ్చారు.

**ధరణి తీసేస్తే దళారి రాజ్యమే**

**హాలియా, ప్రభాతవార్త, నవంబర్ 14:** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, రాష్ట్ర నాయకులు ధరణి రద్దు చేస్తామంటున్నారని, ధరణి తీసివేస్తే దళారి రాజ్యం వస్తుందని పొరపాటున కాంగ్రెస్ పార్టీ వస్తే రైతు బందుకు రామ్‌రామ్.. దళిత బంధుకు జైభీమ్.. అవుతుందని సీఎం కేసీఆర్ విమర్శించారు. మంగళవారం సాగర్ నియోజకవర్గ పరిధి హాలియాలో ఏర్పాటు చేసిన ప్రజా అశీర్వాద సభలో పాల్గొని మాట్లాడుతూ బీఆర్ఎస్ పుట్టింది తెలంగాణ ప్రజల బాగుకోసమేనన్నారు. 50 ఏళ్ల పాలనలో కాంగ్రెస్ ఏం చేసిందో చూశారని, ప్రజలను అదుకోవాలని ఏనాడు కాంగ్రెస్ పార్టీ ఆలోచించలేదని విమర్శలు గుప్పించారు. 24 గంటల కరెంటు ఇస్తే బీఆర్ఎస్ తరుపున ప్రచారం చేస్తానని నాడు అసెంబ్లీలో కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి అన్నారు. మేము చెప్పినట్లుగానే 24 గంటల కరెంటు ఇచ్చాం కానీ జానారెడ్డి మాట తప్పారని కౌంటర్ ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని తాను సీఎం అవుతానని జానారెడ్డి కలలు కంటున్నాడని కేసీఆర్ ఎద్దేవ చేశారు. రైతులకు అర్థికం కోసం తీసుకువచ్చిన రైతుబందు స్కీం దుబారా అని కాంగ్రెస్ నేతలంటున్నారని అలాంటి కాంగ్రెస్లోని ఏం చెద్దామని ప్రశ్నించారు. రైతులకు 24 గంటల కరెంటు వద్దని, 3 గంటలు చాలనీ కాంగ్రెస్ పార్టీ పీసీసీ అధ్యక్షులు చెబుతున్నారని విమర్శించారు. కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకె శివకుమార్ వారి రాష్ట్రంలో 5 గంటల కరెంటు ఇస్తున్నట్లు తెలిపారు. రైతులు బతకాలని వ్యవసాయం సిరికరణ చెందాలని, నీటి తీరువాను శాశ్వతంగా రద్దు చేశామని, రైతు బంధు



హాలియా ప్రజా ఆశీర్వాద సభలో అభివాదం చేస్తున్న సిఎం కెసిఆర్

రైతు భీమా, 24 గంటల కరెంటు అందిస్తున్నామని, అదే విధంగా పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. 3 కోట్ల మంది ప్రజలకు కంటి వెలుగు పరీక్షలు చేశామని, ఉప ఎన్నికల్లో భగత్‌ను గెలిపించడంతో డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేశామని, నెల్లికల్లు లిఫ్ట్‌ను కూడా నేనే ప్రారంభిస్తానన్నారు. 50 పడకల అస్పత్రి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏది రాయి... ఏది రత్నం... ప్రజలు ఆలోచన చేయాలని గ్రామాల్లో కార్యకర్తలు చర్చ పెట్టాలని, ఫించన్ 5వేలు, రైతు బంధు 16వేలు, సౌభాగ్య లక్ష్మి 3వేలు, సన్నబియ్యం అందిస్తామన్నారు. మేనిఫేస్టో గురించి గ్రామాల్లో కార్యకర్తలు ప్రజల దగ్గరకు తీసుకురావాలన్నారు. బలహీన వర్గాల ముద్దుబిడ్డ మీ మధ్యనే ఉండే నోముల భగత్‌ను హృదయపూర్వకంగా గుండెలకు హద్దుకని మరోకసారి గెలిపించండి కులం, మతం లేకుండా మీ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాడు. భగత్ అడిగిన అభివృద్ధి పనులు తీర్చలేనివి కావని భగత్‌ను గెలిపిస్తే అన్ని పనులు పూర్తి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు కేశవరావు, మధుసూదనాచారి, ఎన్నికల ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ట్రైకార్ చైర్మన్ రాంచందర్‌నాయక్, జెడ్‌పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, నాయకులు కడారి అంజయ్యయాదవ్, యడవల్లి విజయేందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, బొల్లేపల్లి శ్రీనివాస్‌రాజు, భగవాన్‌నాయక్, జవ్వాజి వెంకటేశ్వర్లు, మర్ల చంద్రారెడ్డి, సూర్యాభాష్యనాయక్, బొల్లం జయమ్మ, అబ్బిడి కృష్ణారెడ్డి, బాబురావునాయక్, సుదాకర్, మండల అధ్యక్షులు కూరాకుల వెంకటేశ్వర్లు, సత్యపాల్, నాగయ్య, చెన్నారెడ్డి, నరేందర్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

**SINGAM KUIL GREEN TUESDAY**
DrawDate on:14/11/23

| DAY - SINGAM SERIES Dr No:213 | DAY - KUIL SERIES Dr No:213 |
|---|---|
| 1st Prize Rs.100000/- 269249 | 1st Prize Rs.100000/- 925781 |
| 2nd Prize Rs.7000/- 41113 | 2nd Prize Rs.7000/- 13025 |
| 3rd Prize Rs.3500/- | 3rd Prize Rs.3500/- |
| 00985 09695 09811 36266 43007 | 18524 21088 32326 42668 62779 |
| 52139 68181 79539 82696 98599 | 66650 69796 78426 96943 98550 |
| 4th Prize Rs.200/- | 4th Prize Rs.200/- |
| 2086 2904 3106 4516 4832 6038 6421 | 0918 4174 4708 4743 6931 7103 8616 |
| 7386 7455 8182 | 8810 9077 9807 |
| 5th Prize Rs.100/- | 5th Prize Rs.100/- |
| 1482 3175 3249 3655 4267 4573 5531 | 0754 0997 1825 3982 6718 7911 8042 |
| 6972 6981 8065 | 8112 8442 8468 |
| 6th Prize Rs.50/- | 6th Prize Rs.50/- |
| 0137 1266 2895 5111 6533 7945 8969 | 0188 1833 3293 4335 5970 7344 9055 |
| 0297 1584 2928 5264 6926 7964 9073 | 0192 1910 3349 4344 6003 7383 9191 |
| 0358 1661 3220 5412 7011 8032 9115 | 0268 2032 3550 4567 6091 7456 9237 |
| 0369 1852 3240 5416 7098 8154 9214 | 0356 2046 3576 4575 6225 7512 9370 |
| 0402 1894 3312 5498 7162 8212 9343 | 0516 2267 3601 4623 6268 7679 9471 |
| 0455 1969 3410 5523 7166 8247 9408 | 0528 2286 3636 4897 6390 7899 9536 |
| 0475 2093 3443 5642 7267 8266 9595 | 0573 2382 3862 4939 6412 7980 9656 |
| 0555 2120 3449 5686 7271 8313 9720 | 0591 2447 3949 4963 6567 8130 9775 |
| 0725 2196 3803 5882 7286 8348 9963 | 0719 2543 4035 5041 6703 8559 9795 |
| 0756 2229 4076 5916 7310 8359 9995 | 0776 2669 4048 5559 6756 8671 9924 |
| 0775 2230 4406 6077 7364 8421 | 0939 2689 4070 5714 6796 8780 |
| 0778 2363 4449 6153 7436 8566 | 1154 2695 4072 5746 6904 8803 |
| 0807 2468 4463 6219 7530 8669 | 1182 2702 4086 5756 7113 8848 |
| 0950 2482 4663 6357 7536 8828 | 1642 2769 4220 5796 7257 8899 |
| 1132 2776 4712 6414 7543 8919 | 1761 3019 4295 5879 7339 9004 |

**ROSA DEAR SUPER TUESDAY**
DrawDate on:14/11/23

| DAY - ROSA SERIES Dr No:213 | DAY - DEAR SERIES Dr No:213 |
|---|---|
| 1st Prize Rs.100000/- 195137 | 1st Prize Rs.100000/- 386792 |
| 2nd Prize Rs.7000/- 61315 | 2nd Prize Rs.7000/- 51061 |
| 3rd Prize Rs.3500/- | 3rd Prize Rs.3500/- |
| 02137 06787 10002 11896 26887 | 18731 19862 27903 33520 38628 |
| 46358 84905 94126 99372 99877 | 47979 55955 88140 91005 95965 |
| 4th Prize Rs.200/- | 4th Prize Rs.200/- |
| 0418 0957 1670 4499 6678 6949 7108 | 0233 1438 2572 3870 5857 5973 6684 |
| 7629 8424 9900 | 8250 8640 9960 |
| 5th Prize Rs.100/- | 5th Prize Rs.100/- |
| 0003 0755 1147 1685 1911 2616 3676 | 0249 0732 1217 1446 2991 4860 6604 |
| 6896 7659 8167 | 7189 7931 9987 |
| 6th Prize Rs.50/- | 6th Prize Rs.50/- |
| 0025 1919 3363 4917 6171 7386 8888 | 0034 1965 3455 4682 6182 7617 9263 |
| 0460 2024 3424 4924 6203 7420 8968 | 0175 2000 3674 4690 6202 7657 9287 |
| 0568 2075 3447 5054 6213 7559 9097 | 0187 2081 3782 4764 6232 8376 9305 |
| 0846 2107 3533 5216 6370 7696 9453 | 0428 2104 3807 5031 6235 8389 9355 |
| 0905 2174 3566 5245 6389 7761 9610 | 0560 2279 3833 5348 6252 8455 9461 |
| 1039 2371 3904 5263 6400 7860 9780 | 0644 2463 3988 5491 6302 8556 9474 |
| 1048 2435 3959 5275 6423 7994 9794 | 1218 2563 3992 5529 6310 8615 9523 |
| 1157 2670 4009 5387 6477 8274 9797 | 1229 2570 4133 5535 6366 8739 9745 |
| 1181 2727 4032 5606 6797 8309 9902 | 1439 2695 4162 5677 6681 8770 9755 |
| 1221 2755 4133 5629 6911 8374 9906 | 1620 2820 4214 5696 6884 8792 9878 |
| 1259 2801 4368 5850 6988 8399 | 1628 2844 4224 5702 7055 8853 |
| 1414 3096 4387 5878 7079 8401 | 1645 3067 4352 5745 7155 8886 |
| 1635 3182 4482 5951 7144 8703 | 1649 3115 4438 5919 7257 9037 |
| 1641 3314 4622 6036 7283 8799 | 1772 3237 4454 5978 7325 9168 |
| 1664 3337 4770 6134 7286 8839 | 1801 3391 4557 6070 7434 9255 |

**THANGAM VAIRAM CHANCE TUESDAY**
DrawDate on:14/11/23

| DAY - THANGAM SERIES Dr No:213 | DAY - VAIRAM SERIES Dr No:72 |
|---|---|
| 1st Prize Rs.100000/- 436344 | 1st Prize Rs.50000/- 574876 |
| 2nd Prize Rs.7000/- 76344 | 2nd Prize Rs.7000/- 01040 |
| 3rd Prize Rs.3500/- | 3rd Prize Rs.3500/- |
| 11141 31090 38912 41463 73516 | 05605 23010 42924 54932 64718 |
| 75297 87012 91437 93846 95891 | 89044 90859 95487 96735 98191 |
| 4th Prize Rs.200/- | 4th Prize Rs.200/- |
| 0183 3276 3447 3655 4156 4559 7288 | 0526 1761 1953 5765 6509 6663 7339 |
| 7762 8317 8922 | 8168 8768 9368 |
| 5th Prize Rs.100/- | 5th Prize Rs.100/- |
| 0635 2208 2716 3668 4184 6441 7264 | 0832 1605 4074 4571 4620 5997 6469 |
| 8032 8396 8670 | 7265 8867 9669 |
| 6th Prize Rs.50/- | 6th Prize Rs.50/- |
| 0194 1321 2839 4991 5880 7099 8894 | 0037 1689 3797 5480 6861 8106 9197 |
| 0366 1399 3018 5110 6014 7246 9006 | 0296 1804 3822 5544 6968 8285 9240 |
| 0521 1489 3261 5159 6072 7413 9048 | 0326 2114 3840 5584 6976 8324 9280 |
| 0554 1615 3564 5164 6075 7493 9070 | 0359 2118 3876 5590 7367 8338 9369 |
| 0618 1804 3568 5264 6184 7520 9244 | 0405 2229 3879 5764 7420 8496 9721 |
| 0739 1835 3856 5284 6401 7757 9286 | 0541 2545 4069 5810 7477 8506 9841 |
| 0789 1864 3949 5296 6405 7904 9427 | 0627 2659 4362 6114 7561 8539 9863 |
| 0859 1913 4136 5403 6452 8025 9438 | 0891 2666 4572 6169 7598 8550 9892 |
| 0870 1964 4253 5429 6525 8286 9677 | 0948 3183 4953 6233 7723 8594 9912 |
| 1010 1976 4391 5435 6654 8292 9865 | 0974 3217 5000 6241 7824 8665 9974 |
| 1015 2199 4527 5467 6846 8543 | 1039 3250 5009 6274 7829 8742 |
| 1046 2486 4540 5520 6877 8652 | 1071 3277 5019 6640 7846 8822 |
| 1080 2603 4646 5527 6982 8702 | 1115 3345 5156 6711 7887 8860 |
| 1119 2621 4659 5530 7024 8761 | 1119 3686 5300 6749 7892 8949 |
| 1184 2737 4784 5646 7091 8800 | 1549 3727 5465 6831 8073 8995 |

**NALLANERAM MANI CHANCE TUESDAY**
DrawDate on:14/11/23

| DAY - NALLANERAM SERIES Dr No:213 | DAY - MANI SERIES Dr No:72 |
|---|---|
| 1st Prize Rs.50000/- 198638 | 1st Prize Rs.50000/- 139359 |
| 2nd Prize Rs.7000/- 13198 | 2nd Prize Rs.7000/- 72861 |
| 3rd Prize Rs.3500/- | 3rd Prize Rs.3500/- |
| 04815 15111 39071 58481 59268 | 22623 23420 33615 34698 66413 |
| 73417 75060 85590 90278 96634 | 66645 68463 82768 91613 93590 |
| 4th Prize Rs.200/- | 4th Prize Rs.200/- |
| 0087 0464 1998 3711 3812 5778 6153 | 1884 3340 4899 6363 6424 7205 8330 |
| 6389 6422 9962 | 8810 9086 9590 |
| 5th Prize Rs.100/- | 5th Prize Rs.100/- |
| 0835 1662 3806 4018 5671 7426 8754 | 0568 1847 2849 3487 3760 4753 7116 |
| 8921 9768 9994 | 7297 8103 8589 |
| 6th Prize Rs.50/- | 6th Prize Rs.50/- |
| 0057 1418 2990 4336 5576 6520 8669 | 0028 1653 3131 4504 5527 6865 9278 |
| 0225 1428 3028 4481 5643 6573 8678 | 0209 1726 3180 4604 5537 7193 9313 |
| 0302 1728 3095 4487 5678 6651 8757 | 0467 1833 3248 4732 5549 7722 9399 |
| 0332 1736 3112 4547 5746 6799 9388 | 0515 2073 3440 4756 5591 7779 9430 |
| 0435 2013 3125 4551 5915 7147 9449 | 0598 2096 3507 4759 5704 7798 9494 |
| 0445 2042 3350 4589 5998 7160 9666 | 0613 2151 3735 4995 5773 8210 9561 |
| 0473 2172 3432 4773 6007 7268 9678 | 0649 2164 3816 5086 5862 8473 9645 |
| 0750 2244 3536 4916 6067 7316 9884 | 0651 2347 4070 5122 6128 8480 9807 |
| 0774 2425 3629 4949 6116 7434 9946 | 0696 2385 4099 5137 6163 8556 9897 |
| 0808 2440 3773 5081 6189 7912 9997 | 0983 2477 4102 5305 6197 8609 9962 |
| 0947 2503 3985 5208 6320 7959 | 0989 2481 4132 5333 6207 8891 |
| 1001 2751 4134 5231 6432 7967 | 1164 2526 4320 5354 6224 8941 |
| 1082 2753 4140 5341 6467 8103 | 1215 2571 4333 5364 6452 8944 |
| 1341 2862 4159 5513 6473 8191 | 1230 3014 4443 5486 6767 9045 |
| 1348 2902 4259 5528 6513 8391 | 1584 3120 4469 5499 6838 9117 |

**KUMARAN VISHNU MOON TUESDAY**
DrawDate on:14/11/23

| DAY - KUMARAN SERIES Dr No:213 | DAY - VISHNU SERIES Dr No:213 |
|---|---|
| 1st Prize Rs.50000/- 427491 | 1st Prize Rs.50000/- 637374 |
| 2nd Prize Rs.7000/- 75534 | 2nd Prize Rs.7000/- 45939 |
| 3rd Prize Rs.3500/- | 3rd Prize Rs.3500/- |
| 13043 13861 17100 18601 21303 | 00641 03917 06988 25129 44570 |
| 39080 41416 62837 65181 99456 | 45192 72347 80890 83720 88851 |
| 4th Prize Rs.200/- | 4th Prize Rs.200/- |
| 0037 0533 1220 2024 4700 5800 7377 | 0545 1323 2879 3457 5111 5804 5856 |
| 7571 7932 9112 | 7754 8291 9245 |
| 5th Prize Rs.100/- | 5th Prize Rs.100/- |
| 0641 2600 3036 3105 3559 4081 4667 | 1869 4980 5035 6220 6415 7013 8320 |
| 5431 6512 7981 | 8351 9271 9407 |
| 6th Prize Rs.50/- | 6th Prize Rs.50/- |
| 0179 1229 2948 4572 6156 7892 9297 | 0210 1779 4126 5886 7077 8073 9405 |
| 0183 1294 2985 4658 6379 7898 9307 | 0250 1817 4158 6017 7154 8095 9437 |
| 0338 1451 3122 4704 6390 7984 9321 | 0282 1852 4215 6038 7163 8150 9587 |
| 0508 1490 3124 5046 6639 8238 9360 | 0383 2151 4228 6072 7281 8251 9607 |
| 0510 1531 3492 5116 6659 8444 9484 | 0482 2438 4297 6192 7578 8453 9622 |
| 0525 1670 3508 5124 6662 8486 9564 | 0537 2485 4756 6315 7626 8460 9702 |
| 0598 1755 3572 5228 6900 8661 9822 | 0593 2720 4890 6355 7659 8522 9803 |
| 0668 1828 3778 5426 6910 8694 9896 | 0688 2869 4954 6440 7692 8559 9831 |
| 0746 1996 4159 5485 6988 8818 9916 | 0692 2924 5178 6494 7779 8615 9869 |
| 0821 2138 4213 5796 7326 8826 9930 | 0829 3140 5372 6507 7829 8998 9933 |
| 0890 2151 4285 5918 7386 8977 | 1032 3321 5583 6556 7851 9072 |
| 0966 2318 4298 5946 7489 9075 | 1083 3394 5594 6592 7931 9101 |
| 1008 2560 4311 5997 7502 9121 | 1130 3603 5616 6847 7972 9169 |
| 1206 2672 4378 6001 7536 9173 | 1153 3786 5719 6900 7978 9199 |
| 1213 2890 4546 6125 7589 9249 | 1197 4112 5754 6975 8034 9281 |

**SWARNALAXMI LION CORAL TUESDAY**
DrawDate on:14/11/23

| SWARNALAXMI SERIES Dr No:213 | DAY - LION SERIES Dr No:72 |
|---|---|
| 1st Prize Rs.50000/- 929749 | 1st Prize Rs.50000/- 863942 |
| 2nd Prize Rs.7000/- 31726 | 2nd Prize Rs.7000/- 52999 |
| 3rd Prize Rs.3500/- | 3rd Prize Rs.3500/- |
| 14886 24343 39689 46567 46947 | 15328 24697 34470 43999 54356 |
| 51385 67890 75869 83550 95788 | 61547 75738 89354 89412 94573 |
| 4th Prize Rs.200/- | 4th Prize Rs.200/- |
| 0371 0803 2779 2835 4757 4854 7218 | 0014 2330 2988 3767 5144 5284 7416 |
| 7982 8316 8432 | 7752 8628 9980 |
| 5th Prize Rs.100/- | 5th Prize Rs.100/- |
| 0532 1150 3737 4934 8360 8421 8512 | 0027 0752 2125 2409 2755 2963 3609 |
| 9325 9685 9974 | 4136 7939 8629 |
| 6th Prize Rs.50/- | 6th Prize Rs.50/- |
| 0043 1357 3210 4187 6297 7489 9230 | 0029 1516 2623 3815 4735 6537 8521 |
| 0164 1388 3420 4229 6362 7563 9233 | 0041 1539 2652 3953 4946 6830 8667 |
| 0214 1883 3522 4774 6364 7614 9468 | 0107 1700 2801 3990 4997 6858 8829 |
| 0241 1885 3633 4966 6385 7669 9593 | 0153 1780 2881 4033 5164 7176 9329 |
| 0258 2044 3678 5386 6462 7766 9787 | 0281 1786 2952 4080 5205 7180 9399 |
| 0319 2103 3684 5479 6522 8194 9817 | 0303 1797 3137 4092 5261 7257 9730 |
| 0373 2127 3859 5537 6573 8267 9915 | 0493 1852 3225 4187 5270 7356 9750 |
| 0402 2290 3874 5546 6738 8535 9945 | 0529 1898 3291 4246 5300 7392 9819 |
| 0423 2308 3879 5570 6813 8588 9954 | 0732 2001 3337 4255 5321 7434 9835 |
| 0549 2446 4025 5836 6823 8593 9955 | 0740 2054 3390 4312 5431 7555 9943 |
| 0701 2521 4036 5958 7043 8695 | 0877 2232 3502 4327 5680 7685 |
| 0995 2735 4092 6004 7224 8828 | 1234 2283 3622 4397 5719 7860 |
| 1217 2911 4105 6111 7288 8905 | 1427 2332 3641 4469 6216 8121 |
| 1263 3013 4116 6115 7456 9090 | 1468 2542 3690 4478 6256 8128 |
| 1274 3201 4173 6202 7481 9219 | 1492 2610 3758 4534 6265 8273 |

# వచ్చేస్తాం.. ఇచ్చేస్తాం

≫ ఎర్ర శేఖర్, విష్ణువర్ధన్ రెడ్డి, టిపిసిసి మైనారిటి విభాగం చైర్మన్ షేక్ అబ్దుల్ సోహైల్, గద్వాల డీసీసీ అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పార్టీకి గుడ్‌బై చెప్పి బిఆర్ఎస్‌లో చేరి పార్టీ నాయకత్వాన్ని కంగుతినిపించారు. వారు పార్టీ మారటంతో ఓట్ల పరంగా ఎంతో కొంత నష్టం వస్తుందని అంచనావేసింది. పార్టీ మారకుండా స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేసిన వారితో పాటు బిఎస్‌పి, ఫార్వర్డ్ బ్లాక్ పార్టీల తరపున నిలబడ్డ వారితో మానిక్ ఠాక్రే ఆధ్వర్యంలో ఎఐసిసి కార్యదర్శి విష్ణునాథ్, పరిశీలకులు దీపదాస్ మున్షి, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్ చర్చలు మంగళవారం చర్చలు ప్రారంభించారు. సీనియర్ నేత కె జానారెడ్డి ఎన్నికల ప్రచారంలో ఉన్నందువల్ల ఈ రోజు చర్చల్లో పాల్గొనలేదు. హైదర్‌గూడలోని ఎమ్మెల్యే క్వార్టర్‌లో చర్చలు జరుపుతున్నారు. అందుబాటులో ఉన్న వారిని పిలిపించి మాట్లాడారు. మిగతా వారితో ఫోన్‌లోనే మాట్లాడుతున్నారు. బుధవారం మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్ల ఉపసంహారణ గడువు ఉండడంతో వీలైనంతమందిని తిరుగుబాటు బరి నుంచి తప్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. అదిలాబాద్ నుంచి సంజీవరెడ్డి, బోథ్ నుంచి వెన్నెల అశోక్, వరంగల్ వెస్ట్ నుంచి జంగా రాఘవరెడ్డి, నర్సాపూర్ నుంచి గాలి అనిల్‌కుమార్, ఇబ్రహీంపట్నంనుంచి డి రాంరెడ్డి, జుక్కల్ నుంచి సౌదాగర్ గంగారాం, బాన్స్‌వాడ నుంచి కాసుల బాలరాజు రెబల్స్ అభ్యర్థులుగా ఎన్నికల బరిలో ఉన్నారు. వారిని ఒక్కొక్కరిని పిలిపించి మాట్లాడుతున్నారు. వీళ్లే గాక బోథ్ నుంచి నరేష్‌జాదవ్, పాలకుర్తి నుంచి బండి సుధాకర్ గౌడ్, డోర్నకల్ నుంచి నెహ్రూ నాయక్ నామినేషన్లు దాఖలు చేయగా వారి నామినేషన్లను పలు కారణాలతో ఎన్నికల కమిషన్ తిరస్కరించింది. వారితో కూడా ఠాక్రే చర్చలు జరుపుతున్నారు. మరో 20 రోజుల్లో అధికారంలోకి రాబోతున్నామని, ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇస్తున్నారు. ఠాక్రే హామీ తర్వాత గాలి వినోద్‌కుమార్ మెత్తబడ్డారు. తన నామినేషన్ ఉపసంహారించుకుంటానని హామీ ఇచ్చారు. నర్సాపూర్‌లో అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదే బాటలో డోర్నకల్ రెబల్ నెహ్రూ నాయక్ , సిరిసిల్లలో ఉమేష్ రావు కూడా వెనక్కుతగ్గారు. పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా బండి సుధాకర్ గౌడ్ పాలకుర్తి నియోజకవర్గంలో పార్టీ అభ్యర్థి గెలుపుకోసం కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఆయన బాటలో మరికొందరు రెబల్స్ వెనక్కుతగ్గినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. సూర్యాపేట రెబల్ అభ్యర్థి రమేష్‌రెడ్డితో బుధవారం మాట్లాడాలని నిర్ణయించినట్టు సమాచారం. మరి కొందరు అభ్యర్థులతో ఠాక్రే జరిపిన చర్చలు విఫలమయ్యాయని తెలిసింది. వారు నామినేషన్లు విత్ డ్రా చేసుకునేందుకు ససేమిరా అన్నట్లు సమాచారం.

## 'చంద్రబాబు, వైఎస్, కెసిఆర్‌లే గుర్తుకొస్తారు'

≫ ముఖ్యమంత్రులే అన్నారు. హైదరాబాద్‌లో మంగళవారం ఒక హోటల్‌లో జరిగిన తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ... ప్రో బిజినెస్. ప్రో అర్బన్, ప్రో ఐటీ అంటే గుర్తుకు వచ్చేది చంద్రబాబు అని, ప్రో రూరల్, ప్రో అగ్రికల్చర్, ప్రో పూర్ అనేది వైఎస్ ఇమేజ్ అని అన్నారు. ఇక కెసిఆర్‌లో ఈ రెండూ కనిపిస్తాయని వివరించారు. కెసిఆర్ అంటే ప్రో అర్బన్, ప్రో రూరల్, ప్రో ఐటీ, ప్రో అగ్రికల్చర్, ప్రో పూర్ ఉంటాయన్నారు. కెసిఆర్‌ది అరుదైన సమతౌల్యం అన్నారు. కాబట్టి ఆయనను జార విడుచుకోవద్దని ఓటర్లకు సూచించారు. కరెంట్ ఇవ్వడం, మంచినీళ్లు ఇవ్వడం మాటల్లో చెప్పినంత సులభమైతే ఇన్నాళ్లు పాలించిన వారు ఎప్పుడో ఇచ్చేవారు కదా? అన్నారు. కెసిఆర్‌కు సొంతంగా నిర్ణయాలు తీసుకునే శక్తి ఉంది కాబట్టి ముందుకు సాగుతున్నామన్నారు. గతంలో రైతులు ఆస్తులు అమ్ముకున్నా ఇప్పులు కట్టలేని దుస్థితి ఉంటే, ఇప్పుడు రైతులు ధీమాగా ఉన్నారన్నారు. ఇది సుస్థిర ప్రభుత్వం, సమర్థ నాయకత్వం వల్ల సాధ్యమైందన్నారు.

## 'సీల్డ్‌కవర్' సిఎంలెందుకు?

≫ కరెంట్ సమస్యలు ఎలా ఉండెనో మీకు తెలుసు అని, ఇప్పుడు కరెంట్ పరిస్థితి ఎలా ఉందో మీకు తెలుసు అని పేర్కొన్నారు. ఇప్పుడు కడుపు నిండా కరెంట్ ఇచ్చుకున్నామని, వరి ధాన్యం దిగుబడిలో తెలంగాణ నంబర్ వన్ స్థానంలో ఉన్నామన్నారు. దేశానికి అన్నం పెట్టే స్థాయికి ఇవాళ ఎదిగినం అని, జిల్లాకు ఒక్క మెడికల్ కాలేజ్, జిల్లాకు ఒక్క నర్సింగ్ కాలేజీ పెట్టినం, ఎక్కడి వాళ్లకు అక్కడే వైద్యం అందిస్తున్నాం ' అని పేర్కొన్నారు. ఢిల్లీ చేతికి ఇస్తే మనం బ్రతుకుతామా... తొమ్మిదిన్నర సంవత్సరాలలో ఏం చేశాడు అనేది ఆలోచన చేయాలని పేర్కొన్నారు. బిఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎల్.రమణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ పద్మశాలిల ఇంట్లో ఉండి చదువుకున్నాడని, మన సమస్యలు తెలుసు అని, అందుకే తెలంగాణ ఉద్యమంలోనే మన బాధలపై, మన సమస్యలపై ఆలోచన చేశారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం హ్యాండ్లూమ్ అడ్వయిజర్ బోర్డ్‌ను రద్దు చేసిందని, కేంద్ర ప్రభుత్వం అనేక చేనేత కార్మికుల పథకాలు రద్దు చేసిందని ఆరోపించారు.



మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా మంగళవారం ఢిల్లీలోని శాంతివనం వద్ద నివాళులర్పిస్తున్న సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, కెసి వేణుగోపాల్ తదితరులు

## రైతుల ఖాతాల్లో నేటి నుంచి 'పిఎం కిసాన్' డబ్బు

≫ మూడువిడతలుగా కేంద్రం మొత్తం రూ.6 వేలు జమచేస్తుంది. ఇప్పటి వరకు 14 విడతలు రూ. 2 వేలు చొప్పున కేంద్రం విడుదల చేసింది. నిధులువిడుదల విషయాన్ని కేంద్రంఒక ప్రకటనలో తెలియజేసింది.

## కార్మిక ట్రాన్స్‌పోర్ట్ బోర్డు ఏర్పాటు చేస్తాం

≫ కరెంట్ వస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడగానే బిజెపి ఏడు మండలాలను ఆంధ్రలో కలిపేసిందని, దీంతో సీలేరు విద్యుత్ ప్రాజెక్టు మనకు దక్కకుండా పోయిందన్నారు. మొన్నటి వరకు కాంగ్రెస్‌లో ఉన్నోళ్లు బిజెపిలో, బిజెపిలో ఉన్నోళ్లు కాంగ్రెస్‌లో చేరుతుండ్రన్నారు. కరువు, కర్ఫ్యూ రెండూ కాంగ్రెస్‌కు పుట్టిన కవలలు, కాంగ్రెస్ పార్టీ బిఆర్ఎస్ మేనిఫెస్టోను కాపీ కొట్టిందన్నారు. కాంగ్రెస్ గట్టిగా ఉన్న చోట బిజెపి మద్దతు ఇస్తోందని, బిజెపి గట్టిగా ఉన్న చోట కాంగ్రెస్ మద్దతు ఇస్తోందని ఆరోపించారు.

## ఎన్నికల బాండ్ల వివరాలివ్వండి

≫ ఎన్నికల బాండ్ల పథకం లక్ష్య సాధనలో కొన్ని సమస్యలున్నాయని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఈ పథకం గోప్యత, విశ్వసనీయత కొందరికే పరిమితమవుతోందని పేర్కొంది. ఎస్‌బిఐ వద్ద ఉన్న వివరాలను దర్యాప్తు సంస్థల ద్వారా ఏ రాజకీయ పార్టీకి, ఎవరు ఎంత విరాళం ఇచ్చారన్నది అధికారంలో ఉన్న వారు తెలుసుకోగలరని పేర్కొంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో... తనిఖీల్లో ఇప్పటి వరకు మొత్తం రూ.571.80 కోట్లు స్వాధీనం చేసుకున్నారు. గత 24 గంటల్లోనే స్వాధీనం చేసుకున్న మొత్తం రూ.12.88 కోట్లుగా ఉంది.

## దొరల పాలనకు ఇక చరమగీతం

≫ అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రత్యేక రాష్ట్రం తెలంగాణ కోసం 12వందల మంది విద్యార్థుల త్యాగాలు, ఆత్మ బలి దానా లకు చలించిన కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియగాంధీ తెలంగాణను ఇచ్చాక అధికారం చేజికి కించుకొని కేసీఆర్ కుటుంబమే భోగాలు అనుభవిస్తున్నారని ఘూటుగా విమర్శించారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు వచ్చిందా..అని ప్రజలను అడుగుతూ గజ్వేల్‌లో కేసీఆర్ వేల ఎకరాల్లో వందల గాడీలు నిర్మించుకున్నారన్నారు. ల్యాండ్ పూలింగ్ జీవో తాత్కాలికంగానే రద్దు చేశారని మళ్లీ బిఆర్ఎస్‌కే ఓటు వేస్తే అధికారంలోకి వచ్చిన తర్వాత భూములను లాక్కుంటారని రైతులు ఆలోచించాలన్నారు. ఏబిసిడిలు రాయలేని దయాకర్‌రావుకు కేసీఆర్ మంత్రి పదవి ఇచ్చి తెలంగాణ ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ కట్ అని కేసీఆర్ కల్లబొల్లి మాటలు చెప్తున్నారని కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 24గంటల ఉచిత విద్యుత్‌తో పాటు రైతుబంధు పదిహేను వేలు, రెండు లక్షల రూపాయలు రైతులకు రుణమాఫీ, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, గృహిణికి నెలకు రూ.25వందలు, ఆసరా పింఛన్లు రూ.4వేలు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటించి రెండు లక్షల ఉద్యోగాలు, నిరుపేదలు ఇళ్లు నిర్మిస్తే రూ.5లక్షలు చెల్లి స్తామని హామీ ఇచ్చారు. రియల్ భూ దందా బడా కాంట్రాక్టర్ అరూరి రమేష్‌ను ఓడించి కాంగ్రెస్ అభ్యర్థి కెఆర్ నాగరాజును ఆశీర్వదించాలని వర్ధన్నపేట ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ వర్ధరాజేశ్వర్‌రావు, కాంగ్రెస్ హన్మకొండ జిల్లా అధ్యక్షులు నాయిని రాజేందర్‌రెడ్డి, నర్సంపేట కాం గ్రెస్ అభ్యర్థి దొంతి మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 15-11-2023, బుధవారం
శ్రీ శోభకృత్ నామ సంవత్సరం,
కార్తీక మాసం, దక్షిణాయనం,
శరదృతువు, శుక్లపక్షం
విదియ మ.1.47, జ్యేష్ఠ రా.3.00
వ.ఉ.8.54-10.29
దు.ఉ.11.29-12.14
శుభసమయం ఉ.6.00-6.40,
స్వాతి కార్తె
రాహుకాలం మ.12.00-1.30 వరకు

## వార్తాఫలం

**మేషం :** ప్రశాంతమైన మనస్సుతో ఆలోచించి విషయాలను అవగతం చేసుకోవడం మంచిది.

**వృషభం :** మంచి ఆశయంతో నూతన కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. సంతాన పురోభివృద్ధి బాగుంటుంది.

**మిథునం :** అగ్రిమెంట్స్ వాయిదా పడతాయి. నూతన బాధ్యతలను స్వీకరించవలసి వస్తుంది.

**కర్కాటకం :** వృత్తి, ఉద్యోగాల పరంగా బాధ్యతలను సక్రమంగా నిర్వహించగలుగుతారు.

**సింహం :** న్యాయ వ్యవహారాలు, కోర్టు తీర్పులు అనుకూలంగా ఉంటాయి. రుణాలు తీరుస్తారు.

**కన్య :** మీ ఆలోచనలు మెరుగ్గా, చురుగ్గా ఉంటాయి. అవకాశవాదులతోటి జాగ్రత్తగా మెలగండి.

**తుల :** వ్యక్తిగత విషయాలలో గోప్యతను పాటించి లాభపడగలుగుతారు. ధనలాభం.

**వృశ్చికం :** కొన్ని వాయిదాలతో ముఖ్యమైన కార్యక్రమాలకు తేదీలను ఖరారు చేసుకుంటారు.

**ధనుస్సు :** వ్యాపార పరంగా మీ వ్యూహాలు, అంచనాలు ఊహలకు అనుగుణంగా ఉంటాయి.

**మకరం :** పనిభారం అధికంగా ఉంటుంది. మీ వైఖరికి భిన్నంగా వ్యవహరిస్తారు. వాహనయోగం.

**కుంభం :** యోగాపైన ఆసక్తిని కనబరుస్తారు. మీ మేధస్సు పలువురి ప్రశంసలను అందుకుంటుంది.

**మీనం :** ఇష్టంలేని వారికి దూరంగా ఉంటారే తప్ప వివాదాలకు పోరు. ధనలాభం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## 18న అమిత్‌షా రోడ్‌షోలు

≫ ఉన్నారు. అదేవిధంగా నిర్మల్ నియోజకవర్గంలో బిజెపి కార్యకర్తలపై అధికార పార్టీ నాయకులు దాడులు చేస్తున్నారని, పోలీసు యంత్రాంగం పూర్తిగా విఫలమైందని, అధికారపార్టీ నేతలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం త్వరలో రాష్ట్రంలో కనుమరుగు కానుందన్నారు.

## బరిలో 2898

≫ రేపాల శ్రీనివాస్ వేసిన నామినేషన్లను ఎన్నికల సంఘం తిరస్కరించింది. ఆ వివరాలను ఇంకా అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో నిబంధనల ప్రకారం... ఒక్కో అభ్యర్థి రెండు అసెంబ్లీ నియోజకవర్గాలకు మించి పోటీ చేయకూడదు. అలాగే నాలుగు సెట్లకు మించి నామినేషన్లు దాఖలు చేయరాదు. కానీ ముగ్గురు స్వతంత్ర్య అభ్యర్థులు మాత్రం రెండు కన్నా ఎక్కువ స్థానాల్లో నామినేషన్లు దాఖలు చేశారు. ఖమ్మం బిఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సమర్పించిన అఫిడవిట్ నిబంధనల మేరకు లేవంటూ... వారం రోజుల క్రితం కాంగ్రెస్ లేవనెత్తిన అభ్యంతరాలను ఈసీ అధికారులు తిరస్కరించారు. దేవరకద్రలో కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన మధుసూధన్‌రెడ్డికి రెండు నియోజకవర్గాలలో ఓటు హక్కు ఉందంటూ బిఆర్ఎస్ అభ్యంతరం తెలిపింది. అయితే రెండో ఓటు రద్దు చేయాలంటూ ఆయన ఈసీకి దరఖాస్తు చేయడంతో... నామినేషన్‌ను అధికారులు ఆమోదముద్ర వేశారు. పాలకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి యశస్వినికి మూడు వేర్వేరు చిరునామాలు ఉన్నాయంటూ బిఆర్ఎస్ ప్రతినిధులు అభ్యంతరం తెలపగా... ఎన్నికల నిబంధనల మేరకు అలతా చిరునామాలు ఉండవచ్చని ఈసీ వచ్చిన అభ్యంతరాలను రిజెక్టు చేసింది. అలాగే అలంపూర్ బిఆర్ఎస్ అభ్యర్థి విజయుడు ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగానికి రాజీనామా చేయకుండానే నామినేషన్ వేశారన్న అభ్యంతరాలను అధికారులు పరిగణలోకి తీసుకోలేదు. రాష్ట్ర వ్యాప్తంగా బిఎస్పీకి చెందిన 8 మంది అభ్యర్థులు నామినేషన్లను కొన్ని కారణాలతో ఈసీ తిరస్కరించింది.

## 25న రానున్న ఏచూరి

≫ చేస్తున్న నియోజకవర్గాల్లో జాతీయ నాయకులు ప్రచారంలో పాల్గొనబోతున్నారు. త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్, పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, సుభాషిణీ అలీ, విజయరాఘవన్, కేంద్రకమిటీ సభ్యులు పి మధు తదితరులు పాల్గొంటారని తెలిపారు. జాతీయనాయకులు సుమారు వారం రోజులకుపైగా రాష్ట్రంలో జరిగే ఎన్నికల్లో ప్రచారంలో పాల్గొంటారని నాయకులు చెబుతున్నారు. త్వరలోనే జాతీయ పార్టీ నాయకులు పాల్గొనే ప్రచారంకు సంబంధించిన షెడ్యూల్‌ను తెలంగాణ రాష్ట్ర పార్టీ నాయకులు విడుదల చేయనున్నట్టు తెలిపారు.



ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM ఖమ్మం fb.com/vaartha

PUBLISHED FROM KHAMMAM, HYDERABAD, VIJAYAWADA, VISAKHAPATNAM, RAJAHMUNDRY, KADAPA, NIZAMABAD, ONGOLE, WARANGAL, TIRUPATHI, ANANTAPUR, KURNOOL, KARIMNAGAR, MAHABUBNAGAR, NELLORE, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM,SRIKAKULAM

15-11-2023 బుధవారం సంపుటి : 29 సంచిక : 285 పేజీలు : 8+16 వెల : 6.50



తెలంగాణలో పవన్ ప్రచారంపై ఇంకా అస్పష్టత 7లో

నాంపల్లి అగ్ని ప్రమాదంపై కొనసాగుతున్న విచారణ







# బరిలో 2898

## గజ్వేల్‌లో అధికంగా 114 మంది, కామారెడ్డిలో 58 మంది పోటీ

### తిరస్కరించిన నామినేషన్లు: 1900

### ఉపసంహారణకు నేడు తుది గడువు




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్14:** నామినేషన్ల స్క్రూటీనీ పూర్తి అయింది. అన్ని దరఖాస్తులు పరిశీలించిన తర్వాత అసెంబ్లీ ఎన్నికల బరిలో 2898 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని ఈసీ ప్రకటించింది. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు 4,798 మంది నామినేషన్లు వేయగా... సోమవారం జరిగిన స్క్రూట్నీలో రాష్ట్ర వ్యాప్తంగా 1900 నామినేషన్లు తిరస్కరించారు. పరిశీలన తర్వాత మిగిలిన 2898 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని ఈసీ ప్రకటించింది. గులాబీ బాస్ కెసిఆర్ పోటీ చేస్తున్న గజ్వేల్‌లో అత్యధికంగా 114 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. అయితే గజ్వేల్‌లో పలువురు స్వతంత్ర అభ్యర్థుల ఉపసంహారణ కోసం బిఆర్ఎస్ ప్రయత్నాలు చేస్తోంది. ఈ మేరకు మంగళవారం సాయంత్రంలోగా గజ్వేల్‌లో కొందరు నామినేషన్లు ఉపసంహారించుకోగా, ప్రస్తుతానికి 86 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని అనధికార సమాచారం. గజ్వేల్ రిటర్నింగ్ అధికారి దీనిపై స్పష్టత ఇవ్వాల్సి ఉంది. సిఎం కెసిఆర్ పోటీ చేస్తున్న మరో నియోజకవర్గం కామారెడ్డిలో 58 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఇదే నియోజకవర్గం నుంచి టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కూడా పోటీ చేస్తున్నారు. కాగా, మేడ్చల్‌లో 67, మంది, ఎల్బీనగర్‌లో 57 మంది, మునుగోడు 50 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. మంత్రి కెటిఆర్ పోటీ చేస్తున్న సిరిసిల్లలో 23 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. మంత్రి హరీష్‌రావు పోటీ చేస్తున్న సిద్దిపేటలో 37 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. రేవంత్‌రెడ్డి పోటీ చేస్తున్న కొడంగల్‌లో 15 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా... ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నారాయణపేటలో అత్యల్పంగా కేవలం 7 మందే బరిలో ఉన్నారు. బాల్కొండ నుంచి తొమ్మిది మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. కాగా, నామినేషన్ల ఉపసంహారణకు బుధవారం మధ్యాహ్నం 3 గంటల వరకు గడువు ఉంది. బుధవారం లోగా కొందరు ఇండిపెండెంట్ అభ్యర్థులు, రెబల్స్ కూడా నామినేషన్లు ఉపసంహారించుకుంటే... పోటీలో ఉన్న వారి సంఖ్య ఇంకా తగ్గుతుంది. హుజురాబాద్‌లో ఈటల రాజేందర్ భార్య జమున,య కోరుట్లలో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, నాగార్జునసాగర్‌లో మాజీ మంత్రి జానారెడ్డి, మిర్యాలగూడలో మాజీ ఎమ్మెల్యే ≫2



### రైతుల ఖాతాల్లో నేటి నుంచి

# 'పిఎం కిసాన్' డబ్బు

## జార్ఖండ్‌లో విడుదల చేయనున్న ప్రధాని మోడీ

**హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త:** రైతులకు పెట్టుబడి సహాయం కోసం అందిస్తున్న ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పిఎం కిసాన్) పథకం డబ్బులు బుధవారం నుంచి రైతుల ఖాతాల్లో జమకానున్నాయి. 15 వ విడత కింద అర్హులైన దాదాపు 8 కోట్ల మంది రైతులకు రూ. 2 వేలు కేంద్ర ప్రభుత్వం జమ చేస్తుంది. ఝార్ఖండ్‌లోని ఖుంటిలో జరిగే బుధవారం ఉదయం 11.30 గంటలకు జరిగే ఒక కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ నిధులు విడుదల చేస్తారు. ఈ కేవైసీ పూర్తి చేసిన రైతుల ఖాతాల్లో ఈ నిధులు విడుదల అవుతాయి. ఏడాదికి ≫2

# కాంగ్రెస్ వస్తే కష్టాలే



మంగళవారం పాలకుర్తి ప్రజా ఆశీర్వాద సభలో ప్రసంగిస్తున్న సిఎం కెసిఆర్



సభకు హాజరైన ప్రజలు

## అభ్యర్థుల మంచి చెడులు ఆలోచించి ఓటువేయాలి

### పాలకుర్తి పదేళ్లలో ఎంత మారిందో చూడండి: ప్రజా ఆశీర్వాద సభలో సిఎం కెసిఆర్

**ప్రభాతవార్తప్రతినిధి- హన్మకొండ:** ఉమ్మడి రాష్ట్రాన్ని 55 సంవత్సరాలు పరిపాలించిన కాంగ్రెస్ హయాంలో పైరవీలే తప్పా ప్రజల కష్టాలను పట్టించుకున్న పాపాన పోలేదని ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ఒక్కసారి అవకాశం ఇవ్వమని తెలంగాణ రాష్ట్ర ప్రజలను కోరుతుందని కాంగ్రెస్‌కు ఓట్లు వేస్తే ధరణిని రద్దు చేస్తారటా.. ధరణి రద్దు అయితే రైతు బందు ఎట్లస్తది. అందుకే ఓటర్లు పార్టీల చరిత్రను చూసి అభ్యర్థుల మంచి చెడులను చూసి ఆలోచించి ఓట్లు వెయ్యాలని బిఆర్ఎస్ అధినేత సీఎం కేసిఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం పాలకుర్తి బిఆర్ఎస్ అభ్యర్థి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అధ్యక్షతన తొర్రూరులో జరిగిన ప్రజా ఆశీర్వాద భారీ బహిరంగ సభకు సీఎం కేసిఆర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సీఎం కేసిఆర్ మాట్లాడుతూ పది సంవత్సరాల క్రితం తెలంగాణ రైతులకు ≫2

## పోల్ పోరు

### 18న అమిత్‌షా రోడ్‌షోలు



**హైదరాబాద్, నవంబరు 14 ప్రభాతవార్త:** బిజెపి ఎన్నికల ప్రచారాల్లో భాగంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈనెల 18వ తేదిన రాష్ట్రానికి రానున్నారని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 18న గద్వాల నియోజకవర్గంలో 10గంటలకు, 12 గంటలకు నల్గొండ పట్టణంలో, 2గంటలకు వరంగల్ తూర్పు నియోజకవర్గాలలో పాల్గొంటారని తెలిపారు. సాయంత్రం 4గంటలకు రాజేంద్రనగర్ నియోజకవర్గంలో రోడ్ షోలో పాల్గొంటారని వెల్లడించారు. గద్వాల నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వ్యవహరించి తీరుపై రాష్ట్ర ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినట్లు ప్రేమేందర్‌రెడ్డి వెల్లడించారు. ఎన్నికల అధికారిని కలిసిన వారిలో లీగల్ సెల్ నాయకులు ఆంటోనిరెడ్డి, జి.రామారావులు ≫2

### 25న రానున్న ఏచూరి



**హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి. అందులో భాగంగా సీపీఎం కూడా రాష్ట్రంలో 19 స్థానాల్లో స్వతంత్రంగా పోటీ చేస్తుంది. ఇప్పటికే 19 స్థానాల్లో సీపీఎం అభ్యర్థులు ప్రచారాన్ని ప్రారంభించారు. అభ్యర్థులతోపాటు జిల్లా, రాష్ట్రస్థాయి నాయకులు ప్రచారంలో పాల్గొంటున్నారు. సీపీఎం పోటీ చేస్తున్న నియోజకవర్గాల్లో ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పాల్గొనబోతున్నారు. ఈ నెల 25న జరిగే బహిరంగ సభలో ఏచూరి పాల్గొంటారని పార్టీ నాయకులు చెబుతున్నారు. సీపీఎం పార్టీ పోటీ ≫2

# 'సీల్డ్‌కవర్' సిఎంలెందుకు?

## ఢిల్లీ చేతికి పగ్గాలిస్తే బతకగలమా!

### దేశానికి అన్నంపెట్టే స్థాయికి ఎదిగిన తెలంగాణ: మంత్రి కెటిఆర్



మంగళవారం వీవర్స్ వెల్ఫేర్ సమావేశంలో మంత్రి కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్14:** తెలంగాణలో గడిచిన తొమ్మిదిన్నర సంవత్సరాల కాలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసుకున్నామని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. రాష్ట్రం వచ్చాక మౌలిక వసతులు బాగుపడ్డాయని... కరెంట్,తాగు,సాగు నీటి సమస్యలను పరిష్కరించుకున్నామని చెప్పారు. ధాన్యం దిగుబడిలో తెలంగాణ నంబర్ వన్ స్థానంలో ఉందని, దేశానికే అన్నం పెట్టే స్థాయికి ఎదిగిందని కెటిఆర్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం తెలంగాణ స్టేట్ హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ వీవర్స్ వెల్ఫేర్ ఆసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో కెటిఆర్ పాల్గొన్నారు. రాష్ట్రంలో వెయ్యి గురుకుల పాఠశాలలు పెట్టి పేద బిడ్డలకు ఉచితంగా చదువు అందిస్తున్నామని, ఒక్కో విద్యార్థిపై రూ.లక్ష ఖర్చు చేస్తున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు చేసినవి గుర్తుకు తెచ్చుకోవాలి. గడిచిన తొమ్మిదిన్నర సంవత్సరాల కాలంలో ఎంతో అభివృద్ధి చేసి చూపించామని వివరించారు. 65 ఏళ్లు పాలించిన వారు వచ్చి ఒక్క ఛాన్స్ అని అడుగుతున్నారని, అన్ని రంగాలను అన్ని విధాలా ఆదుకున్న ఏకైక ప్రభుత్వం బిఆర్ఎస్, మన ముఖ్యమంత్రి కెసిఆర్ మాత్రమేనని తెలిపారు. కొత్త సీసాలో పాత సారానే ఇప్పుడున్న కాంగ్రెస్ పార్టీ అని ఎద్దేవా చేశారు. సంపద పెంచాలి. పేదలకు పంచాలి అనేదే మా నినాదం అని వెల్లడించారు. తెలంగాణలో దృఢమైన నాయకత్వం,స్థిరమైన ప్రభుత్వం ఉండాలని తెలిపారు. 6నెలలకు ఒకరు ముఖ్యమంత్రి అయ్యే ప్రభుత్వం మనెందుకు? ఢిల్లీ నుంచి సీల్డ్ కవర్‌లో వచ్చే సిఎంలు మనకెందుకు? అని కెటిఆర్ అన్నారు. ఇది చేతల ప్రభుత్వం... చేనేతల ప్రభుత్వం' అని పేర్కొన్నారు. ఎవరి చేతుల్లో రాష్ట్రాన్ని పెట్టాలో ఆలోచన చేయాలి ఎవరుచేతుల్లో పెడితే బాగుంటుందో మీరు ఆలోచించాలిఅని పిలుపునిచ్చారు. ఆవైపు 11 మంది ముఖ్యమంత్రులున్నారు. ఒక్క నల్లగొండలోనే నలుగురు ముఖ్యమంత్రులు ఉన్నారు. ఒకాయన ఆ పార్టీలో ముహూర్తం కూడా పెట్టాడు, పిల్లే లేదు కానీ పెళ్లి ముహూర్తం పెట్టాడు ఆయన అని కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డిపై పరోక్ష వ్యాఖ్య చేశారు. ఇటువైపు ఒక్క కెసిఆర్ మాత్రమే ఉన్నారు అని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో మరిన్ని టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు చేసుకుందాం,చేనేత రుణమాఫీ చేసుకుందాం' అని పేర్కొన్నారు. నేతన్నల బాగు కోసం ఏమైనా చేసేందుకు ఈ ప్రభుత్వం సిద్ధంగా ఉందని కెటిఆర్ తెలిపారు. ≫2

## 'చంద్రబాబు, వైఎస్, కెసిఆర్‌లే గుర్తుకొస్తారు'

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్14:** కెసిఆర్,చంద్రబాబు,వైఎస్ రాజశేఖర్‌రెడ్డిలపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్,మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఆసక్తికర వ్యాఖ్యలుచేశారు. గత 25 ఏళ్లను చూసుకుంటే మనకు గుర్తుకు వచ్చేది కేవలం ముగ్గురు ≫2



మంగళవారం తెలంగాణ భవన్‌లో కార్మిక సంఘాల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీష్

# కార్మిక ట్రాన్స్‌పోర్ట్ బోర్డు ఏర్పాటు చేస్తాం

### -మంత్రి హరీష్ రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్14:** ఆటో కార్మికులకు, రవాణా కార్మికుల ట్రాన్స్‌పోర్ట్ బోర్డు ఏర్పాటు డిమాండ్‌ను మూడోసారి అధికారంలోకి రాగానే నెరవేరుస్తామని వైద్యఆరోగ్య,ఆర్థిక శాఖల మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఆటో కార్మికులకు త్రైమాసిక పన్నును రద్దు చేసింది కెసిఆర్ అని, ట్రాక్టర్లకు పన్ను రద్దు చేసింది కూడా కెసిఆరేనని తెలిపారు. మళ్లీ బిఆర్ఎస్‌ను గెలిపిస్తే ఆర్పీలు,వీఏవోల జీతాన్ని రెట్టింపు చేస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం నిర్వహించిన 44 కార్మిక సంఘాల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. కాంగ్రెస్,బిజెపి పాలిత రాష్ట్రాల కంటే తెలంగాణలోనే ఉద్యోగుల జీతాలు ఎక్కువ అని పేర్కొన్నారు. కార్మికుల ఉసురు పోసుకున్న పార్టీ బిజెపి అని, రైల్వేలు,రైల్వే లైన్లు,బిఎస్ఎన్ఎల్, ఎల్ఐసీలను అమ్మేశారని, అమ్మడు తప్ప కొత్తగా కంపెనీలు,ఫ్యాక్టరీలు పెట్టడం బిజెపికి తెలియదన్నారు. రేవంత్‌రెడ్డి మూడు గంటల కరెంట్ చాలు అని, కర్ణాటక డిప్యూటీ సిఎం ఐదు గంటలు ఇస్తామంటున్నాడని ఎద్దేవా చేశారు. గతంలో పవర్ హాలిడేలు ఉండేవని, పారిశ్రామిక వేత్తలు ధర్నాలు చేసేవారని, ఇప్పుడు 24 గంటల ≫2

# వచ్చేస్తాం.. ఇచ్చేస్తాం



## రెబెల్ అభ్యర్థులకు కాంగ్రెస్ బుజ్జగింపులు

### తిరుగుబాటు అభ్యర్థుల ఉపసంహారణకు కాంగ్రెస్ తంటాలు

### మరో 20 రోజుల్లో మనవే పగ్గాలంటున్న ఠాక్రే

### వెనక్కుతగ్గిన గాలి అనిల్‌కుమార్, ఉమేష్‌రావు, బండి సుధాకర్

**హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త:** నామినేషన్ల ఉపసంహారణకు కొద్ది గంటల సమయమే ఉండడంతో పార్టీ విధానానికి వ్యతిరేకంగా తిరుగుబాటు అభ్యర్థులుగా నామినేషన్లు వేసిన వారిని ఉపసంహారింపజేసేందుకు కాంగ్రెస్ పార్టీ తంటాలు పడుతోంది. పోటినుంచి వారిని తప్పించడం తలనొప్పిగా మారింది. ఎన్నికల్లో గెలిచి మరో 20 రోజుల్లో అధికార పగ్గాలు చేపట్టాలనుకుంటున్న కాంగ్రెస్ పార్టీకి రెబల్స్ రూపంలో సొంత పార్టీ వారే విపక్షంగా మారే పరిస్థితి దాపురించింది. పార్టీ అభ్యర్థులుగా టికెట్లు దక్కకపోవడంతో దాదాపు 15 మందికి పైగారెబల్స్‌గా నామినేషన్లు వేసినట్లు పార్టీ గుర్తించింది. వారిని దారిలోకి తెచ్చుకునేందుకు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ మానిక్ రావు ఠాక్రే స్వయంగా రంగంలోని దిగారు. నాలుగు విడతలుగా అభ్యర్థులను పార్టీ ప్రకటించిన విషయం తెలిసిందే. తొలివిడతగా 55 మంది అభ్యర్థుల జాబితా ప్రకటించిన తర్వాత పెద్దగా అసంతృప్తి బయటకు రాలేదు. కానీ, రెండో జాబితా 45 మంది అభ్యర్థుల జాబితా తర్వాత టికెట్లు రాని వారు రగిలిపోయారు. టికెట్లు రాని నేతలు కొందరు ఏకంగా గాంధీభవన్‌పై దాడి చేశారు. టీపీసిసి చీఫ్ ఎ రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. టికెట్లు ఆశించి రాకపోవడంతో భంగపడిన సీనియర్‌నేతలు మాజీమంత్రులు పొన్నాల లక్ష్మయ్య, నాగం జనార్ధనరెడ్డి, మాజీ ఎమ్మెల్లేలు ≫2

## ఎన్నికల బాండ్ల వివరాలివ్వండి

### రాజకీయ పార్టీలకు ఇసి నోటీసులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబర్14:** రాజకీయ పార్టీలకు వచ్చిన ఎన్నికల బాండ్ల వివరాలివ్వాలని కోరుతూ కేంద్ర ఎన్నికల సంఘం అన్ని పార్టీలకు నోటీసులు ఇచ్చింది. బుధవారం సాయంత్రం 5 గంటల్లోగా పార్టీలకు అందిన ఎలక్టోరల్ బాండ్ల వివరాలను సీల్డ్ కవర్‌లో అందించాలని ఆదేశించింది. ఈ మేరకు అన్ని రాజకీయ పార్టీలకు చెందిన అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కోశాధికారులకు ఈసీ నోటీసులు పంపించింది. ఈనెల 2న సుప్రీంకోర్టుకు ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా నోటీసులు ఇచ్చినట్లు ఈసీ పేర్కొంది. నవంబర్ 3న తొలుత నోటీసులు ఇచ్చిన ఈసీ.. వివరాలు పంపాలని తాజాగా మరో సారి నోటీసులు జారీ చేసింది. రాజకీయ పార్టీల నిధుల సమీకరణలో పారదర్శకత కోసం తీసుకొచ్చిన ≫2



# దొరల పాలనకు ఇక చరమగీతం

### ల్యాండ్ పూలింగ్ జిఒ రద్దు తాత్కాలికమే

### సంపన్న రాష్ట్రాన్ని పూర్తిగా దిగజార్చారు

### వర్ధన్నపేట కాంగ్రెస్ విజయబేరి సభలో పిసిసి చీఫ్ రేవంత్

**హన్మకొండ/మామునూర్,ప్రభాతవార్త:** నీళ్ల నిధులు నియామకాల పేరుతో తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తానని చెప్పిన కేసీఆర్ మాయమాటలతో మోసం చేసి అధికారంలోకి వచ్చి ధనిక రాష్ట్రమైన తెలంగాణను అప్పుల తెలంగాణగా మార్చి ప్రజల సంక్షేమాన్ని విస్మరించిన దొరల గడిల పాలనకు చరమగీతం పాడి ప్రజల పాలన కోసం కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు అనుముల రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మామునూర్‌లో జరిగిన వర్ధన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ విజయభేరి భారీ బహిరంగ సభకు పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ముఖ్య ≫2

వార్త

గురువులేని బడి, దేవుడు లేని గుడి, మనసు లేని మనిషి సమానం.

- సత్యసాయి బాబా

# ప్రాణాలు తీస్తున్న నిర్లక్ష్యం!

హైదరాబాద్‌లో మరో అగ్నిప్రమాదం చోటుచేసుకున్నది. అగ్నికీలలు మృత్యువు రూపంలో దూసుకువెళ్లి తొమ్మిది మంది అమాయకుల ప్రాణాలను కబళించాయి. మరోపది మందివరకు గాయపడగా అందులో ముగ్గురు పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మాటలకు అందని ఈ విషాదం దీపావళి పండుగ మరుసటిరోజు సోమవారం ఉదయం హైదరాబాద్ నాంపల్లిలో నిత్యం జనసంచారంతో కళకళలాడే బజార్‌ఘాట్‌లో ఒక అపార్ట్‌మెంట్‌లో ఈ దారుణం చోటుచేసుకున్నది. గ్రౌండ్‌ఫ్లోర్‌లో నిల్వ ఉంచిన రసాయన డ్రమ్ములపై మంటలు వ్యాపించడంతో ప్రమాదం సంభవించింది. మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు ఉండడం మరింత విషాదకరం. ఒక కుటుంబానికి చెందిన భార్యాభర్తలు ఇద్దరూ మృతిచెందగా వారి కుమారుడు డెబ్బైశాతంపైగా గాయాలతో ఆస్పత్రిలో మృత్యువుతోపోరాడుతున్నాడు. అపార్ట్‌మెంట్ యజమాని సినిమా షూటింగ్‌ల్లో పేలుళ్లకు ఉపయోగించే ఎఫ్ఆర్‌పి (ఫైబర్ గ్లాస్ రీయిన్‌ఫోర్స్డ్ ప్లాస్టిక్ )కెమికల్స్, ప్లాస్టిక్ తయారీకి ఉపయోగించే ముడిరసాయనికాలు గ్రౌండ్ ఫ్లోర్‌లో పెద్దఎత్తున నిల్వచేశారు. గత రెండు దశాబ్దాలుగా ఈ గ్రౌండ్‌ఫ్లోర్‌ను గోదాములుగా మార్చి ముడిసరుకులను నిల్వ చేసి సరఫరా చేస్తున్నారు. మిగిలిన నాలుగు అంతస్తుల్లో తొమ్మిది కుటుంబాలకు అద్దెకిచ్చారు. సోమవారం ఉదయం సమయంలో విద్యుత్‌షాక్ సంభవించడంతో నిప్పురవ్వలు రేగి మంటలు వ్యాపించాయి. రసాయనిక డ్రమ్ములు పక్కన ఉండడంతో భారీ పేలుడు సంభవించి మంటలు క్షణాల్లోనే పై అంతస్తులకు వ్యాపించాయి. మంటలతోపాటు దట్టమైన పొగ వ్యాపించడంతో శ్వాస ఆడక కొందరు మరణించారు. ఆదివారం దీపావళి సంబరాల్లో మునిగిన నగర ప్రజలు సోమవారం ఉదయం ఈఅగ్నిప్రమాదం విషయం తెలుసుకొని ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. అగ్నిమాపక సిబ్బంది యుద్ధప్రాతిపదికపై చర్యలు చేపట్టి దాదాపు ఇరవై మందిని కాపాడారు. ముఖ్యమంత్రితోసహా పలువురు నేతలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం మృతులకు ఐదు లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. గతంలో శివారు ప్రాంతాల్లో పారిశ్రామిక వాడల్లో జరిగే అగ్నిప్రమాదాలు ఇటీవల కాలంలో జనవాసాల్లో అక్రమంగా ఏర్పాటు చేసుకున్న గోదాముల్లో జరుగుతున్నాయి. ఇవి రానురాను పెరిగిపోతుండడం ఆందోళన కలిగించే అంశం. ప్రమాదాలు జరిగినప్పుడు భవిష్యత్తులో పునరావృతంకాకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటామని నిబంధనలకు విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా చర్యలు తప్పవని హెచ్చరికలే తప్ప ఆచరణ లేకుండాపోవడంతో ఈ ప్రమాదాలకు అంతే లేకుండాపోతున్నది. చట్టవ్యతిరేకంగా సాగుతున్న వాణిజ్యసంస్థలు, చిన్నాచితక గోదాములు, నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నాయి. వీటిగురించి పోలీసులు, మున్సిపల్ అధికారులు అగ్నిమాపక అధికారులు పట్టించుకున్నట్లు కన్పించడం లేదు. ఫలితంగా తరచుగా చోటుచేసుకుంటూ అమాయకుల ప్రాణాలను బలిగొంటున్నాయి. ఈ యేడాది చివరిలో రామ్‌గోపాల్ పేటలోని ఓ ఆరు అంతస్తుల భవనంలో సంభవించిన అగ్నిప్రమాదం భారీ నష్టాన్ని చేకూర్చింది. చుట్టుపక్కల ఉన్న ప్రజలను ఉన్నపళంగా ఖాళీ చేయించి మంటలను ఆర్పేందుకు అగ్నిమాపకదళం జంటనగరాల్లోని అన్ని ఫైర్ ఇంజన్లను సమీకరించి దాదాపు ముప్పైగంటలకుపైగా శ్రమించాల్సి వచ్చింది. మళ్లీ మార్చినెలలో సికింద్రాబాద్‌లో స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో జరిగిన మరొక భారీ ప్రమాదం ఆ ప్రాంత ప్రజల్లో కలవరం రేపింది. ఈ ప్రమాదంలో ఆరుగురు నిరుద్యోగ యువకులు మరణించగా మరో అరడజను మందికిపైగా గాయపడ్డారు. గతయేడాది మార్చి నెలలో సికింద్రాబాద్‌లోని బోయిగూడ వద్ద ఒక టింబర్ డిపోలో జరిగిన అగ్నిప్రమాదంలో ఏకంగా పదకొండు మంది మరణించారు. వీరంతా పొట్టకూటికోసం బీహార్ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన వలస కూలీలు. ఈ 11 మంది సజీవదహనం కావడంతో దేశవ్యాప్తంగాసంచలనం రేగింది. గతయేడాది సెప్టెంబర్ సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో సమీపంలోని ఒక హోటల్‌లో సంభవించిన ప్రమాదంలో ఎనిమిది మంది దుర్మరణం పాలయ్యారు. ఆ తర్వాత రామ్‌గోపాల్‌పేటలో జరిగిన మరో ప్రమాదం లో ముగ్గురు కాలిబూడిదైపోయారు. తాజాగాసోమవారం జరిగిన ప్రమాదానికి కారణాలపై దర్యాప్తునకు ఆదేశిస్తున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి. యధాప్రకారం ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. వాస్తవంగా చూస్తే జంటనగరాల శివార్లలోని కొన్ని పరిశ్రమల్లో ఈ ప్రమాదాలు గతంలో ఎక్కువగా సంభవించేవి. నేడు పారిశ్రామికవాడలతోపాటు స్క్రాప్ గోదాములు, ప్లాస్టిక్ వస్తువుల గోదాములు, టింబర్‌డిపోలు, హోటళ్లు, వాణిజ్య సంస్థలతోపాటు అపార్ట్‌మెంట్లలోని సెల్లార్లలో ఉన్నబట్టల నిల్వలు, రసాయనికాలు ప్రమాదాలకు కారణాలవుతున్నాయి. ఇలా జనావాసాల మధ్యలో టింబర్‌డిపోలను పేలుడుకు ఆస్కారాలున్న రసాయనికాలను శివారు ప్రాంతాలకు తరలించాల్సిన అవసరం ఎంతైనా ఉందనేది పాలకులకు తెలియందికాదు. అయినా ఆ వైపు దృష్టిసారించలేకపోతున్నారు. నాంపల్లి బజార్‌ఘాట్‌లో జరిగిన ప్రమాదానికి కారణమైన రసాయనికాల నిల్వల విషయంలో అధికారులకు ఫిర్యాదు చేసినట్లు కూడా ఆ ప్రాంత ప్రజలు చెబుతున్నారు. అయినా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా పాలకులు రాజకీయ ఒత్తిడిలకు లొంగకుండా అమాయకుల ప్రాణాలు తీస్తూ నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసుకుంటున్న ఈ గోదాములు, రసాయనిక నిల్వల కేంద్రాలు శివారు ప్రాంతాలకు తరలించాల్సిన అవసరం ఉంది.

మనిషి మనసులో మెరుస్తున్న లక్షణాలు అనేకం ఉన్నాయి. వాటిలో విచక్షణ కన్నా ఉపయోగకరమైంది మరొకటి లేదు.



ఎడిసన్

వస్త్రధారణ మనసును తెలిపేదిగా ఉండాలి. అంటే వస్త్రాలను బట్టి మనసు శుభ్రతను అర్థం చేసుకోగలగాలి.



గాంధీజీ

## ప్రజావాక్కు



### రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలి

లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో 33 శాతం సీట్లు మహిళలకు రిజర్వేషన్ కల్పిస్తూ బిల్లు పాస్‌కావడం హర్షణీయం. అయితే ఈ రిజర్వేషన్లు మరో ఆరేళ్ల తర్వాత మాత్రమే అమల్లోకి వస్తాయని రాజ్యాంగ సవరణ బిల్లులో పేర్కొనడం జరిగింది. దీనికి కారణాలు ఏమైనా కాంగ్రెస్‌తోసహా అన్ని ప్రతిపక్ష పార్టీలు బాధ్యతగా మెలగాలి. మహిళా రిజర్వేషన్లను మరో ఆరేళ్ల తర్వాత కాకుండా తక్షణమే అమలు చేయాలని ఇతర రాజకీయ పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. సుదీర్ఘకాలం ఎదురు చూసిన తర్వాత దాని ఫలితాలు మన మహిళలు అనుభవించబోతున్నారు. ఈలోగా అన్ని రాజకీయ పార్టీలు తక్షణం జరగబోయే ఎన్నికల్లో 33శాతం సీట్లను మహిళా అభ్యర్థులకు స్వచ్ఛందంగా కేటాయించి ఆదర్శంగా నిలవాలి. డిమాండ్ చేయడం ప్రాధాన్యంకాదు. రాజ్యాంగ సవరణ బిల్లుతో ప్రమేయం లేకుండా ఎన్నికల్లో మహిళలకు సీట్లు కేటాయించి రాజకీయ పార్టీలు తమ నిబద్ధత చాటుకోవాలి.

-జి.అశోక్, గోదూర్, జగిత్యాలజిల్లా

### కారుణ్య నియామకాలు చేపట్టాలి

కొవిడ్ కారణంగా మరణించిన ఆదర్శపాఠశాలల ఉపాధ్యాయుల కుటుంబాలకు మానవతా కారణాలతో కుటుంబంలో అర్హతగల వ్యక్తికి కారుణ్య నియామకాల అవకాశం ఇవ్వాలనే విజ్ఞప్తిని పరిశీలించాలి. ఈయేడాది జులైలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాధారణ పరిపాలనశాఖ వారి ఉత్తర్వులు 1473ప్రకారం మరణించిన ఉద్యోగులకుటుంబాలలో అర్హతగల వారికి గ్రామ, వార్డు సచివాలయంలో కారుణ్య నియామకాలు ఇచ్చేందుకు అవకాశం ప్రభుత్వం కల్పించింది. కాని ఆదర్శ పాఠశాలలకు వర్తింపచేయడంలో సాంకేతికకారణాల అడ్డుతగులుతున్నాయి. తగు సవరణలు ద్వారా ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయుల కుటుంబాలకు కూడా కారుణ్య నియామకాలు వర్తింపచేసే అవకాశాన్ని ప్రభుత్వం ఇవ్వాలి. 164 ఆదర్శ పాఠశాలలు ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలోనే నడుస్తున్నాయి.

-బి.సురేష్, శ్రీకాకుళం జిల్లా

### విలువలు నేర్పాలి

పాఠశాలల్లో సిలబస్ కేవలం మార్కుల కోసమే కాదు, సమకాలీన సమాజంలో జీవించడానికి ఉపయోగపడాలి. ఆరోగ్యం, సాధారణంగా వచ్చేవ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎథిక్స్, నలుగురితో ఎలా మాట్లాడాలి. ఎలా మెలగాలి, నలుగురికి సహాయం ఎలా చేయాలి, ప్రాథమిక హక్కులు, విధులు వగైరా సిలబస్‌లో ఉండాలి.

- వి.కనకమ్మ, విశాఖపట్నం

### ఉచితాలతో ఖజానా ఖాళీ

ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారు. చీరెలు, ధోవతులు, రెండు రూపాయలకు కిలో బియ్యం, పప్పులు ఉప్పులు ఇచ్చి ప్రభుత్వ ఖజానాలో పైసా లేకుండా చేశారు. ఇప్పుడు కెసిఆర్ కూడా ఎన్టీఆర్‌లానే చేస్తున్నారు. మహిళలకు షాదీ ముబారక్ పేరుతో డబ్బులు ఇస్తున్నారు. చీరెలు మెట్టెలు, మంగళసూత్రాలు వస్తు సామాగ్రి ఉచితంగా ఇస్తున్నారు. అన్ని వయసుల వారికి పెన్షన్ ఇస్తున్నారు. ఇవికాక రైతుబంధు, దళితబంధు, మహిళాబంధు ఆ బంధు ఈ బంధుఅని చెప్పి వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు వేస్తున్నారు. ఓట్లకోసం అధికారం కోసం ఏమేమో చేస్తున్నారు. ఏమైనా అంటేరాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నాం, సంక్షేమ పథకాలు అందిస్తున్నాం అంటారు. టిఆర్ఎస్ ప్రభుత్వమే కాదు గతంలో పనిచేసిన కాంగ్రెస్ అంతకన్న ముందు తెలుగుదేశం పార్టీలు కూడా పెద్దఎత్తున సంక్షేమ పథకాలు అందించాయి. అయితే వీరిలాగే ఇంత భారీ ఎత్తున ఉచితాల జోలికి పోలేదు.

-రాశి, హైదరాబాద్

### మౌలిక సదుపాయాలు కల్పించాలి

తెలంగాణ రాష్ట్రంలో ఈ నెల30వ తేదీన శాసనసభకు ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో చాలా పాఠశాలలను పోలింగ్ కేంద్రాలుగా గుర్తిస్తారు. ఈపోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాల రూపకల్పన జరగాలి. పోలింగ్ కేంద్రాలలో సరైన వెలుతురు ఉండేవిధంగా చూడాలి. అక్కడ ఉండే సిబ్బందికి మౌలిక సదుపాయాలు కల్పించాలి. వయోవృద్ధులు, వికలాంగులు ఓటు హక్కు వినియోగించుకోవడానికి ప్రత్యేక సదుపాయాలు కల్పించాలి. వసతులు లేని పోలింగ్ కేంద్రాలను గుర్తించి, ఈ పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల రూపకల్పన చేయడానికి సంబంధిత అధికారులు చర్యలుతీసుకోవాలి. వసతులు లేని పోలింగ్ కేంద్రాలపై జిల్లా కలెక్టర్‌లు ప్రత్యేక దృష్టి పెట్టాలి.

-షేక్ అస్లాం షరీఫ్, శాంతినగర్

### పేదరికం పోగొట్టండి!

మనదేశం వేదభూమి, కర్మభూమిసింగపూర్, మలేషియాలు ఎందుకు. సాగునీరు, తాగునీరు ఇస్తే సరిపోతుంది. మన దేశంవ్యవసాయక దేశం. కట్టడాల వలన ప్రయోజనమేమి. దేవాలయాలు కట్టిస్తే దేశంలో పేదరికం పోదు. ప్రజలకు అన్నంపెట్టె ఉపాయం చూడాలి. దేశంలో ఇంకా కొన్ని చోట్ల ఆకలి, దారిద్ర్యం, నిరుద్యోగ సమస్య, పేదరికం పెరిగిపోతుంది. ఏ ప్రభుత్వాలు అధికారం లోకి వచ్చినా ముందు ప్రజల సంగతి చూడాలి.

-సరికొండ రవిప్రకాశ్‌రాజు, సూర్యాపేట

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail : editpage@vaartha.com

# ఓటర్లను ప్రభావితం చేసే పార్టీల 'డిక్లరేషన్లు'!

**రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్నటు వంటి ఎన్నికల్లో బిసిలకు ఎక్కువ సీట్లు ఇచ్చిన పార్టీగా, బిసి ముఖ్యమంత్రి అభ్యర్థి ప్రకటన లాంటి సానుకూల అంశాలు బిజెపిలో ఉన్నప్పటికీ బలమైన బిసి అభ్యర్థులను పోటీకి దించడంలో కొంత వెనుకబడి ఉంది. అదేవిధంగా కాంగ్రెస్‌పార్టీ బిసిలకు తక్కువ సీట్లు ఇచ్చినప్పటికీ వారు ప్రకటించినటువంటి ప్రధానమైనటువంటి అంశాలు బిసిలకు ఎక్కువగా ఉపయోగపడే విధంగా ఉన్నాయనే చెప్పవచ్చు. ఈ ఎన్నికల్లో బిసిలకు సంబంధించినటు వంటి ఓటు బ్యాంకు కీలకంగా మారుతున్నటువంటి పరిణామంలో బిసిల అభివృద్ధికి, సంక్షేమానికి పలు పార్టీలు ప్రకటించినటువంటి డిక్లరేషన్లు కూడా ఓటర్లను ప్రభావితం చేస్తాయని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు.**

డాక్టర్ కందగట్ల శ్రవణ్ కుమార్

తెలంగాణలో ఎన్నికల సమరంలో బిసిలు కీలకంగా ఉన్న ఈ తరుణంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి సభలో విడుదల చేసినటువంటి బిసి డిక్లరేషన్ ప్రకటన ఇతర పార్టీలో ప్రకటించినటువంటి డిక్లరేషన్ కంటే కొంత మెరుగైన స్థితలో ఉందని అర్థమవుతుంది. ఎందుకంటే ప్రస్తుత అధికారం పార్టీ బిసిలకు చేసినటువంటి పలు సంక్షేమ పథకాలకు భిన్నంగా, బిజెపి పార్టీ బిసిలకు ప్రకటించినటువంటి పలు అంశాలు, బిసి ముఖ్యమంత్రి అభ్యర్థి లాంటి పలు ప్రకటనలు చేశారు. అయితే కాంగ్రెస్ పార్టీ బిసిల కోసం ఒక ప్రత్యేకమైనటువంటి బిసి డిక్లరేషన్ ప్రకటించడం ఆహ్వానించదగ్గ విషయం. ఈ డిక్లరేషన్‌లో ఉన్నటువంటి సాధ్యాసాధ్యాలు కూడా మనం లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. కాంగ్రెస్ ప్రకటించినటువంటి బిసి డిక్లరేషన్ ప్రభుత్వం ఏర్పాటు చేసినటువంటి ఆరు నెలల్లోనే కులగణన చేస్తామని దాని ఆధారంగా రిజర్వేషన్లు కూడా పెంచుతామని ప్రకటించింది. ప్రస్తుత కాలంలో కులగణన దేశంలో అత్యంత అవసరమైనటువంటి ఒక గుణాత్మక ప్రక్రియ దేశవ్యాప్తంగా పలుపార్టీలు, సంస్థలు కులగణనపై ప్రస్తుత కేంద్ర ప్రభుత్వంపై పలు విధాలుగా ఒత్తిడి చేస్తున్నాయి. కర్ణాటక రాష్ట్రంలో కూడా కులగణన చేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఇప్పుడు తెలంగాణలో కూడా కులగణన చేస్తామని ప్రకటించింది. ప్రస్తుత రాష్ట్రప్రభుత్వం కులగణన చేయాలని గతంలోనే అసెంబ్లీలో సూత్రప్రాయంగా ప్రతిపాదించినా అది అమలు కాలేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే కులగణన చేస్తామని చెప్పడం కూడా స్వాగతించాల్సిన విషయమే ఒకరకంగా ఇది కాంగ్రెస్ పార్టీ ఎక్కువ సీట్లని గెలవడానికి దోహదపడే అంశం. బిసి డిక్లరేషన్‌లో పేర్కొన్న బిసి యువకులకు వడ్డీలేకుండా పది లక్షల లోన్ ఇవ్వడం వల్ల కూడా బీసిలు ముఖ్యంగా యువత ఆర్థికంగా కొంత అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది. ఎందుకంటే యువతలో ఎక్కువ శాతం యువత బిసి వర్గాలకు చెందినవారే. అదేవిధంగా గౌడ్లకు 25శాతం కోట వైన్‌షాపుల్లో కేటాయించడం, బిసి ఎలోకి ముదిరాజు, ముత్రాసి, తెనుగు, సామాజిక వర్గాలను మారుస్తామని చెప్పడం, వృత్తి బజార్ పేరుతో షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తామని బ్రాహ్మణులు, వడ్రంగులు, రజకులు, కమ్మరి, స్వర్ణకారులు వంటి చేతివృత్తుల వారికి కూడా ఉచితంగా షాపింగ్ కాంప్లెక్స్‌లు కేటాయిస్తామని, గీత, చేనేత కార్మికులకు 50 యేళ్ల వృద్ధాప్య పింఛను వర్తింపచేశామని, బిసి కార్పొరేషన్లు ఫెడరేషన్ల కింద నమోదు అయిన ప్రతి సొసైటీకి పది లక్షల రూపాయలు ఆర్థికసాయం అందచేసి వాటికి క్రమం తప్పకుండా ఎన్నికలు నిర్వహిస్తామని కూడా పేర్కొనడం జరిగింది. బిసిసంక్షేమానికి ఐదేళ్లలో లక్ష కోట్ల రూపాయలు కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. అందులోప్రతి



సంవత్సరం 20వేల కోట్లను అందచేస్తామని ప్రకటించడం జరిగింది. బిసిల అభివృద్ధికి కొంతవరకు ఇవి ఉపయోగపడినప్పటికి, ఈ డిక్లరేషన్‌లో పేర్కొన్నటువంటి అంశాలు పూర్తిస్థాయిలో అమలు చేస్తేనే బిసిల సామాజికంగా ఆర్థికంగా ఎదగడానికి దోహదపడతాయి. ప్రస్తుం స్థానిక సంస్థల్లో అమలు చేస్తున్నటువంటి 23 శాతం రిజర్వేషన్లు ఉండగా వాటిని 42శాతం పెంచుతామని, దీనిద్వారా 23,973 మంది బిసిలకు రాజకీయ ప్రాతినిధ్యం కూడా దక్కుతుందని వారు పేర్కొన్నారు. ఓ రకంగా ఇది స్థానికసంస్థల్లో బిసిలను రాజకీయంగా ప్రాతినిధ్యం చేయడానికి రాజకీయ సాధికారతకు కూడా ఉపయోగపడుతుంది. అదేవిధంగా విద్యారంగంలో ప్రతి మండలానికి ఒక గురుకులం, జిల్లాకు ఒక డిగ్రీ కళాశాల ప్రకటించడం కూడా మంచి విషయమే. ప్రధానంగా బిసి విద్యార్థులు నేడు ఎక్కువగా ఎదుర్కొంటున్నటువంటి సమస్య ఉన్నత విద్యలో పూర్తిస్థాయి ఉపకార వేతనాలు రాకపోవడం, కాంగ్రెస్ పార్టీ ప్రకటించిటువంటి డిక్లరేషన్‌లో గొప్ప అంశం లక్షల రూపాయల ఆదాయం పరిమితి ఉన్న ప్రతి బిసి విద్యార్థికి ఎటువంటి ర్యాంకు నిబంధన లేకుండా పూర్తిస్థాయి ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రకటిస్తామని పేర్కొనడం ఆహ్వానించదగ్గ విషయం. ఎందుకంటే ఇప్పుడు కేవలం పదివేల ర్యాంకులోపు ఉన్నటువంటి బిసి విద్యార్థులకు మాత్రమే పూర్తిస్థాయి ఫీజు రీయింబర్స్‌మెంట్ వస్తుంది. అదేవిధంగా ఇతర రాష్ట్రాల్లో చదువుతున్నటువంటి బిసి విద్యార్థులకు కూడా ఆర్థిక సాయం అందినప్పటికీ ఎక్కువ మంది మన రాష్ట్రంలో పలు ప్రొఫెషనల్ వృత్తి విద్య కోర్సులను చదువుతున్నారు. వారందరికీ పూర్తిస్థాయి ఫీజు రీయింబర్స్‌మెంట్ రావడం లేదు. ర్యాంకు నిబంధన లేకుండా పూర్తిస్థాయి ఫీజులను చెల్లిస్తే బిసి విద్యార్థులు ఉన్నత విద్యలో మెరుగైన ఫలితాలనుసాధిస్తారు. అదే విధంగా మహాత్మా జ్యోతిరావుపూలే విదేశీ నిధుల కింద సంవత్సరానికి కేవలం వందల సంఖ్యలోనే బిసి విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. ఈపథకం కింద ఎక్కువ మంది విద్యార్థులు విదేశాలకు వెళ్లే విధంగా కాంగ్రెస్ పార్టీ పొందుపరిస్తే బావుండు. చివరగా బిసి డిక్లరేషన్‌కు సంబంధించినటువంటి అంశాలన్నీ బాగున్నప్పటికీ సంచార, అత్యంత వెనుకబడిన వర్గాలకు సంబంధించినటువంటి ప్రత్యేకమైనటువంటి హామీలు కూడా పొందుపరచాల్సిఉంది. ఏదిఏమైనప్పటికీ బిసిలకు కావలసింది సామాజిక, ఆర్థిక, రాజకీయ సాధికారత కానీ బిసి ఆత్మగౌరవ భవనాలు కాదు. మన రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్నటువంటి ఎన్నికల్లో బిసిలకు ఎక్కువ సీట్లు ఇచ్చిన పార్టీగా, బిసి ముఖ్యమంత్రి అభ్యర్థి ప్రకటన లాంటి సానుకూల అంశాలు బిజెపిలో ఉన్నప్పటికీ బలమైన బిసి అభ్యర్థులను పోటీకి దించడంలో కొంత వెనుకబడి ఉంది. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ బిసిలకు తక్కువ సీట్లు ఇచ్చినప్పటికీ వారు ప్రకటించినటువంటి ప్రధానమైనటువంటి అంశాలు బిసిలకు ఎక్కువగా ఉపయోగపడే విధంగా ఉన్నాయనే చెప్పవచ్చు. ఈ ఎన్నికల్లో బిసిలకు సంబంధించినటువంటి ఓటు బ్యాంకు కీలకంగా మారుతున్నటువంటి పరిణామంలో బిసిల అభివృద్ధికి, సంక్షేమానికి పలు పార్టీలు ప్రకటించినటువంటి డిక్లరేషన్లు కూడా ఓటర్లను ప్రభావితం చేస్తాయని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. ●

# ఎన్నికల్లో సాంకేతికత ఫలించేనా?

పూసాల సత్యనారాయణ

ఎన్నికల సంఘం వినియోగించే ఆధునిక సాంకేతికత రాజకీయ నాయకుల ఆగడాలకు కళ్లెం వేసేనా! ఓటు హక్కు ఉన్న వారికి దిక్సూచి అయ్యేనా! అయితే ప్రజాస్వామ్యంలో ఓటింగ్ పద్ధతి గాడిలో పడినట్టే. ఎన్నికల నియమాలకు తిలోదకాలిచ్చి ఇష్టారాజ్యంగా వ్యవహరించే నాయకులకు సీవిజిల్ యాప్‌తో ముక్కుతాడు వేసినట్లే. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసినా నిబంధనను పాటించకపోయినా దానికి సంబంధించిన వీడియోలను, చిత్రాలను యాప్‌లో నమోదు చేస్తే రెండు గంటల వ్యవధిలోనే చర్యలు తీసుకునే వెసులుబాటు కల్పించడం గొప్ప విషయం అయినా దీని గురించి ప్రజలలో అవగాహన లేదు. పబ్లిసిటీ అంతకన్నా లేదు. అనుమతులు లేకుండా సభలు సమావేశాలు జరిపినవారిపై ప్రభుత్వం చర్యలు తీసుకున్న దాఖలాలు కనబడవు. ప్రధాన ఎన్నికల అధికారి నిర్లక్ష్యం వహించిన అధికార పార్టీ ఒత్తిడికి లొంగిపోయినా ఫలితాలు శూన్యం. కొత్తగా వచ్చిన సువిధ యాప్‌తో ఎన్నికలబరిలో దిగిన వారు కార్యాలయానికి వెళ్లకుండానే సభలు నిర్వహించడానికి అనుమతులకు అవకాశం కల్పించింది. 48 గంటల ముందు ఈ యాప్‌లో నమోదు చేయవలసి ఉంటుంది. పోలీసు రెవెన్యూ ఎన్నికల సంఘం అధికారులకు సువిధ యాప్‌లో లాగిన్ సౌకర్యం కూడా కల్పించబడినది. నిబంధనలు నియమావళికి అనుగుణంగా ఉంటేనే అనుమతులు మంజూరు చేయడం జరుగుతుంది. విరుద్ధంగా ఉంటే తిరస్కరించడం జరుగుతుంది. కారణాలు సైతం చెప్పడం ద్వారా కొత్త విధానానికి నాంది పలికింది. ఎన్నికల సంఘం తీసుకొంటున్న చర్యలు అద్భుతంగా ఉన్నా అమలుకు నోచుకుంటాయా అన్నదే అనుమానం. ఓటును ఎలా సద్వినియోగం చేయాలి. దాని విలువ ఏంటి మొదలైన విషయాల గురించి ప్రజలలో అవగాహన కల్పించాలి. 'ఓటు పిచ్చివాడి చేతిలో రాయి' అయితే ప్రజాస్వామ్యం కుప్పకూలిపోతుంది. దీనిని తీవ్రంగా పరిగణించి ఆచితూచి సమర్థవంతమైన అభ్యర్థికి ఓటు వేయవలసిన అవసరం ఉంది. అభ్యర్థి నేరచరిత్ర ఆస్తుల వివరాలు తెలుసుకోవడానికి ఎన్నికల సంఘం మరో అడుగు ముందుకు వేసి 'నో యువర్ కాండిడేట్ కె.వైసి' ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందించడం ముదావహం. నామినేషన్ సందర్భంగా దాఖలు చేసిన ప్రమాణ పత్రాలను ఇట్టి వెబ్‌సైట్‌లో చూసే సౌకర్యం కల్పించారు. ఇది కాకుండా నలభైశాతంపైగా






వైఫల్యం ఉన్నవారికి ఎనభైఏళ్లకుపైబడిన వారికి ఇంటి వద్ద నుండే ఓటింగ్‌లో పాల్గొనడానికి ఈసి మొదటిసారి అవకాశం కల్పించడం గమనించదగిన విషయం. సెల్‌ఫోన్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని మొబైల్ సహాయంతో రిజిస్టర్ చేసుకొని ఓటిపి ఆధారంగా పాస్‌వర్డ్ క్రియేట్ చేసుకోవచ్చు. పోటీచేసే అభ్యర్థులకు వాహనాల వాడకం కూడా కట్టుదిట్టం చేయడం శుభపరిణామం. యాప్ ద్వారా మాత్రమే అనుమతులు తీసుకోవాలి. రెండు వాహనాల కన్న ఎక్కువ వాడుకోదల్చుకుంటే అనుమతి తప్పనిసరి. లేనియెడల వాహనాలు సీజ్ చేయబడతాయి. ఎలక్షన్‌లలో దొరికే నగదు, మద్యం, డ్రగ్స్, బహుమతులు ఎప్పటికప్పుడు ఆయా సంస్థలకు అప్పగించడానికి డబ్బును బ్యాంక్‌లో డిపాజిట్ చేయడంతోపాటు ఐటి శాఖను సకాలంలో అప్రమత్తం చేయడానికి ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టంఅనే యాప్‌ను తీసుకొని రావడంతో అభ్యర్థి ఆటలు సాగనివ్వకుండా చేయడం ప్రాధాన్యత సంతరించుకొంది. దీనితోపాటు ఎలక్ట్రానికల్లీ ట్రాన్స్‌మిటెడ్‌పోస్టల్ బ్యాలెట్ సిస్టం' ప్రవేశపెట్టడంతో పోస్టల్ బ్యాలెట్ జారీ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించవచ్చు. ఓటర్లకు సహాయకారిగా ఉండేందుకు మై ఓటర్ హెల్ప్ లైన యాప్‌ను కూడా ప్రవేశపెట్టి ప్రత్యేకతను చాటుకున్నారు. సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకొని ఓటర్ కార్డు నంబర్ నమోదు చేస్తే ఏ పోలింగ్ కేంద్రంలో ఓటు వేసే అవకాశం ఉందో వివరాలు తెలుసుకోవచ్చు. జాబితాలో పేర్లు ఉన్నాయాలేదా అన్న విషయం తెలుసుకోవచ్చు. ఎన్నికల దీపావళిలో నోట్ల కట్టలను గుట్టలుగా వెదజల్లే అవకాశం లేకపోవచ్చు. ఎన్నికల సంఘం మొదటిసారిగా ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్‌యూనిట్స్ ఏర్పాటు చేయడంతో ఆర్థిక అవకతవకలను అరికట్టవచ్చు. అభ్యర్థి ఆస్తులు ఆదాయం అప్పుల చిత్రాల విశ్లేషణ ప్రక్రియ కూడా చేపట్టడంతో అభ్యర్థి ఆగడాలకు కళ్లెం వేసినట్లే అవుతుంది. ఐటీవారిని రంగంలోకి దించి ఎన్నికల ఖర్చు కేసులు ఆస్తులపై డేగ కన్ను వేసింది. ఎన్నికల కమిషన్ గట్టినిఘా ఏర్పాటు చేయడంతో అభ్యర్థుల్లో ఆందోళన ప్రారంభమైంది. నగదు వస్తురూపేణా పంపకాలు చేయాలంటే జంకుతున్నారు. గత ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పకడ్బందీ చర్యలు చేపట్టడంతో ఎన్నికలు సక్రమంగా జరిగే అవకాశాలు కనబడుతున్నాయి. ఏదిఏమైనా ఓటర్లలో నీతి నిజాయితీ ఉండి ఓటును సద్వినియోగం చేసినప్పుడే ప్రజాస్వామ్యం బతికిబట్టకడుతుంది. చట్టాలు నిబంధనలు కఠినతరం చేసినప్పటికీ ఫలితం శూన్యమే. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వంలో అవినీతి పెచ్చు పెరిగితే ఆకలి కేకలు అంబరాన్ని అంటితే పాలకులతోపాటు ఓటు వేసినవారిది కూడా తప్పే. ఎందుకంటే అగ్నికి ఆజ్యం పోసింది ఓటర్లే కావడం విశేషం. ఓటు మన భవితకు పునాది. ఇప్పటికైనా ఓటు హక్కు గలవారు ఆధునిక సాంకేతికతను ఉపయోగించి ఓటును సద్వినియోగం చేసుకోవాలి. ●

# దళిత, గిరిజన మహిళల ఓట్లు కీలకమే

డాక్టర్ ఆసయ్య ఐఐఎస్

భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థకు సాధారణ ఎన్నికలు ముఖ్యం. ఇప్పటికి 17సార్లు ఎన్నికలు జరిగాయి. 18వ సారి ఎన్నికలకు భారత్ సమాయత్తం అవుతుంది. ఎన్నికలలో భారత్ మొత్తం మీద 96 కోట్లపైగా యోజన ఓటర్లు ఉన్నారు. వీరిలో 43కోట్లమంది మహిళా ఓటర్లు ఉన్నారు. 96 కోట్ల ఓటర్లలో ఎప్పుడు అందరూ ఓటింగ్‌లో పాల్గొనలేదు. మొత్తం ఓట్లలో కేవలం 63 శాతం నుండి 68 శాతం వరకు మాత్రమే పోలైనాయి. అన్ని ఎన్నికల కమిషన్ లెక్కలు తెలుపుతున్నాయి. గెలిచిన నాయకులు కాని, ప్రధానులు, మంత్రులు గాని 50 శాతం కంటే ఎక్కువ ఓట్లు పొందలేదు. అంటే ఆ ఎన్నికలలో పోలైన ఓట్లలో మెజారిటీ ఓట్లను పొంది గెలుపును సాధించిన వారే. ప్రపంచంలో సజావుగా ఐదు ఏళ్లకు ఒకసారి ఎన్నికలు సజావుగా జరుగుతున్న దేశాలలో భారతదేశం ఒకటి. అతిపెద్ద ప్రజాస్వామిక దేశమైన అమెరికా ఈ రెండు దేశాలలో ఎన్నికలలో కాలమానం ప్రకారం ఖచ్చితంగా ఎన్నికలు జరగడంకద్దు. భారత దేశంలో మహిళల ప్రాతినిధ్యం చాలా తక్కువ. కారణం మన సంస్కృతి, సంప్రదాయాలు అడ్డువస్తుంటాయి. భారతదేశంలో నున్న 96కోట్ల మంది ఓటర్లలో సగం మంది 48 కోట్ల మంది మహిళలే. మహిళల్లో ఎక్కువ మంది ఓటింగ్‌లో పాల్గొనేది బడుగు, బలహీనవర్గాల వారే. అంటే ఆ మహిళలు తక్కువ ఆదాయ వర్గాల వారు. ఒంటరి మహిళలు ఎక్కువగా ఎన్నికల ఓటింగ్‌లో పాల్గొంటారు. దిగువ తరగతి మహిళలు ఎక్కువ మంది నిరక్షరాస్యులే ఎక్కువ. వీరి పార్టనర్స్ ఎక్కువగా ఎన్నికల పండుగలో పాల్గొంటారు. వారితోపాటు ఈ మహిళలు కూడా ఊరేగింపులు, బహిరంగ సభలలో పాల్గొనడంతోపాటు ఆయా పార్టీలకు తమ మద్దతును బహిరంగంగా తెలుపుతారు. మగవారితోపాటు సమానంగా 'ఆడవారు' కూడా ఎలక్టరల్ పాలిటిక్స్ లో పాల్గొంటుంటారు. 2011 తరువాత గ్రామపంచాయతీ రాజ్ చట్టంను అనుసరించి ప్రాతినిధ్యం చట్టం అమలులోకి వచ్చింది. అందువలన ఎంపిలుగా, ఎమ్మెల్యేలుగా జెడ్‌పి ఛైర్మన్లు, సభ్యులు మండల ఛైర్మన్, సభ్యులుగా మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను సీట్లు అనధికారికంగాను, మహిళలకు సర్వీసుల్లోను, చట్టసభల్లోను అమలు చేయడం జరుగుతుంది. జాతీయ, రాష్ట్రస్థాయిలో మహిళా కాండిడేట్స్ పోటీ చేయడానికి తగినంత మంది మహిళా నాయకులు ముందుకు రావడం లేదు. అందుకే పార్లమెంటులో లోక్‌సభ ఎన్నికలలో పోటీచేయడానికి మహిళా సభ్యులు దొరకరు. పాలకపక్షం తరఫున మహిళా అభ్యర్థులుంటారు. కాని ప్రతిపక్ష పార్టీకి మహిళా అభ్యర్థులు దొరకరు. కారణం తమ అభ్యర్థులు దొరకరు. 1952లో లోక్‌సభకు ఎన్నికయిన మహిళా సభ్యులు 18మంది మహిళలు ఎన్నికైతే 1957లో 22 మంది ఎంపిలు మహిళలు ఎన్నికయ్యారు. 1962లో 31 మంది 1967లలో 29 మంది మహిళా ఎంపిలు ఎన్నియ్యారు. 1971లో 21 మంది మహిళా ఎంపిలు ఇందులో ఇందిరాగాంధీ కూడా ఉన్నారు.



1977లో 19 మంది, 1980లో 28 మంది, 1985లో 43 మంది, 1989లో 29 మంది, 1992లో 38మంది అలా మహిళల సంఖ్య పెరుగుతూ 2014లో 62 మంది, 2019లో 63మంది ఎన్నికయ్యారు. వీరిలో బిజెపివారే ఎక్కువ మంది ఉన్నారు. ఎన్నికైన మహిళలందరూ ఉన్నత కులాల మహిళలేనని చెప్పవచ్చు. బడుగు, బలహీన, దళితులు, గిరిజన మహిళల ఓటర్లే ఎక్కువగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. కాని వారు ప్రభుత్వంలో పనులు చాలా సులభంగా చేయించుకుంటారు. వారికి ప్రభుత్వంలో పలుకుబడి వారి వారి కుటుంబాలను బట్టి ఉంటుంది. పేద మహిళా ఓటర్లు దళిత, గిరిజన మహిళా ఓటర్లు సాధారణ ఎన్నికల కార్యకలాపాల ఊరేగింపులు, ఎన్నికల ప్రచారం తదితర విషయాలలో పాల్గొంటారు. ఈ మహిళలకు పార్టీల వారు ఆర్థిక సహాయాన్ని అందిస్తారు. ప్రతి ఐదు సంవత్సరాలకు వచ్చే ఎన్నికలలో మహిళల సంఖ్య పెరుగుతూ వచ్చింది. 1980 తరువాత మహిళల ప్రాతినిధ్యం పెరుగుకుంటూ వచ్చింది. మహిళలకు టికెట్లు ఇచ్చిన పార్టీలు జాతీయపార్టీలే. స్థానిక ప్రాంతీయంగా ఎన్నికలలో పాల్గొనే అవసరతను 1993, 1994 చట్టాలు కల్పించాయి. అదే విధంగా గిరిజన మహిళలు ఎన్నికలలో పాల్గొనే చట్టం పెసా చట్టం కల్పించింది. 1993, 1994 పంచాయతీ, మున్సిపాలిటీ చట్టాల ద్వారా మహిళా ప్రతినిధులు పంచాయతీరాజ్ చట్టంలో ప్రత్యక్షంగా ఎన్నుకోబడే గ్రామపంచాయతీ ప్రసిడెంట్, మండల ప్రసిడెంట్లు, జిల్లాపరిషత్ ఛైర్మన్లలలో మహిళలు 33శాతం రిజర్వేషన్ల అమలు కావాలి. లేని యెడల కేంద్రం పంచాయతీ సంస్థలకు ఇచ్చే నిధులు అందవు. అంటే మహిళల ప్రాతినిధ్యం తప్పనిసరిగా ఉండాలి. అదే రీతి కేంద్రప్రభుత్వం ఆర్థికశాఖ ద్వారా అందే నిధులు ముఖ్యంగా ఫైనాన్స్ కమిషన్ ఇచ్చే నిధుల విడుదలలో మహిళల ప్రాతినిధ్యం పాటించాలి. ప్రాంతీయంగా స్థానిక సంస్థలకు జరిగే ఎన్నికలలో మహిళలకు ప్రాతినిధ్యం ఆర్థిక గ్రాంట్లు, నిధులు పొందడానికి కల్పిస్తున్నారు. అలాగే రాష్ట్రస్థాయిలో జరిగే ఎమ్మెల్యే, ఎంపిలు, ఎమ్మెల్సీ ఎన్నికలలోకూడా ప్రాతినిధ్య మహిళల కల్పించితే వారి సమస్యలకు పరిష్కారం సూచించుతారు. భారత్ పురుషాధిక్యత సమాజం కనుక రాజ్యసభలో కాని, రాష్ట్ర కౌన్సిల్‌లలో కాని మహిళలకు ప్రాతినిధ్యం ఉండుటలేదు. కనుక ఇటీవల కాలంలో బిజెపి కేంద్ర ప్రభుత్వం తనకున్న పార్లమెంటరీ మెజారిటీతో 2024ప్రాతినిధ్య చట్టాన్ని తెచ్చారు. ఆ చట్టం ద్వారా మహిళలకు 2026సంవత్సరం తారువాతనే చట్ట సభలలో ప్రాతినిధ్యం లభిస్తుంది. ఈ చట్టం యుపిఎ ప్రభుత్వ హయాంలో రాజ్యసభలో ఆమోదించగా 24 సంవత్సరాలుగా పెండింగ్‌లో పడిపోయింది. కాని 2024 ఎన్నికలను దృష్టిలో ఉంచుకొనిఈ మహిళా రిప్రజెంటేషన్ బిల్లు 2023ను ఆమోదింపచేశారు. ఆమోదించిన వెంటనే మహిళలకు ప్రాతినిధ్యం లభించకుండా 2026 తరువాతనే అమవుతుందని షరతులు విధించడం సబబుగాలేదు. ఏదిఏమైనా కాలయాపన జరిగిన 25సంవత్సరాలతర్వాత బిల్లుపాసైంది. కాని మహిళా రిప్రజెంటేషన్ చట్టం 2023లో కూడా కొన్ని లోసుగులు ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీలకు బిసి మహిళలకు వారి నిష్పత్తి ప్రకారం ప్రాతినిధ్యం లభించవలసి ఉంది. తద్వారా దిగువ తరగతి మహిళలు కూడా పార్లమెంటులోను, రాష్ట్ర శాసన సభలలోను ప్రాతినిధ్యం పొందే వెసులుబాటు కలుగుతుంది. రాష్ట్రాలఎన్నికలైన, కేంద్రంలో సాధారణ ఎన్నికలైనా 'జెండర్ ఈక్వాలిటీ' ఉండాలని చట్టం పేర్కొంటుంది. కనుక బడుగు, బలహీనవర్గ మహిళలు కేవలం ఓటర్లుగానే ఉండిపోకుండా చట్టసభలలో ప్రాతినిధ్యం పొందే అవకాశాలు 2026 తర్వాత మెరుగవుతాయి. ●

# సొంతపార్టీ నుంచే రిషిసునాక్‌కు సవాళ్లు

## కేబినెట్‌లో మార్పుల నేపథ్యంలో అవిశ్వాసం ప్రకటించిన ఓ ఎంపి



**లండన్,నవంబరు 14:**బ్రిటన్ ప్రధాని రిషి సునాక్‌పై సొంతపార్టీకి చెందిన ఓ ఎంపీ అవిశ్వాస లేఖను పంపడం చర్చనీయాంశంగా మారింది. సువెల్లా బేవర్మన్‌పై వేటును తీవ్రంగా వ్యతిరేకించిన ఆ ఎంపీ సునాక్‌పై అవిశ్వాసం ప్రకటించారు. యూకే ప్రధానమంత్రి రిషి సునాక్‌కు సొంతపార్టీ ఎంపీ ఆయనకు అవిశ్వాస లేఖను సమర్పించారు. మంత్రి పదవిని తప్పిస్తూ కేబినెట్‌లో మార్పులు చేసిన గంటల వ్యవధిలోనే ఆయనపై అవిశ్వాసగళం వినిపించడం ప్రాధాన్యం సంతరించుకుంది. రిషి సునాక్‌కు వ్యతిరేకంగా టోరీ ఎంపీ ఆండ్రియా జెన్‌కిన్స్ సోమవారం అవిశ్వాస లేఖను ప్రయోగించారు. హౌస్ ఆఫ్‌కామన్స్ వ్యవహారాలను చూసే1922 కమిటీ ఛైర్మన్ గ్రా హమ్ బ్రాడీకి ఆమె ఈ లేఖను సమర్పించారు. ఈ విషయాన్ని ఆండ్రియా ఎక్స్‌వేదికగా వెల్లడిస్తూ అవిశ్వాస లేఖను పోస్ట్ చేశారు. జరిగింది చాలు. నా అవిశ్వాస లేఖను సమర్పించా. రిషి సునాక్‌ను పదవి నుంచి దింపి. ఆయన స్థానంలో నిజమైన క్జర్వేటివ్ పార్టీ నేతలను ఎన్నుకునే సమయం వచ్చింద్ఙి అని ఆమె తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. మాజీ ప్రధాని బోరిస్ జాన్సన్‌కు నమ్మిన వ్యక్తిగా పేరున్న ఆండ్రియా. కేబినెట్ నుంచి సువెల్లా బ్రేవర్‌మన్‌ను తొలగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ క్రమంలోనే ఆమె ఈ 'అవిశ్వాస'లేఖను సమర్పించారు. రిషి సునాక్ తన కేబినెట్‌లో నిజాలు మాట్లాడే ఏకైక వ్యక్తి సువెల్లాపై వేటు వేశారని, దాన్ని తాను తీవ్రంగా ఖండిస్తున్నానని తెలిపారు. రిషి సునాక్ దిగిపోవాల్సిన సమయం ఆసన్నమైందని, ఆయనకు వ్యతిరేకండా అవిశ్వాస లేఖలు సమర్పించాలని తోటి టోరీ ఎంపీలను ఆమె అభ్యర్థించారు.కాగా రిషి సునాక్ ప్రధాన పదవి చేపట్టిన తర్వాత ఆయనపై అవిశ్వాస లేఖ రావడం ఇదే తొలిసారి. అయితే దీనిపై ఇప్పుడే ఆయన అవిశ్వాస పరీక్షను ఎదుర్కోవాల్సిన అవసరం లేదని తెలుస్తోంది.పార్టీలకి చెందిన మొత్తం ఎంపీల్లో 15 శాతం మంది తాము కొత్తనాయకుడిని కోరుకుంటూన్నమంటూ లేఖలు పంపితే అప్పుడు కనర్వేటివ్ పార్టీలో రిషి నాయకత్వంపై విశ్వాసపరీక్ష ఓటింగ్ నిర్వహిస్తారు.గత కొంతకాలంగా వివాదాల్లో చిక్కుకున్న ఉవా ఆల్లా బేవర్మన్‌ను మంత్రి పదవి నుంచి తొలగిస్తున్నట్లు రిషి సునాక్ ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. ఆ పదవిని విదేశాంగ మంత్రి జేమ్స్ క్లెవర్లీకి కట్టబెట్టింది. ఇక, మాజీ ప్రధాని డేవిడ్ కామెరూన్‌కు కేబినెట్‌లో చోటు కల్పించింది.ఆయనకు విదేశాంగ,కామన్వెల్త్, అభివృద్ధి వ్యవహారాలశాఖ బాధ్యతలు అప్పగించింది.

# మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభంజనం

## 150 సీట్లు ఖాయం: రాహుల్‌గాంధీ



**భోపాల్, నవంబరు 14:** మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం వీస్తోందని, 145 నుంచి 150 సీట్లను తాము గెలుచుకోవడం ఖాయమని ఆ పార్టీ మాజీ అధ్యక్షుడు వయనాడ్ ఎంపి రాహుల్‌గాంధీ ధీమా వ్యక్తం చేశారు. 2018 ఎన్నికల అనంతరం కమల్‌నాథ్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బిజెపి కొనుగోలు చేసిందని, ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ తుఫాన్ రాబోతోందని అన్నారు. రాష్ట్ర ప్రజల వాణిని ప్రధాని మోడీ అణచివేస్తున్నారని, ప్రజలను వంచిస్తున్నారని రాహుల్ ఆరోపించారు. మధ్యప్రదేశ్‌లోని విదిషలో మంగళవారం జరిగిన ర్యాలీలో రాహుల్ ప్రసంగిస్తూ, అయిదేళ్ల క్రితం కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వాన్ని ప్రజలు ఎన్నుకున్నారని, అయితే బిజెపి నేతలు నరేంద్రమోడీ, శివరాజ్‌సింగ్ చౌహాన్ కలిసి కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి ప్రభుత్వాన్ని చేజిక్కించుకున్నారని విమర్శించారు. తద్వారా ప్రజల వాణిని అణగదొక్కారన్నారు. ప్రజాతీర్పును, ప్రజలను వంచించారని ఆరోపించారు. ఈసారి మాత్రం కాంగ్రెస్ తుఫాన్ ఖాయమని, 230 అసెంబ్లీ స్థానాల్లో 145 నుంచి 150 సీట్లు కాంగ్రెస్ కైవసం చేసుకుందని అన్నారు. ఈ విషయాన్ని రాసి పెట్టుకోండని అన్నారు. తాను రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పర్యటించానని, కాంగ్రెస్ గాలులు బలంగా వీస్తున్నాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నేతలు అహింసాయుత సైనికుల వంటివారని, విపక్షాలను ఓడించేందుకు హింసకు పాల్పడరని, ప్రేమే ఆయుధంగా బిజెపిని అధికారం నుంచి తరిమికొడతామని రాహుల్ అన్నారు. కర్ణాటకలో ఈ యేడాది ప్రారంభంలో జరిగింది ఇదేనన్నారు. హిమాచల్ ప్రదేశ్‌లోనూ బిజెపిని తరిమికొట్టామని, హింసతో కాకుండా కేవలం ప్రేమతోనే తాము ఈ విజయాలు సాధించామని అన్నారు. కర్ణాటకలో 40 శాతం కమిషన్ల ప్రభుత్వాన్ని సాగనంపామని, మధ్యప్రదేశ్‌లో కూడా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వస్తుందని రాహుల్ ధీమా వ్యక్తం చేశారు. కాగా, మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు నవంబర్ 17న జరగనున్నాయి. డిసెంబర్ 3న ఫలితాలు వెలువడతాయి.

# కాంగ్రెస్‌కు అధికారం అప్పగిస్తే దోపిడీ విశృంఖలం :మోడీ



**భోపాల్, నవంబరు 14 :** మధ్యప్రదేశ్‌లో కాషాయ సునామీ కాంగ్రెస్‌ను కూకటివేళ్లతో పెకిలిస్తుందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. మధ్యప్రదేశ్ కాషాయ సునామీ కాంగ్రెస్‌ను కూకటివేళ్లతో పెకిలిస్తుందని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. గత కొద్దిరోజులుగా తాను మధ్యప్రదేశ్‌లని వివిధ ప్రాంతాల ప్రజలను కలుస్తూ వారి ఆశీస్సులు కోరుతూన్నానని, బీజేపీ పట్ల ప్రజలు విశ్వాసం కనబరుస్తున్నారని చెప్పారు.ఢిల్లీలో కూర్చుని లెక్కలు వేసుకుంటున్న వారి అంచనాలకు అందనిరీతిలో మధ్యప్రదేశ్‌లో బీజేపీకి ఆదరణ లభిస్తోందని అన్నారు.షాజాపూర్‌లో మంగళవారం జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీని ఉద్దేశించి ప్రధాని మోడీ మాట్లాడుతూ బీజేపీ పట్ల మీరు కనబరిచే ప్రేమ కొందరికి నిద్రను దూరం చేస్తోందని అన్నారు. వారి ముఖాల్లో నవ్వులు మాయమయ్యాయని, ఈవీ ఇంటర్వ్యూలో వారి మాటలు ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆగడాలతో ఆ పార్టీ అధికారంలో ఉన్నరాష్ట్రాల్లో విధ్వంసం జరిగిందని, కాంగ్రెస్ హయాం సమస్యలతో సంక్లిష్టమైందన్నారు. మధ్యప్రదేశ్‌ను కడగండ్లపాలు కాకుండా బీజేపీ కాపాడిదని గుర్తు చేశారు. దోపిడి, అవినీతి, వేధింపులు, అసత్యాలే కాంగ్రెస్ పార్టీ ఏకైక అజెండా అని మోడీ దుయ్యబట్టారు. తకు మూడోసారి అవకాశమిస్తే భారత్‌ను ప్రపంచంలో మూడు అతి పెద్ద ఆర్థికవ్యవస్థలో ఒకటిగా ఏదిగేలా చేస్తామని ఇది మోడీ గ్యారంటీ అని భరోసా ఇచ్చారు. ప్రస్తుతం భారత్ ఐదో అతిపెద్ద వ్యవస్థగా అవతరించామని, త్వరలోనే మనం మూడో అతిపెద్ద ఆర్థికశక్తిగా ఎదుగుతామని నిపుణులు చెబుతున్నారని అన్నారు.వేగంగా ఎదుగుతున్న భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచ వ్యాప్తంగా ఇన్వెస్టర్లు ఆసక్తి కనబరుస్తున్నారని చెప్పారు.

# మధ్యప్రదేశ్ పోరు..కేంద్ర మంత్రి కుమారుడి 'విడియో'లపై రచ్చ



**భోపాల్, నవంబరు 14 :** కేంద్ర మంత్రి నరేంద్రసింగ్ తోమర్ కుమారుడు కొందరు వ్యాపారవేత్తలతో రూ.కోట్ల వ్యవహారం గురించి మాట్లాడుతున్నట్లు వీడియోలు వైరల్ అవుతుండటం మధ్యప్రదేశ్ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. మధ్యప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సమయం దగ్గరపడుతోన్న వేళ అధికార బిజెపికి ఊహించని పరిణామాలు ఎదురవుతున్నాయి. దీంతో బీజేపీ కాంగ్రెస్‌పార్టీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతుండగా అటు అధికార పార్టీ కూడా అవి ఫేక్ వీడియోలు అంటూ తిప్పి కొడుతోంది. మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ దిమనీ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయన కుమారుడు దేవేంద్ర సింగ్ తోమర్ కొంతమంది మధ్యవర్తులతో రూ. కోట్ల వ్యవహారాం మాట్లాడుతున్న వీడియో ఇటీవల సామాజిక మాధ్యమాలలో వైరల్‌గా మారింది. దీనిపై చర్చ జరుగుతుండగానే ఇటువంటిదే మరో వీడియో బయటకు రావడం కలకలం రేపింది. ఇదే విషయాన్ని కీలకాంశంగా పేర్కొంటున్న కాంగ్రెస్.. బిజెపి ఆరోపణలు గుప్పిస్తోంది. గతంలో కర్ణాటకలో మాదిరిగానే ఇక్కడ కూడా బీజేపీ ప్రభుత్వం 50శాతం కమీషన్ ప్రభుత్వంగా మారిందని కాంగ్రెస్ అధికార ప్రతినిధి రాగినీ నాయక్ విమర్శించారు. ఒక వేళ అది తప్పుడు వీడియో అయితే వాటిని ఎవరు రూపొందించి వైరల్‌చేశారనే విషయంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇదే విషయాన్ని ప్రస్తావించిన రాహుల్‌గాంధీ.. బీజేపీ నేత బహిరంగంగా లంచం డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పుడు తోమర్ కుమారుడిపై మోడీ ప్రభుత్వం ఈడీ,సీజబీఐ, ఐటీలను పంపుతుందా? అని ప్రశ్నించారు. ఈ వివాదంపై కేంద్ర మంత్రి తోమర్ గ్వాలియర్‌లో మాట్లాడుతూ 'బూటకపు చర్చలతో సమయాన్ని వృధా చేయకూడదు. అంటూ బదులిచ్చారు' అది ఫేక్ వీడియో అని.. దానిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని కేంద్ర మంత్రి కుమారుడు దేవేంద్ర సింగ్ కూడా పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను అటు బీజేపీ కూడా తోసిపుచ్చింది. ఆ వీడియోపై ఫిర్యాదు చేశాం. దర్యాప్తు జరుగుతోంది. ఇటువంటి వ్యూహాలతో ఎన్నికలు గెలవలేరు. కాంగ్రెస్‌పార్టీనే అవినీతిలో కూరుకుపోయింది. కాంగ్రెస్ అధికారంలో ఉన్న15 నెలల కాలంలో రూ. 281కోట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నార్లు. అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు వీడీ శర్మ తిప్పి కొట్టారు. ఇదిలా ఉంటే, మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలోలన భాగంగా 230 స్థానాలకు నవంబర్ 17న ఒకే రోజు పోలింగ్ జరుగనుంది. ఇందుకోసం పార్టీల ప్రచారం ముగింపు దశకు చేరుకుంది. బుధవారం సాయంత్రం ఎన్నికల ప్రచారానికి తెరపడనున్న నేపథ్యంలో ప్రధాన పార్టీలు ఓటర్లను ఆకర్షించడంలో నిమగ్నమయ్యాయి.

# జార్ఖండ్‌లో ఘోర అగ్ని ప్రమాదం..ముగ్గురు మృతి

**జార్ఖండ్, నవంబరు 14 :**జార్ఖండ్‌లోని ధన్‌బాద్‌లో ఘోర అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఒక దుకాణంలో మంటలు చెలరేగడంతో ముగ్గురు మృతి చెందారు. ప్రాణాలు కోల్పోయిన వారిలో ఇద్దరు మహిళలతోపాటు నాలుగేళ్ల బాలిక కూడా ఉంది. వీరంతా ఒకే కుటుంబానికి చెందినవారు. ఈఘటన ధన్‌బాద్‌లోని కెందువాడీహ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జెవార్ పట్టిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జేవర్ పట్టిలోని ఓ దుకాణంలో మంటలు చెలరేగాయి. ఈ దుకాణంపైన ఒక ఇల్లు ఉంది కొద్దిసేపటికే మంటలు ఇల్లాంతా వ్యాపించాయి. ఘటన జరిగిన సమయంలో ఇంట్లో ఆరుగురు ఉన్నారు. ప్రమాదం గురించి తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. వారు నిచ్చెన సాయంతో ఆ ఇంట్లోకి చేరుకుని, ముగ్గురిని బయటకు తీశారు. కాగా దుకాణంపై ఉన్న ఇంటిలో షాపు యజమాని సుభాష్ గుప్తా, అతని తల్లి ఉమాదేవి, భార్య సుమన్ గుప్తా, నాలుగేళ్ల కుమార్తె మౌలి, ఏడాదిన్నర కుమారుడు శివాన్, సోదరి ప్రియాంక గుప్తా, సోదరుడు సుమిత్ ఉంటున్నారు. తీవ్రంగా గాయపడిన స్థితిలో ఆసుపత్రిలో చేరిన సుభాష్ తల్లి, కూతురు, సోదరి చికిత్స పొందుతూ మృతి చెందారు. సుమన్, సుమిత్,శివన్‌స ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో సుభాష్, అతని తండ్రి అశోక్ ఇంట్లోలేరు.



# గాజాపై పట్టు కోల్పోయిన హమాస్

## ఇజ్రాయెల్ రక్షణమంత్రి యోవ్ గల్లాంత్



**టెల్‌అవీవ్, నవంబరు 14:** ఇజ్రాయెల్-హమాస్ మధ్య భీకరపోరు కొనసాగుతున్నది. హమాస్ దాడి నేపథ్యంలో గాజాస్ట్రిప్‌లో ఆ సంస్థ ఉనికే లేకుండా చేయాలనే లక్ష్యంతో ఇజ్రాయెల్ సైన్యాలు విరుచుకుపడుతున్నాయి. ఈ నేపథ్యంలో గాజాపై హమాస్ పట్టు కోల్పోయిందని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి యోవ్‌గల్లాంత్ ప్రకటించారు. ఇలా జరగడం గత 16 యేళ్లలో ఇదే మొదటిసారని చెప్పారు. ఉగ్రవాదులంతా దక్షిణ గాజావైపు పారిపోతున్నారని వెల్లడించారు. దీంతో ప్రజలంతా హమాస్ స్థావరాలను ఆక్రమిస్తున్నారని చెప్పారు. గాజా ప్రజలకు అక్కడి ప్రభుత్వంపై ఏమాత్రం నమ్మకం లేదని పేర్కొన్నారు. అయితే గాజాపై హమాస్ పట్టు కోల్పోయిందనడానికి ఆయన ఎలాంటి ఆధారాలను చూపకపోవడవం గమనార్హం. గత నెల 7న ఇజ్రాయెల్‌పై హమాస్ రాకెట్ల వర్షం కురిపించింది. దీంతో 1200 మంది మరణించారు. మరో 240 మందిని బందీలుగా పట్టుకెళ్లారు. దీంతో హమాస్ స్థావరంగా ఉన్న గాజాపై ఇజ్రాయెల్ భీకర దాడులకు దిగింది. దీంతో ఇప్పటి వరకు గాజాస్ట్రిప్‌లో 11,240 మంది మరణించారని వారిలోఎ 4,630 మంది చిన్నారులు ఉన్నారని హమాస్ వెల్లడించింది. ఇజ్రాయెల్ సైన్యం విచక్షణారహితంగా దాడులు చేస్తుండటంతో గాజాలోని సగం మందికిపైగా నిరాశ్రయులయ్యారు. రెండు లక్షల మందికిపైగా సాధారణ ప్రజలు పొట్ట చేతపట్టుకుని ఇతర ప్రాంతాలకు వలసవెళ్లారు. చాలామంది తిండీ నీరు అందక అల్లాడుతున్నారు. ఇక జాగాలోని దవాఖానల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అవస్థలు పడుతున్నారు.

## గాజాలోని ఆస్పత్రిలో 179 మందిని సామూహిక ఖననం

**న్యూఢిల్లీ, నవంబరు 14:**గాజాలోని ఆస్పత్రిలో179 మందిని ఖననం చేసినట్ల అల్ షిఫా హాస్పిటల్స్ కౌంపౌండ్‌లో సామూహిక ఖననం సాగిందని, దాంట్లో శిశువులను కూడా పాతిపెట్టినట్లు ఆయన వెల్లడించారు. హాస్పిటల్ కాంపౌండ్‌లోనే ఖననం చేసే రీతిలో తమపై వత్తిడి తెచ్చారని హాస్పిటల్ డైరెక్టర్ పేర్కొన్నారు. గాజాలోని ఆస్పత్రిలో 179 మందిని ఖననం చేసినట్లు అల్‌షిఫా హాస్పిటల్ చీఫ్ మహమ్మద్ అబూ సల్మియా తెలిపారు.హాస్పిటల్‌లో ఫ్యూయల్ సరఫరా నిలిచిపోవడంతో ఇంటెన్సివ్ కేర్‌లో ఉన్న ఏడుగురు పసికందులు, 29 మంది రోగులు చనిపోయారని, వారిని అక్కడే ఖననం చేసినట్లు చెప్పారు. ఆ ఆస్పత్రి నుంచి తాజాగా విడుదలైన ఓ ఫోటో కలిచివేస్తోంది. ఏడుగురు శివులను ఒకే దగ్గర కట్టివేసిన ఫోటోను రిలీజ్ చేశారు. జనరేటర్లు నడవకపోవడంతో ఇంకు బెంటర్లలో ఉన్న పిల్లలు ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. అల్ షిఫా ఆస్పత్రి ఓ శ్మశాన వాటికలా తయారైందని ప్రపంచ ఆరోగ్యసంస్థ పేర్కొన్నది. ఆ ఆస్పత్రిలో మృతదేహాలుగా గుట్టలుగా ఉన్నాయని, దుర్గంధం వస్తోందని డబ్ల్యూహెచ్‌వో తెలిపింది. హాస్పిటల్ సమీపంలో ఇటీవల జోరుగా ఫైటింగ్ కొనసాగుతోంది. హమాస్, ఇజ్రాయెల్ దళాల మధ్య జరుగుతున్న పోరు వల్ల ఆస్పత్రి చుట్టూ బీభత్సకర వాతావరణం నెలకొన్నది.

## చిన్నారుల ఆస్పత్రి కిందే ఉన్న హమాస్ సొరంగం!

**జార్ఖండ్, నవంబరు 14:** గాజాలో చిన్నారుల ఆస్పత్రి కిందే ఉన్న హమాస్ సొరంగాన్ని ఐఆర్‌ఎఫ్ గుర్తించింది. దాని వీడియోను పోస్ట్ చేసింది. అందులో పెద్ద ఎత్తున ఆయుధాలను నిల్వ చేసినట్లు తెలిపింది. గాజాలోని సామాన్యపౌరులు, ఆస్పత్రులను హమాస్ తమ రక్షణ కవచాలుగా వాడుకుంటోందని ఆరోపిస్తోన్న ఇజ్రాయెల్ దళాలు.. తాజాగా దాన్ని బలపర్చే సాక్ష్యాలను బయటపెట్టాయి. గాజాలో భూతల పోరు సాగిస్తున్న ఐడీఎఫ్ సేనలు.. హమాస్‌కు చెందిన ఓ సొరంగాన్ని గుర్తించాయి. బుల్లెట్ ప్రూఫ్‌తో పటిష్టంగా ఉన్న ఆ టన్నెల్.. చిన్నారుల ఆస్పత్రికి అను సంధానంగా ఉండటం గమనార్హం. ఆ అస్పత్రి కింద ఉన్న హమాస్ కమాండర్ సెంటర్‌లో పెద్ద ఎత్తున ఆయుధాలు బయటపడ్డాయి. ఇందుకు సంబంధించిన వీడియోను ఐడీఎఫ్ తమ ఎక్స్ ఖాతాలో పోస్టు చేసింది. ఇజ్రాయెల్‌పై అక్టోబరు 7నాటి దాడిలో నేవీ ఆపరేషన్లకు నాయకత్వం వహించిన హమాస్ కమాండర్ ఇంటికి సమీపంలో ఈ సొరంగాన్ని గుర్తించినట్లు ఐడీఎఫ్ అధికార ప్రతినిధి డేనియల్ హంగరీ ఆ వీడియోలో వెల్లడించారు. సోలార్ ప్యానెళ్లతో ఆ టన్నెల్‌కు విద్యుత్ సరఫరా జరుగుతున్నట్లు ఐడీఎఫ్ గుర్తించింది. భూ ఉపరితలానికి 20 మీటర్లలోపల ఉన్న ఆ సొరంగానికి బుల్లెట్ ప్రూఫ్ డోర్ ఉన్నట్లు డేనియల్ పేర్కొన్నారు. ఆ సొరంగం లోపలికి డేనియల్ నడుచుకుంటూ వెళ్లగా.. టన్నెల్‌కు మరో చివరన అల్‌రాంటిస్ ఆస్పత్రి బేస్‌మెంట్ ఉన్నట్లు గుర్తించారు. యుద్ధానికి ముందు ఈ ఆస్పత్రిలో చిన్నారులు, క్యాన్సర్ రోగులకు చికిత్స అందించేవారని డేనియల్ తెలిపారు. ఆ బేస్‌మెంట్ వద్ద హమాస్ కమాండ్ సెంటర్ ఉంది. అందులో రాకెట్ ప్రొపెల్డ్ గ్రెనేడ్లు, రైఫిళ్లు, ఆత్మాహుతి దాడులకు ఉపయోగించే బాడీ వెస్ట్‌లు, ఇతర పేలుడు పదార్థాలను ఆయన గుర్తించారు. 'ఆస్పత్రులను హమాస్ తమ దారుణాలకు వినియోగించుకుంటోంది. ఇదీ హమాస్ అంటే..! ఈ నేపథ్యంలోనే ఐడీఎఫ్ తాజాగా హమాస్ సొరంగం వీడియోను బయటపెట్టింది.






# బీహార్‌లో ఇసుక మాఫియా కిరాతకం

## ఎస్‌ఐని ట్రాక్టర్‌తో తొక్కించి చంపిన వైనం

**పాట్నా, నవంబరు 14 :** బీహార్‌లో ఇసుక మాఫియా దారుణానికి పాల్పడింది. ఇసుక అక్రమ తరలింపును అడ్డుకునేందుకు వచ్చిన పోలీసులపట్ల కిరాతకంగా వ్యవహరించింది. ఇసుక ట్రాక్టర్‌తో పోలీసు వాహనాన్ని మళ్లీ మళ్లీ ఢీకొట్టింది. పోలీస్ వ్యాన్ దిగిన ఎస్‌ఐని ట్రాక్టర్‌తో తొక్కించింది. ఈఘటనలో తీవ్రంగా గాయపడిన ఎస్‌ఐని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. బీహార్‌లో ఇసుక మాఫియా ఈ దారుణానికి పాల్పడింది. ఇసుక అక్రమ తరలింపును అడ్డుకునేందుకు వచ్చిన పోలీసుల పట్ల కిరాతంగా వ్యవహరించింది. ఇసుక ట్రాక్టర్‌తో పోలీస్ వాహనాన్ని దారుణంగా ఢీకొట్టి వ్యాన్ దిగిన ఎస్‌ఐన్ని ట్రాక్టర్‌తో తొక్కించింది. ఈ ఘటనలో ఎస్‌ఐతోపాటు హోం గార్డుకూడా గాయపడ్డారు. గాయపడిన ఎస్‌ఐ ఆస్పత్రికి వెళ్లకముందే మార్గమధ్యంలో మరణించాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీఅభిషేక్ కుమార్ సింగ్ చెప్పారు.

# ఐదేళ్ల చిన్నారి రేప్ కేసులో నిందితుడికి మరణశిక్ష

**తిరువనంతపురం, నవంబర్ 14:** కేరళలోని అలువలో జరిగిన చిన్నారి కిడ్నాప్, రేప్ కేసులో నిందితుడు అష్‌ఫక్ ఆలమ్‌కు ఎర్నాకుళం పోక్సో కోర్టు మరణశిక్షను విధించింది. ఆ కేసులో జడ్జి కె సోమన్ తన తీర్పును ఈ రోజు వెలువరించారు. ప్రాసిక్యూషన్ చేసిన వాదనలను కోర్టు అంగీకరించింది. ఇది అత్యంత అరుదైన కేసు అని, నిందితుడికి ఎటువంటి క్షమ అవసరం లేదని, సమాజానికి అతనో సమస్య అని కోర్టు తెలిపింది. 110 రోజులపాటు ఈ కేసులో సుదీర్ఘ వాదనలు జరిగాయి. చిల్డ్రన్స్‌డే సందర్భంగా తీర్పును వెల్లడించారు. ఆధారాలను ధ్వంసం చేసినందుకు అష్‌ఫక్‌కు అయిదేళ్ల జైలు శిక్ష విధించారు. మైనర్‌కు డ్రగ్స్ ఇచ్చినందుకు మూడేళ్ల శిక్ష, మైనర్‌ను రేప్ చేసినందుకు జీవితకాలజైలుశిక్ష, మర్డర్ చేసినందుకు మరణశిక్ష విధిస్తున్నట్లు కోర్టు చెప్పింది. 7,70,000 జరిమానా చెల్లించాలని నిందితుడికి కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

# జైషే చీఫ్ మసూద్ అజార్ అనుచరుడు హతం



**ఇస్లామాబాద్,నవంబరు 14:**పాకిస్తాన్‌లో వరుసగా ఉగ్రవాదులు హతమవుతున్నారు. సన్నిహిత అనుచరుడు రహీమ్ ఉల్లా తారిఖ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు కాల్చి చంపారు. కరాచీలో మతపరమైన కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళ్తుండగా తారిఖ్‌ను ఆగంతుకులు మట్టుబెట్టారు. తమ దేశంలో వరుసగా జరుగుతున్న పెంపుడు ఉగ్రవాదుల హత్యలు పాక్‌ను కలవరపెడుతున్నాయి. జేషే ముఠా సభ్యుల మధ్య అంతర్గత పోరు కారణంగానే తారిఖ్ హత్య జరిగినట్లు తెలుస్తోంది. స్థానిక ఉగ్రవాదులు ఈ దాడికి పాల్పడి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కారీచీలో అతి పెద్ద మురికివాడాగా పేరున్న ఒరింగి టౌన్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. దుండగులు అతి సమీపం నుంచి తారిఖ్‌పై పలుమార్లు కాల్పులు జరిపారని, ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన అతడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడని పాక్ మీడియా కథనాలు వెల్లడించాయి. భారత్ మోస్ట్ వాంటెడ్‌గా ఉన్న జైషే మహ్మద్ చీఫ్ మసూద్ ఆజార్‌కు తారిఖ్ అత్యంత సన్నిహితుడు. పాక్‌లో టాప్ ఉగ్రవాది హతమవడం ఈ నెలలో ఇది మూడో ఘటన కావడం గమనార్హం. గతవారం మరో ఉగ్ర సంస్థ లష్కరే తోయిబా కమాండర్ అక్రమ్ ఘాజీని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కాల్చి చంపారు. అంతకు ముందు ఈ నెల ఆరంభంలో లష్కరేకు చెందిన మరో ఉగ్రవాది ఖ్వాజీ షాహిద్ నియంత్రణ రేక సమీపంలో పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోహతమయ్యారు. తాజీగా తారిఖ్ హత్య చేసుకోవడంతో పాక్ మరోసారి ఉలిక్కిపడింది. ఈ ఘటనను పాక్ పోలీసులు ఖండించారు. ఇది 'లక్షిత హత్య' అని పేర్కొన్నారు. గత కొన్ని రోజులుగా పాకిస్తాన్‌లో ఉగ్రవాదులు ఇలా గుర్తు తెలియని వ్యక్తుల చేతుల్లో హత్యకు గురవుతున్నారు. దీంతో వారికి కంటిమీద కునుకు లేకుండా పోయింది. భయంతో చాలా మంది ముష్కరులు రహస్యప్రదేశాల్లో దాక్కుంటున్నట్లు సమాచారం.

# శ్రీలంక ఇంకా సంక్షోభం నుంచి బయటపడలేదు: రణిల్ విక్రమసింఘే



**కొలంబో, నవంబరు 14:** శ్రీలంక పూర్తిగా ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడలేదని ఆ దేశ అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే వెల్లడించారు. 2023 సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను ఆ దేశ పార్లమెంట్‌లో ఆయన మంగళవారం ప్రవేశపెట్టారు. నగదు కొరత ఉన్న శ్రీలంక ఆర్థిక వ్యవస్థ పూర్తిగా కోలుకునే వరకు కఠిన సంస్కరణలు అమలు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. బడ్జెట్ ప్రసంగంలో ఇంకా మాట్లాడుతూ..' మేము గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థను తిరిగి పట్టాలపైకి తీసుకురాగలిగాం. ఇప్పటికీ, ప్రజలు కష్టాలను అనుభవిస్తున్నారు. 2022 సెప్టెంబరులో 70 శాతంగా ఉన్న ద్రవ్యోల్బణం ఈ యేడాది అక్టోబరులో 1.5 శాతానికి తగ్గింది. ద్వీప దేశం మరోసారి దివాళా తీయకుండా ఉండాలంటే కఠిన సంస్కరణలు తప్పనిసరి. ప్రభుత్వ రంగ సంస్థల నష్టాలను రాష్ట్ర బ్యాంకులను ఏర్పాటు చేశాం. నగదు కొరతను అధిగమించేందుకుప్రయత్నిస్తున్నాం. 1.3 మిలియన్‌ల రాష్ట్ర ఉద్యోగులకు రూ. 10వేలు, 7లక్షల మంది పెన్షనర్లకు జీవన వ్యయ భత్యాలు పెంచనున్నాం.ప్రభుత్వం ఇకపై డబ్బును ముద్రించదు. రాష్ట్ర ఖర్చుల కోసం బయట నుంచి రుణాలు పొందలేం.పెట్టుబడులకు వ్యతిరేకంగా ట్రేడ్ యూనియన్లు నిరసనలు చేయడం సరికాదు. ఈ బడ్జెట్ 2024ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రూపొందించింది కాదు'అని అన్నారు. శ్రీలంకలో 2024సెప్టెంబరులో అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి.



# ట్రంప్ సోదరి కన్నుమూత

**వాషింగ్‌టన్,నవంబరు 14 :**అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోదరి మేరియన్ ట్రంప్ కన్నుమూశారు. అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇంట విషాదం నెలకొంది. అతని సోదరి మేరియన్ ట్రంప్ బారీ (86) సోమవారం కన్నుమూశారు. న్యూయార్క్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న మేరియన్ తెల్లవారు జామున మరణించినట్లు స్థానిక మీడియా కథనాలు ప్రచురించింది.ట్రంప్‌నకు ఉన్న నలుగురు తోబుట్టువుల్లో మేరియన్ మూడో వ్యక్తి. న్యూజెర్సీలో ఫెడరల్ న్యాయమూర్తిగా పని చేసి 2019లో పదవి విరమణ పొందారు. గతేడాది ట్రంప్ సోదరుడు రాబర్ట్ ట్రంప్ గుండెపోటుతో మరణించారు.

## మేడిగడ్డ పిల్లర్ కుంగిపోవడంపై కేంద్ర దర్యాప్తు సంస్థలు విచారణ జరపాలి

### టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్

**హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త:** మేడిగడ్డ పిల్లర్ కుంగిపోయిన అంశంలో కేంద్ర జలవనరుల శాఖ నుంచి లోపాలపై ఒక లేఖ రాశారని, అందుకు ప్రతిగా ఇరిగేషన్ శాఖ కార్యదర్శి రజత్‌కుమార్ లేఖ రాశారని టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ అన్నారు. మంగళవారం గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మేడిగడ్డ పిల్లర్ కుంగిపోయిన ఘటనపై కేంద్ర దర్యాప్తు సంస్థలు విచారణ జరపాలన్నారు. ఈ విషయాలపై తాము ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామ న్నారు. ఎన్నికల కమిషన్ చీఫ్ సెక్రటరీ మా లేఖను పంపి వివరణ అడిగారని, కానీ ఇంతవరకు సిఎస్ నుంచి ఎలాంటి జవాబు రాలేదన్నారు. మహదేవపూర్ పోలీసు స్టేషన్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మేడిగడ్డ కుంగి పోయిన అంశంపై ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఎఫ్ఐఆర్ కూడా నమోదు అయిందన్నారు.

# కెసిఆర్ మాయమాటలకు మోసపోవొద్దు

### బిజెపి తెలంగాణ ఎన్నికల కమిటీ ఛైర్మన్ ఈటల
### ఎద్దేవా చేసిన రాహుల్‌గాంధీకి తగిన బుద్ధిచెబుతాం
### నరేంద్రమోడీ సర్కార్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం
### షాద్‌నగర్‌లో బిజెపి విజయ సంకల్పసభ విజయవంతం

**షాద్‌నగర్, నవంబరు 14, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి కెసిఆర్ రాష్ట్ర ప్రజలను పదవి చేపట్టినప్పటి నమ్మించి మోసం చేస్తున్నారని, ఆయన మాయమాటలకు మోసపోవద్దని, వచ్చే ఎన్నికల్లో బిజెపి గెలుపునకు కృషి చేయాలని పార్టీ తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిటీ ఛైర్మన్ ఈటల రాజేందర్ ప్రజలకు పిలుపునిచ్చారు. షాద్‌నగర్ నియోజకవర్గ బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి అందె బాబయ్య గెలుపునకు మంగళవారం షాద్‌నగర్‌లో విజయ సంకల్ప సభ నిర్వహించారు. ఆయనకు మద్దతుగా ప్రచారం నిర్వహించడానికి షాద్‌నగర్ పట్టణానికి వచ్చిన ఈటలకు పార్టీకి చెందిన ఆడపడుచులు ఘన స్వాగతం పలికారు. విజయ సంకల్ప సభను ఉద్దేశించి ఈటల రాజేందర్‌ముదిరాజ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఎన్నో పోరాటాలు చేసి జైలు పాలు అయ్యానన్నారు. కెసిఆర్ వెంట నడిచి రెండు సార్లు మంత్రిగా పనిచేసి కరోనా కష్టకాలంలోనూ ప్రజలకు సేవచేస్తే ముఖ్యమంత్రి నిందలు మోపి నన్ను గెంటేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నాడు నాకు జరిగిన అన్యాయాన్ని జీర్ణించుకోలేక టీఆర్ఎస్ పార్టీకి సహితం అందెబాబయ్య రాజీనామా చేశారన్నారు. నేడు మీ బీసీ బిడ్డగా మీ అందరి ఆశీర్వాదాలతో షాద్‌నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే బరిలో నిలిచిన అందెబాబయ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో ప్రతి గ్రామంలో మద్యం విచ్చలవిడిగా విక్రయించారన్నారు. బీజేపీ పార్టీ బీసీ ముఖ్యమంత్రిని ప్రకటిస్తే కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీ బీసీల పట్ల చిన్నచూపు చూపిస్తు ఎద్దేవా చేస్తున్నారని రాబోయే ఎన్నికల్లో గెలిచి తమ చాటుతామని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహ్మారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ టంగుటూరి విజయ్‌కుమార్, రాష్ట్ర నాయకుడు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటేశ్వర్‌గుప్త, భూపాలచారి, అశోక్‌గౌడ్, చెంది మహేందర్‌రెడ్డి, పాతపల్లి కృష్ణారెడ్డి, చెట్ల వెంకటేష్, ఋుషికేష్, శ్రీధర్‌వర్మ, అందె రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

## ఓట్ల కోసం వచ్చే నాయకులను హక్కులపై ప్రశ్నించాలి

### ప్రొఫెసర్ జి.హారగోపాల్

**హైదరాబాద్ (సైఫాబాద్), నవంబరు 14, ప్రభాతవార్త:** ఓట్ల కోసం వచ్చే రాజకీయ నాయకులను సమస్యలపై ప్రశ్నించాలని తెలంగాణ పౌర హక్కుల సంఘం ఓటర్లకు పిలుపునిచ్చింది. ఈ మేరకు బుధవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రొఫెసర్ జి.హరగోపాల్, సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ఎన్.నారాయణరావు, విష్ణువర్ధన్ రావు తదితరులు ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. గడిచిన దశాబ్ధ కాలంగా పౌర ప్రజాస్వామిక హక్కుల అణిచివేతే ప్రధానంగా కొనసాగిందని, ప్రజా స్వామిక పాలన ప్రజలకు అందనంత దూరంలో ఉందని, జీవించే హక్కు అణిచివేతను పాలక వర్గాలు కొనసాగిస్తున్నాయని ఆరోపించారు. ప్రజలు ప్రాథమిక హక్కుల అమలుకై ఓట్లు కోసం వచ్చే రాజకీయ నాయకులను ప్రశ్నిం చాలని వారు కోరారు.

# ఎస్సీ ఉపకులాలకు అన్యాయం చేస్తే విశ్వరూపం చూపిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న బైరి వెంకటేశం మోచి తదితరులు

### సమస్య పక్కదారి పట్టించేందుకే ప్రధాని మోడీ 'కమిటీ' ప్రకటన
### ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి

**హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త:** ఎస్సీ ఉపకులాలకు అన్యాయం చేస్తే 'విశ్వరూపం చూపి స్తాం ఇటీవల మాదిగల విశ్వరూప సభలో ప్రధాని మోడీ ఎస్సీ వర్గీకరణపై చేసిన 'కమిటీ' ప్రకటన సమస్యను పక్కదారి పట్టించ డానికేనని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బైరి వెంకటేశం మోచి అన్నారు. ఈమేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 22లోల జనాభా కలిగిన ఎస్సీ ఉపకులాలకు ఎస్సీ రిజర్వేషన్ ఫలితాలు అందడం లేదన్నారు. వర్గీకరణ కేవలం 57 ఉపకులాలకు అవసరమని మాలమాదిగలకు వర్గీకరణ అవసరం లేదన్నారు. కావున ఎస్సీ వెంటనే వర్గీకరణ చేపట్టి 57దళిత ఉపకలాలను ఏకేటగిరీల్లో చేర్చి జనభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్ శాతాన్ని కేటాయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఉపకులాల విద్యార్థులందరికీ ఎలాంటి ఎంట్రన్స్ పరీక్షలు లేకుండా ప్రభుత్వ గురుకులాల పాఠశాలల్లో ప్రవేశం కల్పించాలని వ్యవసాయంపై ఆధారపడిన ఉపకులాల ప్రజలకు కనీసం ఎకరం భూమి కేటాయించాలన్నారు. అంతేకాకుండా వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, నామినేటెడ్ పదవుల్లో మాల, మాదిగలతో సమానంగా ఉపకులాలకు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో రాష్ట్ర నాయకులు చంద్రగిరి సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, తులసీదాస్, తిమ్మన మాదాసి కురువ, మటపతి నాగయ్యస్వామి, పస్తంకుమార్, పరమేశ్వర్, మాల్గె సంతోష్, ఎత్తెపు కేశవులు తదితరులు పాల్గొన్నారు.

## ఎడ్‌సెట్ స్పెషల్ రౌండ్‌లో 2,604 సీట్ల కేటాయింపు

### నేటి నుంచి 17 వరకు కాలేజీల్లో చేరాలి
### ఎడ్‌సెట్ అడ్మిషన్స్ కన్వీనర్ రమేష్‌బాబు

**హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలో బిఎడ్ కోర్సుల్లో చేరడానికి నిర్వ హించిన ఎడ్‌సెట్-2023 కౌన్సెలింగ్‌లో భాగంగా స్పెషల్ రౌండ్‌లో సీట్ల కేటాయింపు చేశారు. స్పెషల్ రౌండ్‌లో సీట్ల కేటాయింపులో 2,604 మందికి సీట్ల కేటాయింపు చేశారు. ఎడ్‌సెట్‌లో ప్రస్తుతం 6419 సీట్లు కన్వీనర్ కోటాలో అందు బాటులో ఉండగా వాటిలో 2,604 మందికి సీట్లను కేటాయించారు. 3,988 మంది విద్యా ర్థులు వెబ్ ఆప్షన్లను ఇచ్చారని అడ్మిషన్ల కన్వీనర్ ప్రొఫెసర్ రమేష్‌బాబు ప్రకటనలో తెలిపారు. మొదటి విడతలో 13,405 మంది వెబ్ ఆప్షన్లను ఇవ్వగా.. 14,267 సీట్లు అందుబాటులో ఉన్నాయి.. అందులో 9417 సీట్లు కేటాయిం చారు. మొదటి విడతలో సీట్లు పొందిన వారిలో 4674 మంది కాలేజీల్లో రిపోర్టింగ్ చేసినట్టు అధికారులు తెలిపారు. రెండో విడతలో 9593 సీట్లు అందుబాటులో ఉండగా.. 8338 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. వారిలో 6223 మందికి సీట్ల కేటాయింపు చేశారు. సీటు పొందిన విద్యా ర్థుల్లో 3578 మంది కాలేజీల్లో చేరారు. స్పెషల్ రౌండ్‌లో 'సీటు పొందిన విద్యార్థులు నేటి(బుధ వారం) నుంచి 17 వరకు కాలేజీల్లో ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో చేరాల్సి ఉంటుందని.. కాలేజీ యాజమాన్యాలు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను పూర్తి చేసిన అనంతరం సీటును కన్ఫర్మేషన్ చేస్తారని తెలిపారు. అందుకు సంబంధించిన సమాచారం అభ్యర్థుల మొబైల్స్‌కు వస్తుందని తెలిపారు.

# ప్రారంభమైన లాసెట్ కౌన్సెలింగ్

### 21 వరకు దరఖాస్తుల స్వీకరణ
### 28న సీట్ల కేటాయింపు
### ఈ యేడాదిలో 8000 సీట్లు

**హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని లా కోర్సుల్లో అడ్మిషన్ల కోసం నిర్వ హించిన లాసెట్-2023, పీజీ లాసెట్-2023కి సంబంధించిన కౌన్సెలింగ్ మంగళవారం ప్రారంభమైంది. దరఖాస్తులను ఈ నెల 21 వరకు స్వీకరించనున్నారు. 3 సంవత్సరాల లా కోర్సుతోపాటు, 5 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ లా కోర్సులో చేరడం కోసం లాసెట్-2023ని.. పీజీ లా కోర్సుల్లో చేరడానికి పీజీ లాసెట్-2023 పరీక్షను నిర్వహించిన సంగతి తెలిసిందే. లా కోర్సుల్లో చేరడానికి గత ఏడాది కంటే ఈ ఏడాది సుమారు 700 సీట్లు అదనంగా వచ్చాయి. కొత్త కాలేజీలకు అనుమతులు ఇవ్వడంతోపాటు.. కొత్త కోర్సులను ప్రారంభించడం.. అదనంగా సీట్లు పెరగడంతో ఈ ఏడాది 700 వరకు సీట్లు పెరిగినట్టు అధికారులు చెబుతున్నారు. ఈ నెల 21 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. 22న అర్హత కలిగిన వారి లిస్టును ప్రకటిస్తారు. 23, 24న వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. 28న సీట్ల కేటాయింపు చేస్తారు. సీటు పొందిన వారు ఈ నెల 29 నుంచి డిసెంబర్ 2 వరకు ఆయా కాలేజీల్లో చేరాల్సి ఉంటుంది. రాష్ట్రంలో మూడు సంవత్సరాల లా కోర్సులో 22 కాలేజీల్లో 4790 సీట్లు.. 5 సంవత్సరాల కోర్సులో 19 కాలేజీల్లో 2280 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇక పీజీ లాసెట్‌లో రాష్ట్రంలో 17 కాలేజీల్లో 930 సీట్లు అందబాటులో ఉన్నాయి.

## 18 మద్యం డిస్టిలరీలపై ఎక్సైజ్ శాఖ నిఘా

### ఇసి ఆదేశాలతో రంగంలోకి అధికారులు

**హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని 18 మద్యం డిస్టిలరీలపై ఎక్సైజ్ శాఖ నిఘా పెంచింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 10 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఒక్కో బృందానికి ఎక్సైజ్ సూపరింటెండెంట్‌ను బాధ్యులుగా నియమించినట్లు ఎక్సైజ్ శాఖ సంయుక్త కమిషనర్ సురేశ్ తెలిపారు. ఈసీ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని 18 డిస్టిలరీలను అధికారుల బృందం మంగళవారం ఆకస్మికంగా పరిశీలించిందనీ, మద్యం ఉత్పత్తి, సరఫరా, సంబంధిత రిజిస్టర్లను పరిశీలించినట్లు చెప్పారు. రికార్డులన్నీ సక్రమంగా ఉన్నట్లు అధికారుల పరిశీలనలో తేలిందన్నారు. మద్యం డిస్టిలరీలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని ఎక్సైజ్ శాఖ ప్రధాన కార్యాలయానికి అనుసంధానం చేసినట్లు తెలిపారు.

24 గంటలపాటు సీసీ కెమెరాలను పరిశీలిం చడంతో పాటు మద్యం అక్రమ రవాణా జరుగ కుండా గట్టి నిఘా పెట్టినట్లు సంయుక్త కమిషనర్ సురేష్ ఈ సందర్భంగా వెల్లడించారు.

## ఆపరేషన్ కోసం ఆస్పత్రికి వచ్చిన మహిళ అదృశ్యం

**హైదరాబాద్ (చార్మినార్), నవంబరు 14, ప్రభాతవార్త :** పాతబస్తీ పెట్లాబూర్జు ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చిన ఓ మహిళ అదృ శ్య మైన సంఘటన హుస్సేనీ ఆలం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ నవీన్ కధనం ప్రకారం...రంగారెడ్డి జిల్లా, పరిగి మండలం, ఖుదవనాపూర్ గ్రామానికి చెందిన ఎన్.శైలు భార్య శాంతమ్మ (40) గత నెల 27న పెట్లాబూర్జు ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చింది. పరీక్షలు నిర్వహించిన అనంతరం వైద్యులు శాంతమ్మకు ఆఫరేషన్ చేయవలసి ఉందని చెప్పారు. నవంబరు 4వ తేదీన శాంతమ్మకు వైద్యులు ఆప రేషన్ చేయవలసి ఉంది. ఆపరేషన్ కోసం ఆసుపత్రిలో చేరిన శాంతమ్మ మూడవ తేదీ తెల్లవారు జామున ఎవరికి చెప్పకుండ ఆసుపత్రి నుంచి వెళ్లి పోయింది. శాంతమ్మ కోసం కుటుంబ సభ్యులు అన్ని చోట్ల వెతికినా ఫలితం లేక పోయింది. దీంతో భార్య శాం తమ్మ కనిపించటం లేదంటూ భర్త ఎన్.సైలు హుస్సేనీఆలం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆసుపత్రి నుంచి శాంతమ్మ వెళ్లిన సమయంలో పింక్ కలర్ చీర, బ్లాక్ రంగు జాకెట్ ధరించి ఉంది. తెలుగు మాత్రమే శాంతమ్మ మాట్లా డగలదు. ఈ కేసును హుస్సేనీఆలం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


శాంతమ్మ (ఫైల్)

# కాంగ్రెస్ సునామీ కెసిఆర్ పార్టీని తుడిచేస్తుంది

- ఖమ్మం జిల్లాలో 10 స్థానాలు గెలుస్తాం
- కేంద్ర మాజీమంత్రి రేణుకాచౌదరి

**హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా వస్తున్న కాంగ్రెస్ సునామి కెసిఆర్ పార్టీని కడిగేస్తుందని కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి అన్నారు.

మంగళవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లా డారు. పువ్వాడ అజయ్ ఓటమి భయంతో మా కార్యకర్తలపై దాడుల చేస్తున్నారన్నారు. మా ఖమ్మం కార్పొరేటర్ రాఫీనా బేగంపైనే బైండోవర్ కేసులు వేవారన్నారు.

ఎంఐఎం, బిఆర్ఎస్ కలిసి ఇబ్బందులు పెడు తునా్రన్నారు. చట్టా నికి విరుద్ధంగా పోలీ సులు వ్యవహ రి స్తున్నారన్నారు. కాం గ్రెస్ కార్యకర్తలను ఇబ్బంది పెడితే ఖబడ్దార్ అంటూ హెచ్చరిం చారన్నారు. మీ ఇంటికి వచ్చి సవాల్ చేస్తూ నువ్వు ఓడిపోయిన తక్షణ అక్కడి నుంచి పారిపోతావన్నారు. కాంగ్రెస్‌లో గెలిచి పార్టీ మారిన పువ్వాడ అజయ్‌లాంటి వారిని దగ్గరకు తీసుకోవడం వల్లే కెసిఆర్ ఓడిపోతు న్నారన్నారు. పువ్వాడ అజయ్ పాముకు పాలుపోస్తే కాటువేసే రకం అన్నారు. పువ్వాడ అజయ్ కాంగ్రెస్ కార్య కర్తలను ఎంత ఇబ్బంది పెడితే అంత బలంగా ముందుకు వస్తారన్నారు.

బిజెపి, బిఆర్ఎస్, ఎంఐఎం ఒకటే అన్నారు. మతతత్వ రాజకీయాలు చేస్తున్నారన్నారు. ఖమ్మం జిల్లాలో ప్రచారం చేస్తానని అన్నారు. మీరు ఐటి దాడులు చేస్తారని మేము పైసలు ఇంట్లో పెట్టుకుని కూర్చుంటామా అన్నారు. బిఆర్ఎస్ ఎంతమంది కోవర్టులు ఉన్నారో, మాకు తెలుసునన్నారు మాకు కోవర్టులు ఉన్నారన్నారు. ఖమ్మం జిల్లాలో 10కి 10 స్థానాలు గెలుస్తామన్నారు. పోలీసు కార్లలోనే డబ్బులు పెట్టుకుని తిరుగుతున్నారన్నారు.



మంగళవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాతున్న కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి

# సామాజిక న్యాయంకోసమే బిసి సిఎం

### బిజెపి ప్రకటనపై ఒబిసి మోర్చా జాతీయ అధ్యక్షుడు డా.లక్ష్మణ్

**హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త:** సామాజిక న్యాయంలో భాగంగానే బిసిని సిఎం చేస్తామని బిజెపి చెబుతోందని ఆ పార్టీ ఒబిసి మోర్చా జాతీయ అధ్యక్షులు డా.లక్ష్మణ్ అన్నారు. మంగళవారం మీడియా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. బిజెపి అంటే సబ్ కా వికాస్, బిఆర్ఎస్ అంటే కెసిఆర్ ఫ్యామి లీ వికాస్, కాంగ్రెస్ అంటే రాహుల్ ఫ్యామిలీ వికాస్ అన్నారు. ఆ రెండు పార్టీలలో పనిచేస్తున్న వారు ఆ కుటుంబాలకు బానిసలుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటి వరకు హామిలు అమలు చేయకుండా ఇప్పుడు ఎలక్షన్ కమిషన్ దగ్గరకు వెళ్లి అనుమతి ఇవ్వాలని బిఆర్ఎస్ డ్రామాలు ఆడుతుందని ధ్వజమెత్తారు. ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు. ఇప్పుడు ఇస్తామని మాటలు చెబుతుందన్నారు. డిక్లరేషన్ గ్యారెంటీలు అంటూ కాంగ్రెస్ ప్రజలను మరోసారి మభ్యపెట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల డిఎన్ఏ ఒక్కటే అన్నారు. మైనార్టీ ఓట్ల కోసం ఆ రెండు పార్టీలు పోటీ పడుతున్నాయన్నారు. హిందువులను అవమానపరుస్తున్నారన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించలే దన్నారు. ఇప్పటి వరకు కెసిఆర్ ఇక్కడ పెట్రోల్ ధరలు, గ్యాస్ ధరలు తగ్గించలేదన్నారు. బిసి సిఎం అంటే బిసిల కోసం కాదని, సమాజంలోని అన్ని వర్గాల కోసం అన్నారు. కెసిఆర్ లేస్తే మనిషికాదని అంటాడు, కానీ లేవడు, కాపలా కుక్కల ఉంటానని అన్ని కెసిఆర్ గుంటల నక్కల వ్యవహరిస్తున్నారంటూ మండిపడ్డారు. రేవం త్‌రెడ్డి, అసుదుద్దీన్ ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారని అన్నారు. నువ్వు కొట్టినట్లు చేయి, నేను ఏడ్చినట్లు చేయి అన్నట్లుగా వారి వ్యవహారం ఉందన్నారు. ఎంఐఎం కాంగ్రెస్ ఒక్కటే అన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీతో ఉందని, బిజెపి మేనిఫెస్టో ఓట్ల కోసం కాదని, అమలుకు నోచుకోని హామిలు ఇవ్వమన్నారు. ఓవైసి, రేవం త్‌రెడ్డిలు ఎవరి కోసం పనిచేస్తున్నారో అందరికి విషయం తెలుసునన్నారు. బిసి, ఎస్సీలతో పాటు అన్ని వర్గాలు బిజెపికి మద్దతు తెలుపుతున్నారని, బిజెపి విజయం ఖాయం అన్నారు.



## రిటైల్ మార్కెట్లో ఉల్లి సగటు ధర కిలో రూ.59.09

**హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త:** దేశీయ రిటైల్ మార్కెట్‌లో ఉల్లి ధర కిలోకు 59.09 రూపాయలుగా ఉన్నట్లు భారత ప్రభుత్వ వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ పేర్కొంది. దేశంలో ఉల్లి ధర అత్యధికంగా కిలోకు 90 రూపాయలు కాగా, అదే అత్యల్ప ధర 20 రూపాయలుగా ఉన్నట్లు వెల్లడించింది. ఈ మేరకు తాజాగా ఒక ప్రకటనలో వాటి వివరాలను తెలియచేసింది. పెరుగుతున్న ఉల్లి ధరలను నియంత్రించేందుకు ఇప్పటికే వాటి ఎగుమతిపై టన్నుకు 800 డాలర్లు (66,591.60 రూపాయలు) చొప్పున కనీస ఎగుమతి ధరను నిర్ణయించింది. ఇది డిసెంబరు 31వ తేదీ వరకూ అమల్లో ఉంటుందని వివరించింది. ఇప్పటికే సేకరించిన 5 లక్షల టన్నులకు పోను అదనంగా 2 లక్షల టన్నుల ఉల్లిని కొనుగోలు చేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో దేశీయంగా ఉల్లి సరఫరా మెరుగుపడి ధరలు తగ్గే అవకాశం ఉన్నట్లు స్పష్టం చేసింది. ప్రస్తుత 2023-24 ఆర్థిక సంవత్సరం అక్టోబరు 20 వరకూ దాదాపు 15 లక్షల టన్నుల ఉల్లిని ఎగుమతి చేసింది. కాగా అక్టోబరు నుండి దేశంలో క్రమంగా ఉల్లి ధరలు పెరగడం మొదలయ్యింది. ప్రధానంగా దేశ రాజధాని ఢిల్లీలో అక్టోబరు 25న ఉల్లి ధర కిలోకు 40 రూపాయలు ఉండగా, అదే నెల 29వ తేదీకి ఈ ధర రెండింతలు పెరిగి కిలోకు 80 రూపాయలకు చేరింది. ప్రస్తుతం సగటు ధర 60 రూపాయలుగా ఉంది.

# బిసి సిఎం ఓకే.. పార్లమెంట్‌లో బిసి బిల్లు పెట్టాల్సిందే

### రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త:** బిజెపి పార్టీ అధికారంలోకి వస్తే ముఖ్యమంత్రి పదవి బిసిలకు చేస్తామని చెప్పడం తాము స్వాగిస్తున్నామని కానీ పార్లమెంట్‌లో బిసిబిల్లు సాధించడమే తమ అంతిమ లక్ష్యమని బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపి ఆర్.కృష్ణయ్య అన్నారు. ఈ మేరకు మంగళవారం కాచిగూడలో జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన మీడియా సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ బిజెపి పార్టీ బిసిలకు ముఖ్యమంత్రి పదవి ప్రకటించడంతోనే సరిపెట్టడం కాదని అంతకంటే ముఖ్యమైన బిసిబిల్లు పార్లమెంట్‌లో పెట్టాలన్నారు. పార్లమెంట్‌లో బిసిబిల్లు పెడితే చట్టసభల్లో బిసిలకు 50శాతం అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలు రిజర్వ్ అవుతాయని దాంతో బిసిలూ అన్నిరంగాల్లో అగ్రస్థానంలో ఉంటారన్నారు.

గత 35ఏళ్లుగా బిసిబిల్లు కోసం ఉద్యమాలు నిర్వహించడంతోపాటు ప్రధాన మంత్రులు, కేంద్రమంత్రులు, ప్రతిపక్ష నేతలను కలిసి చర్చలు జరిపామామని అయినప్పటికీ ఇంతవరకు కేంద్ర ప్రభుత్వం తగిన రీతిలో స్పందించడం లేదన్నారు. కావున బిసిల పట్ల సాను కూలంగా ఉన్న బిజెపి ప్రభుత్వం ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే బిసిబిల్లు పెట్టేవిధంగా ప్రధాని నరేంద్రమోదీ చర్యలు తీసుకోవాలని కృష్ణ య్య పేర్కొన్నారు. ఈ సమావేశంలో కోట్ల శ్రీనివాస్, సి.రాజేందర్, నందగోపాల్, వేముల రామకృష్ణ, జయంతి, దీపిక, స్వరూప, బలరాం తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ తదితరులు

## 8 మంది బిఎస్‌పి అభ్యర్థుల నామినేషన్ల తిరస్కృతి

**హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో బహుజన సమాజ్ పార్టీ(బీఎస్‌పీ) అభ్యర్థుల్లో 8 మంది నామినేషన్లు తిరస్కరణకు గురైనట్టు పార్టీ కార్యాలయం ప్రకటించింది. మొత్తం 119 స్థానాల నుంచి నామినేషన్లు దాఖలు చేయగా.. అందులో 8 మంది నామినేషన్లు తిరస్కరణకు గురి కావడంతో రాష్ట్రంలో 111 స్థానాల్లో బీఎస్‌పీ పోటీలో ఉందని పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

తాము స్టేషన్ ఘన్‌పూర్(ఎస్సీ), పాలకుర్తి, భువనగిరి, మిర్యాలగూడ, ఆలేరు, మధిర(ఎస్సీ), బహదూర్‌పుర, గోషామహల్ నుంచి పోటీలో లేమని.. మిగిలిన 111 స్థానాల్లో తాము పోటీ చేస్తున్నట్టు ప్రకటించారు.

రాష్ట్రంలోని 111 స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను ఓడించి బీఎస్‌పీ అభ్యర్థులను గెలిపించాలని ప్రవీణ్ కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజలకు అధికార భాగస్వామ్యం కావాలంటే బీఎస్‌పీని గెలిపించాలని పిలుపునిచ్చారు.



దీపావళి పర్వదినం సందర్భంగా మంగళవారం నారాయణగూడలో సదర్ సమ్మేళన్ దృశ్యం

# పార్టీల చరిత్ర చూడండి

## ఆలోచించి ఓటు వేయండి

## నిండు కుండలాగా ఇబ్రహీంపట్నం చెరువు

## ప్రజాఆశీర్వాద సభలో సిఎం కెసిఆర్



ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ పార్టీ అధినేత, సిఎం కెసిఆర్

**ఇబ్రహీంపట్నం, నవంబరు 14, ప్రభాతవార్త:** ఎన్నికల్లో అన్ని పార్టీల్లో అభ్యర్థులుంటారు అందులో అభివృద్ధి ఏ నాయకుడు చేస్తాడో నాయకుడి, పార్టీ చరిత్రను అలోచించి ఓటు వేయాలని బిఆర్ఎస్ పార్టీ అధినేత, సిఎం కెసిఆర్ ప్రజలకు సూచించారు. ప్రజా ఆశీర్వాద సభతో ఇబ్రహీంపట్నమంత గులాబిమయ మయ్యింది. కళాకారుల ఆటా పాటలతో యువత కేరింతలు కొట్టారు. సభకు భారీగా ప్రజలు తరలిరావడంతో ఇబ్రహీంపట్నం ప్రాంతమంత ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనాలన్ని దారి మళ్లించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం సమీపంలో బిఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆధ్యక్షతన మంగళవారం ఏర్పాటు చేసి ప్రజా ఆశీర్వాద సభకు బిఆర్ఎస్ పార్టీ అధినేత, సిఎం కెసిఆర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ...ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలకు ఓటు అనేది ఒక్కటే ఆయుదం ఉంటుంది, ఏ నాయకుడు గెలిస్తే, ఏ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో సంక్షేమం, అభవృద్ధి జరుగుతుందో అనేది పరిణతితో అలోచించి ఓటు వేయాలని కోరారు. బిఆర్ఎస్ పుట్టిందే తెలంగాణ రాష్ట్రం కోసంమని అన్నారు. కాంగ్రెస్ యాభై ఏండ్లు కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉండి చేసిన అభివృద్ధి ఏమిటని ప్రశ్నించారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాడి 2014లో ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు రైతుల ఆకలి చావులు, త్రాగు, సాగు నీరులేక ఇబ్బందులు, చాలా భయంకరమైన పరిస్థితి ఉండేదన్నారు. ప్రజలు వలస పోయే పరిస్థితి ఏర్పాడిందన్నారు. మూడు నెలలు ఆలోచించి ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం రాకముందు ఉన్న రూ.200 పెన్షన్‌ను రూ.వెయ్యికి పెంచి విడతల వారిగా రూ.2వేలకు పెంచిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానిదేనని చెప్పారు. అధికారంలోకి వచ్చిన తరువాత విడతలవారిగా రూ.5వేలకు పెంచుతామని ప్రకటించారు. కళ్యాణ లక్ష్మి, షాదిముబారక్ పథకం ద్వార ఆడబిడ్డ పెండ్లికి రూ.లక్ష ఆర్థిక సహాయం అవదిస్తున్నామన్నారు. విదేశాలల్లో ఉన్నత విద్యకు రూ.20లక్షల స్కాలర్‌షిప్ ఇస్తున్నామన్నారు. జిల్లాకో మెడికల్ కాళాశాలను ఏర్పాటు చేస్తున్నామని అందులో భాగంగానే ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాల మధ్యలో మీర్ఖాన్‌పేటలో భూమి పూజను చేసామని చెప్పారు. 1019 రెసిడెన్షియల్ కళాశాలలను ఏర్పాటు చేసామన్నారు. తెలంగాణ వచ్చినప్పుడు పర్క్యాపిటా ఇన్‌కం 19వ స్థానంలో ఉండేదని ఇప్పుడు దేశంలోనే నెంబర్ వన్‌గా ఉందన్నారు. ఇబ్రహీంపట్నంలో వంద పడకల ఆసుపత్రి ఏర్పటుకు చేసామన్నారు. 35కిలోమీటర్ల మేర నాలాను బాగు చేసి ఇబ్రహీంపట్నం చెరువును నింపేందుకు కృషిచేయడంతో ఇప్పుడు నిండు కుండలా కళకళలాడుతుందని ఆనందం వ్యక్తం చేశారు.

# స్థిరమైన ప్రభుత్వం, బలమైన నాయకునితోనే అభివృద్ధి

## ● చిట్యాల రోడ్డుషోలో మంత్రి కెటిఆర్

**చిట్యాల, నవంబరు 14, ప్రభాతవార్త :** స్థిరమైన ప్రభుత్వం బలమైన నాయకుడుతోటి అభివృద్ధి సాధ్యమని టిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ పురపాలక శాఖ మంత్రి కెటిఆర్ అన్నారు. ఎలక్షన్ రాగానే గంద్రగోళ పడవద్దు అని ఆగమాగం కావద్దని అని ఆయన అన్నారు. మంగళవారం చిట్యాలో నిర్వహించిన రోడ్ షోకు హాజరై మాట్లాడుతూ ఎలక్షన్ల అనగానే సంక్రాంతికి గంగిరెద్దులోళ్ళు వచ్చినట్లు జనంలో లేని కాంగ్రెస్, బిజెపి పార్టీ వాళ్లు వచ్చి ఓట్లు అడుగుతున్నారని విమర్శించారు. నకిరేకల్ నియోజకవర్గ ప్రజలు తెలివైన వారని కరెంటు కావాలా, కాంగ్రెస్ కావాల అని ప్రశ్నించారు. తెలంగాణ రాకముందు కరెంటు పరిస్థితి ఇలా ఉండే ప్రస్తుతం ఎలా ఉంది అని అన్నారు. 24 గంటల కరెంటు ఇస్తున్న ముఖ్యమంత్రి కెసిఆర్ కావాలంటే టిఆర్ఎస్ పార్టీ కార్ గుర్తుకేఓటు వేసి చిరుమర్తి లింగయ్యను గెలిపించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ పార్టీకి ఎందుకు ఓటేయాలని అన్నారు. 24 గంటల కరెటు ఇవ్వనందుక, సాగునీరు, ఇంటింటికి త్రాగునీరు ఇవ్వనందుక, ఆసరా పింఛన్లు ఇవ్వనందుకా, రైతుబంధు, రైతుభీమా పథకాలు అమలు చేయనందుకా ఎందుకు ఓటేయాలని అడిగారు. మళ్లి బిఆర్ఎస్‌ప్రభుత్వం వస్తే మహిళలకు సౌభాగ్య లక్ష్మి, పేదలకు రూ.400లకే గ్యాస్ సిలిండర్, రూ.16వేల వరకు రైతుబంధు పథకం, ప్రతి కుటుంబానికి కెసిఆర్ భీమా తదితర నూతన పథకాల కోసం టిఆర్ఎస్ పార్టీని గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి వచ్చిన అభివృద్ధి పనులను వివరించారు. చిట్యాల పట్టణానికి పాలిటెక్నిక్ కాలేజీ ఈ ప్రాంత యువతకు ఉపాధి అవకాశం కోసం వెలిమినేడు వద్ద ఇండస్ట్రీయల్ పార్క్ కావాలన్నా, చిట్యాల పట్టణంలో జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ బ్రిడ్జి, బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్ట పూర్తి కావాలంటే, ధర్మారెడ్డిపల్లి, పిల్లాయిపల్లి కాలువల పనులను పూర్తి కావాలన్నా మరొక్కసారి కారు గుర్తుకే ఓటు వేయాలని కోరారు. కరోనా మహమ్మారి వలన నియోజకవర్గంలో సాగునీరు పనులు కొద్దిగా వెనుకబడ్డాయని వచ్చే తొమ్మిది నెలల్లో కాలువలు ప్రాజెక్టులు పూర్తి చేసి సాగు నిర్వహిస్తామని తెలిపారు. చిన్న చిన్న సమస్యలు ఉంటాయి సముదాయించుకోవాలి సమస్యలు పరిష్కరించుకుందాం అని అన్నారు. కాంగ్రెస్ బిజెపి నాయకులు డబ్బు సంచులతో వస్తారు మోసపోవద్దని ప్రజలు కోరారు. ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ నకిరేకల్ నియోజకవర్గంలో తనను ఓడ కొట్టడం కోసం అరాచక శక్తులన్నీ ఒకటయ్యాయని అన్నారు. తాను అధికారంలో ఉన్నప్పుడు నియోజకవర్గం ప్రశాంతంగా ఉంచానని ప్రజలు తెలుసునని అన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ పురపాలక శాఖ మంత్రి కెటిఆర్ జిల్లా మంత్రి జగదీష్‌రెడ్డిల సహకారంతో నియోజకవర్గానికి వేల కోట్ల రూపాయలు తీసుకువచ్చి అభివృద్ధి చేశానని తెలిపారు. ఈకార్యక్రమంలో నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, బోనగిరి జెడ్పి చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, గుత్తా అమిత్‌రెడ్డి, తెలంగాణ ఉద్యమ నాయకుడు చెరుకుసుధాకర్‌గౌడ్, మార్కెట్ కమిటిచైర్మన్ జడల ఆదిమల్లయ్య యాదవ్ తదితరులు ఉన్నారు.



# తెలంగాణలో పవన్ ప్రచారంపై ఇంకా అస్పష్టత

**హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త:** తెలంగాణలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఎన్నికల్లో పాల్గొంటారా? లేదా? అనే సందిగ్ధం కొనసాగుతోంది. రాష్ట్రంలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన బీజేపీతో పొత్తు పెట్టుకున్న సంగతి తెలిసిందే. పొత్తులో భాగంగా జనసేన రాష్ట్రంలోని 8 శాసనసభ స్థానాలకు పోటీ చేస్తోంది.

అయితే జనసేన అభ్యర్థుల తరపున పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రచారంలో పాల్గొంటారని నాయకులు చెబుతున్నప్పటికీ ఎప్పుడు? ఎక్కడ? పాల్గొంటారనేది స్పష్టత లేదు.

బీజేపీ, జనసేన పొత్తు నేపథ్యంలో పవన్ కళ్యాణ్ ప్రచారానికి వస్తే రెండు పార్టీలకు ఉపయోగం ఉంటుందని భావిస్తున్నప్పటికీ.. ప్రచారం షెడ్యూల్‌పై ఇంకా స్పష్టత లేదు. పైగా బీజేపీ జాతీయ నేతలు పాల్గొనే బహిరంగ సభల్లో సైతం పవన్ కళ్యాణ్ పాల్గొంటారా? లేదా? అనేది కూడా స్పష్టత లేదు. కానీ ఎన్నికల ప్రచారం ముగిసే లోగా జనసేన పోటీ చేస్తున్న నియోజకవర్గాల్లో పవన్ కళ్యాణ్ ప్రచారంలో పాల్గొంటారని మాత్రం పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఒకవేళ నేరుగా ప్రచారంలో ఎక్కువ సమయం కేటాయించలేకపోతే.. కనీసం రోడ్ షో లాగానైనా పాల్గొంటారని పార్టీ నాయకులు చెబుతున్నారు. బీజేపీ నాయకులు పవన్ కళ్యాణ్‌ను ప్రచారానికి పిలవడానికి ముందు వెనుకా ఆలోచిస్తున్నట్టు తెలుస్తోంది.

పవన్ కళ్యాణ్ ఎన్నికల్లో ప్రచారం చేస్తే కేసీఆర్ లాంటి వాళ్లు తిరిగి తెలంగాణ సెంటిమెంట్‌ను ముందుకు తీసుకొస్తారేమోననే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అందుకే పవన్ కళ్యాణ్‌ను ఎన్నికల ప్రచారానికి రావాలని గట్టిగా కోరడం లేదని తెలుస్తోంది. అయితే బీజేపీ వాళ్ల కోసం కాకపోయినా కనీసం తమ పార్టీ వాళ్లకోసం అయినా పవన్ ఎన్నికల ప్రచారం నిర్వహించాల్సి ఉంటుంది. అది ఎప్పుడనేది స్పష్టత లేకపోయినప్పటికీ.. ప్రచారం చేస్తారని మాత్రం పార్టీ నాయకులు చెబుతున్నారు.

# ఎన్నికల వేళ బెట్టింగ్‌ల జోరు

## అభ్యర్థుల గెలుపోటములపై జోరుగా పందాలు

## ఎన్నికల విధుల్లో బిజీగా పోలీసులు, అధికార యంత్రాంగం

**హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త :** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో బెట్టింగ్ రాయుళ్లు జోరు పెంచారు. అభ్యర్థుల గెలుపోటములపై జోరుగా బెట్టింగ్‌లు కడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో అభ్యర్థుల గెలుపోటములపై బెట్టింగ్‌లు సహజమే అయినప్పటికీ ఈసారి ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల మధ్య పోరు నువ్వా నేనా అనే రీతిలో సాగుతోంది. జిల్లా, నియోజకవర్గ కేంద్రాలే కాకుండా గ్రామాలు, పట్టణాల్లోనూ ఈ బెట్టింగ్‌ల దందా జోరుగా సాగుతుండటం గమనార్హం. ఆయా పార్టీల అభ్యర్థులు గెలుస్తారని కొందరు, కాదు ఓడిపోతారని మరికొందరు భారీ మొత్తంలో బెట్టింగ్‌లు కడుతున్నారు. ముఖ్యంగా సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్న గజ్వేల్, కామారెడ్డి, టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి పోటీ చేస్తున్న కొడంగల్, కామారెడ్డితో పాటు వికారాబాద్, పరిగి, తాండూరు, వరంగల్ అసెంబ్లీ స్థానాలపై బెట్టింగ్‌లు సాగుతున్నాయి. ఎవరు గెలుస్తారు ? ఎవరు ఓడిపోతారు ? అనే అంశాలపై పందాలు ఎక్కువగా కడుతున్నారు. ఇలా కేవలం నియోజకవర్గాలే కాకుండా బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీల్లోని పేరున్న నేతలు నియోజకవర్గాలపై కూడా బెట్టింగ్‌లు జోరుగా సాగుతున్నాయి. రాష్ట్రంలోని ఏ పల్లె ఏ పట్టణం చూసినా ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వస్తాయి ? మన నియోకజవర్గంలో గెలిచేది ఎవరు ? అలాగే ఎంత మెజార్టీతో గెలుస్తారు అనే దానిపై ఉత్కంఠ నెలకొంది. కాగా, తాను అభిమానించే పార్టీపై లేదా అభ్యర్థిపై ఉన్న మోజుతో కొందరు బెట్టింగ్ కాస్తుండగా మరి కొందరు సంపాదనే ధ్యేయంగా బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. చివరికి గెలిచిన అభ్యర్థిపై పందెం కాసిన వారు లబ్ది పొందనుండగా, ఓటమి పాలయ్యే అభ్యర్థిపై బెట్టింగ్ కాసిన వారు భారీగా నష్టపోయే అవకాశం ఉంది. మరోవైపు, మరో రెండు వారాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలలో ఏ పార్టీ గెలుస్తుంది ? అనే విషయంపై రాష్ట్రమంతా తీవ్రమైన ఉత్కంఠ నెలకొని ఉండగా, ఆ ఆసక్తిని క్యాష్ చేసుకునేందుకు కొందరు బెట్టింగ్ రాయుళ్లు అమాయకులను ఈ ఊబిలోకి దింపుతున్నారు. ఫలానా పార్టీకి చెందిన అభ్యర్థిపై బెట్టు కాస్తే భారీ మొత్తంలో లాభం వస్తుంది అంటూ ఊదరగొడుతున్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఓ ప్రధాన పార్టీకి చెందిన అభ్యర్థిపై మరో ప్రముఖ నేత పోటీలో ఉండటం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ నెలకొంది. దీంతో ఇక్కడ భారీ స్థాయిలో బెట్టింగ్‌లు నడుస్తున్నాయి. ప్రస్తుతం క్రికెట్ వరల్డ్ కప్ పోటీలు రసవత్తరంగా సాగుతుండగా, అంతకు మించి అసెంబ్లీ ఎన్నికల బెట్టింగ్‌లు సాగుతున్నాయి. వివిధ పార్టీల నేతలు ప్రచారంలో పాల్గొని సాయంత్రం ఓట్లను ఎలా పొందాలి అనే వ్యూహాల్లో నిమగ్నమై ఉండగా, ఆ సమయంలో రాజకీయాల గురించి చర్చలు సాగిస్తూ కొందరు బెట్టింగ్‌లు కాస్తున్నారు.

ఎన్నికల్లో తమ పార్టీకి, అభ్యర్థికి ఉన్న గెలిచే అవకాశాలను బట్టి ఒకటికి రెండు రెట్లు పందెం కాస్తున్నారు. కొందరు బెట్‌ను రూ.లక్షల్లో కడుతుండగా, మరి కొందరు ఫలితాల తరువాత పార్టీ ఇవ్వాలనే షరతుతో సరిపెట్టుకుంటున్నారు. మరికొందరు డబ్బులు ఇప్పుడు కట్టలేని పరిస్థితుల్లో బాండ్ పేపర్ల మీద సైతం రాసుకుంటున్నట్లు సమాచారం. పోలీసులు, ఇతర ప్రభుత్వ అధికార యంత్రాంగం ఎన్నికల విధుల్లో బిజీగా ఉండగా, వీటి వైపు దృష్టి సారించడం లేదు. ఇదే అదనుగా బెట్టింగ్ రాయుళ్లు పార్టీలు, అభ్యర్థుల గెలుపోటములపై రూ.లక్షల్లో పందాలు కాస్తున్నారు.

# టిడిపికి సిఐడి నోటీసులు

## 18లోగా పార్టీ ఖాతాల వివరాలు అందజేయాలని సూచన

**విజయవాడ, నవంబరు 14, ప్రభాతవార్త ప్రతినిధి:** స్కిల్ స్కామ్ కేసులో తెలుగుదేశం పార్టీకి ఏపీ సీఐడీ నోటీసులను జారీ చేసింది. పార్టీకి సంబంధించిన ఖాతాల వివరాలను ఈ నెల 18వ తేదిలోపుగా తమకు అందజేయాలని ఈ నోటీసుల్లో స్పష్టం చేసింది. తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి సీఐడీ కానిస్టేబుల్ వెళి ్ళ కార్యాలయ కార్యదర్శి అశోక్‌బాబుకు ఈ నోటీసులు అందించారు. చంద్రబాబు స్కిల్‌స్కామ్ కేసులో కీలక నిందితునిగా ఉన్నారు. ఆయన ఈ స్కామ్‌లో నిధులను డొల్ల కంపెనీలతో పాటు, టీడీపీ ఖాతాకు జమచేయించినట్లు సీఐడీ ఆరోపిస్తోంది. ఇందుకు సంబంధించి స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో జమ అయిన నగదు వివరాలను తెలిపాలని సీఐడీ టీడీపీని కోరింది. సిఐడీ అధికారుల పార్టీ ఖాతాలకు జమ అయిన నగదు వివరాలు తెలపాలంటూ తమ వేధిస్తున్నారంటూ టీడీపీ ఇప్పటికే హైకోర్టు ను ఆశ్రయించింది. అయితే ఇంకా విచారణ పరిధికి రాలేదు. ఈ క్రమంలో సీఐడీ టీడీపీకి నోటీసులు అందజేసింది. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు మరి కొంత మందిపై ఆర్ధిక నేరం ఆపాదించబడింది. ఈ కేసులో 52 రోజుల పాటు చంద్రబాబు రిమాండ్‌లో ఉన్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యకారణాలతో మధ్యంతర బెయిల్‌పై బయటకు వచ్చారు.

ఈ బెయిల్ ఈ నెల 24 నాటికి ముగియ నున్నది. ఈ క్రమంలో కేసుకు సంబంధించి టీడీపీకి కొన్ని నిధులు అందినట్లు సీఐడీ ఆరోపించింది. నేడు నోటీసులు ఇచ్చింది.

## 'జగనన్న విద్యాకానుక'లో

# రూ.120 కోట్ల అవినీతి

## ఢిల్లీలో తీగలాగితే ఎపిలో డొంక కదులుతోంది..

## బడిపిల్లలకు నాణ్యతలేని బూట్లు, బ్యాగులు ఇచ్చి మోసం: జనసేన పిఏసి చైర్మన్ నాదెండ్ల

**అమరావతి, నవంబర్ 14, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో వైఎస్సార్సీ పాలనలో జరుగుతున్న అవినీతి అంతా ఇంతా కాదని, పైకి అంతా పారదర్శకం అంటూ ప్రచారం చేసుకుని, లోలోపల మాత్రం వేలకోట్లను వైఎస్సార్సీ నేతలు జేబులో వేసుకుంటున్నారని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ఏశాఖలో చూసినా వేల కోట్ల ప్రజాధనాన్ని పోటీపడి మరీ వైఎస్సార్సీ నేతలు ఎలా కాజేస్తున్నారో జనసేన లెక్కలు, ఆధారాలతో సహాయ బయటపెడుతుందన్నారు. ముందుగా చెప్పినట్టుగా నవంబర్ 14 నుం చి ప్రతిరోజు ప్రభుత్వంలో జరిగిన అవినీతి పాపాలను మీడియా సమక్షంలో ప్రజల ముందు బయటపెడతామని చెప్పామని అందులో భాగంగా తొలిరోజైన మంగళవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 'జగనన్న విద్యాకానుక' పేరుతో జరిగిన భారీ అవినీతిని, దోపిడీని బయటపెడుతున్నామని మనోహర్ వెల్లడించారు. మంగళవారం ఇక్కడి జనసేన కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

## రేపటి నుంచి ఎపిలో

# కులగణన ఆరంభం

## 5 గ్రామ, వార్డు సచివాలయాల్లో పైలట్ ప్రాతిపదికన మొదలు: మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

**విశాఖపట్నం, నవంబర్ 14, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి తన దార్శనీకతతో ఒక మహాత్తరమైన నిర్ణయానికి శ్రీకారం చుట్టారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రేపటి నుంచి సమగ్ర కులగణన కార్యక్రమం చేపట్టనుంది. దీనికి సంబంధించి ఈనెల మూడో తేదీనే కేబినెట్ సమావేశంలో మంత్రిమండలి కులగణనకు ఆమోదం తెలిపిందని మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల నిరుపేదలకు సామాజిక , సాధికారతా సురక్షనుకల్పించడమే లక్ష్యంగా సమగ్రకుల గణనకార్యక్రమాన్ని చేపడుతున్నాం.

**వెనుకబాటు వర్గాల గుర్తింపునకు ఆస్కారం:** రాష్ట్రంలో దాదాపు 139 బిసి కులాల ఆకాంక్షలు నెరవేరడానికి ఈ కార్యక్రమం దోహదపడుతోంది. సమగ్ర కుల గణన ద్వారా ఈ రాష్ట్రంలో అనేక వెనుకబాటు వర్గాల్ని గుర్తించే ఆస్కారం లభిస్తొంది అనెల 15న రాష్ట్రంలో తొలుత 5 గ్రామ వార్డు సచివాలయల పరిధిలో పైలెట్ ప్రాతిపదికన ఈ కార్యక్రమాన్ని చేపట్టి, నిర్వహణ, విధానపరమైన అంశాలను క్రోడీకరించి రాష్ట్రమంతటా ఈ బృహత్తర కార్యక్రమాన్ని అమలుచేస్తామన్నారు. కుల గణనకు సంబంధించి వివిధ కుల సంఘాలు హాజరుకానున్నాయి. ఆయా ప్రాంతాల కులాల స్థితిగతులు, వారు క్షేత్రస్థాయిలో అనుభవిస్తున్న సామాజిక అంశాలపై కులసంఘాల ప్రతినిధుల సూచనలను స్వీకరిస్తారు.

**వెనుకబాటు కులాలకు ప్రాధాన్యత కల్పించే దిశగా:** రాష్ట్రంలో వెనుకబడిన తరగతులుఎస్సీ,ఎస్టీ, మైనార్టీ వర్గాలతోపాటు అన్ని వర్గాల్లోని పేదలకు విద్య, సంక్షేమం, నివాసం వంటి అంశాల్లో ప్రాధాన్యత కల్పించే దిశగా గౌరవ ముఖ్యమంత్రి జగన్ కులగణన ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. గత ఏప్రిల్ 11వ తేదీన మహాత్మాజ్యోతిభా పూలేజయంతి సందర్భంగా 139 బిసికులలతో పాటు ఎస్సీ,ఎస్టీ, బిసి, మైనార్టీవర్గాలు, ఉన్నత వర్గాల్లో పేదరికంలో మగ్గుతున్న కులాలను గుర్తించి వారి సంక్షేమం, అభ్యున్నతి ప్రణాళికల రూపకల్పన చేపట్టేం దుకు కులగణన బాధ్యతలను బిసిమంత్రిగా నాకు అప్పగించారని మంత్రి అన్నారు. ఈ కుల గణన ప్రక్రియ ఈనెల 15 నుండిపవిత్రమైన కార్తీక మాసంలో సమున్నత ఆశయంతో ప్రారంభిస్తున్నాము.

**నోడల్ అధికారులుగా జాయింట్‌కలెక్టర్లు:** ఈ కార్యక్రమానికి సీనియర్ ఐఎస్ అధికారిగా ఉన్న ప్రణాళిక శాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో బిసి, సోషల్, మైనార్టీ, ఎస్టీ వెల్ఫేర్‌శాఖతోపాటు సచివాలయ వ్యవస్థ ప్రిన్సిపల్ సెక్రటరీలు ఇందులో భాగస్వాములను చేసామన్నారు. అధేవిధంగా ఇప్పటికే బీహార్ రాష్ట్రం లో జరిగిన కులగణన పరిశీలించేందుకు ప్రత్యేక అధికారుల బృందాన్ని పంపి అక్కడ పరిస్థితులపై సేకరించిన ఒక నివేదికను పరిగణలోకి తీసుకున్నామన్నారు. రేపటి నుంచి జాయింట్‌కలెక్టర్లు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తు ఈనెల 15,16 తేదీల్లో అన్ని జిల్లా కేం ద్రాల్లో వివిధ కులాలకు చెందిన పెద్దలు, మేధావులు, కుల సంఘాల ప్రతినిధులు, సంఘాల నేతలు, ప్రతినిధుల నుండి సలహాలు, సూచనలు స్వీకరిస్తారు. వీటిని కులగణన కార్యక్రమంలో పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. కుల గణన కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఐదు చోట్ల ప్రాంతీయ సదస్సులు నిర్వహిస్తున్నాము. ఈనెల 17వతేదీన రాజమహేంద్రవరం, కర్నూలులో 20వ తేదీన విశాఖపట్నం, విజయవాడలో , 24వ తేదీన తిరుపతిలో ఈ సదస్సులు జరుగుతాయన్నారు.

**సామాజిక న్యాయానికి చిరునామాగా ఎపి:** రాష్ట్రప్రభుత్వం ఇప్పటికే అమలుచేస్తున్న నవరత్నాల ప్రాధాన్యతా కార్యక్రమాలతో పేదలకు ముఖ్యమంత్రి వైఎస్‌జగన్మోహనరెడ్డి భాంధవుడిగా నిలిచారన్నారు. ప్రస్తుతం చేపట్టిన కులగణన సమాచారంతో రాష్ట్రంలోని ఎసీ ్స, ఎస్టీ, బిసి, మైనార్టీ వర్గాలతోపాటు ఉన్నత వర్గాల్లోని పేదరికం అనుభవిస్తున్న కులాలకు కూడా సంక్షేమ ఫలాలను అందించేందుకు వీలుకానుంది. అన్ని కులాల సమతా స్థాయిని సాధించి, సామాజిక న్యాయానికి ఆంధ్రప్రదేశ్ చిరునామాగా నిలువబోతుంది. ముఖ్యమంత్రి జగన్ ఆశయసాధనలో ఆయన వెంట నడుస్తూ ఇలాంటి మహత్తరమైన చారిత్రాత్మక ఘట్టంలో పాల్గొనడం తన అదృష్టం అన్నారు. సమగ్ర కులగణన కార్యక్రమంలో అన్ని కులాల, వర్గాల ప్రజలు చైతన్యవంతంగా పాల్గొని ఆదర్శసమసమాజ సాధనలో భాగస్వాములు కావాలని మనవి చేసుకుంటున్నానని మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ తెలిపారు.

# తెగుళ్ల ఉధృతి.. పంటలపై పురుగుల దాడి

## ● దిగుబడిపై తీవ్రప్రభావం ● వరి, పత్తి, పప్పుధాన్యాలు, కూరగాయలకు నష్టం ● ఆందోళనలో రైతాంగం

**హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త:** ప్రస్తుత వానాకాలం సీజనులో తెలంగాణలో పంటలకు తెగుళ్లు సోకి రైతులను నిండా ముంచుతున్నాయి. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా వివిధ పంటలపై పురుగులు దాడి చేస్తున్నాయి. చేలు తెగుళ్ల బారిని పడడంతో ఎన్ని మందులు వాటినా ఫలితం కనిపించక భారీగా పంట దెబ్బతింది. దీంతో లక్షలాది రూపాయలు ఖర్చు చేసినా ప్రయోజనం లేకపోగా రైతులు మరింత అప్పుల పాలు కావాల్సి వచ్చింది. ప్రధానంగా వరి, పత్తి, మిర్చితోపాటు, వేరుశెనగ, కంది, శెనగ, మొక్కజొన్న, మినుము, పెసర తదితర పంటలతోపాటు, కూరగాయల తోటలపై పురుగుల దాడి ఉధృతంగా ఉందని రైతాంగం ఆందోళన చెందుతోంది. ఒక పక్క పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, మరోపక్క వర్షాలు వెరసి వానాకలం పంటలు పురుగులు, తెగుళ్ల పాడు చేస్తున్నాయని పలువురు రైతులు వాపోతున్నారు. వీటి పర్యవసానంగా పూత, కాత దెబ్బతిన దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలోని ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, వరంగల్, ఖమ్మం, సిరిసిల్లా, నల్లగొండ, జగిత్యాల, మహబూబాబాద్ తదితర జిల్లాల్లో వరి చేలపై తెల్లని మచ్చలు ఏర్పడుతున్నాయి. చివరికి ఇవి పసుపు రంగులోకి మారి ఎండిపోతున్నాయి. తెగులు అధికంగా ఉన్న మరికొన్ని చోట్ల ఆకు మొత్తం బూడిద రంగులోకి మారి ఎండిపోతున్నట్లు రైతులు వాపోతున్నారు. అదేవిధంగా రాష్ట్రంలోని దాదాపు అధిక జిల్లాలోలన పత్తి పంటపై ఎర్ర బొమ్మడి తెగులు దాడి చేస్తున్నాయి. ఇందువల్ల పూత, కాయలు రాలిపోతున్నాయని రైతాంగం కన్నీటి పర్యాంతవుతోంది. రాష్ట్రంలోని గద్వాల జిల్లాలో శెనగ తోటలపై ఎండు తెగులు, పచ్చపురుగు వ్యాపించాయి. అలాగే వనపర్తి, గద్వాల తదితర జిల్లాల్లో వేరుశెనగ పంటకు ఆకుమచ్చ తెగులు, ఇతర ప్రాంతాల్లో పొగాకు లద్దె పురుగు ఎక్కువగా ఉన్నాయి. వరంగల్, నిర్మల్, ఖమ్మం, కరీంనగర్, హన్మకొండ వంటి జిల్లాల్లో మొక్కజొన్న పైరు కత్తెర పురుగుకు గురైంది. ఇది కంకులు, ఆకులను పూర్తిగా తినివేస్తుండడంతో రైతులకు మింగుడు పడడం లేదు. మంచిర్యాల, ఖమ్మం, వికారాబాద్, ఆదిలాబాద్ వంటి జిల్లాల్లో కంది పంటపై శనపగపచ్చ పురుగు, మరుకా మచ్చల పురుగు, కాయ ఈగ వంటి తెగుళ్లు వ్యాపించాయి. వీటి వల్ల మొక్కలో మొగ్గ, పూత, పిందెల మీద గుడ్లు పెడుతుండగా, వీటి నుండి వచ్చిన లార్వా వాటిని తినడంతో పంట మొత్తం నష్టం అవుతున్నట్లున రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలోని ఖమ్మం, కొత్తగూడెం తదితర జిల్లాల్లో మిరప సాగు చేసిన రైతుల పరిస్థితి దయనీయంగా తయారైంది. రాష్ట్రలోనే అత్యధికంగా ఖమ్మం తర్వాత మహబూబాబాద్, వరంగల్, గద్వాల, భూపాలపల్లి, కొత్తగూడెం, తదిర జిల్లాల్లో మిర్చి పంటను సాగు చేశారు. అయితే తెగుళ్లతో మిర్చి పంట దెబ్బతింది. మిర్చి పైరు ఎదుగుదల దశలో తొలుత జెమిని వైరస్ ఆశించింది. దీనికితోడు పలు ప్రాంతాల్లోన ఎండు తెగులు కూడా సోకింది. ఫలితంగా వేరు కుళ్లడం, కొమ్మలు ఎండి పోవడంతో మిర్చి తోటలు దెబ్బతిన్నాయి. అంతలోనే గతంలో ఎన్నడూ లేని విధంగా తామర పురుగు పంటపై దాడి చేసింది. అదేవిధంగా కూరగాయల తోటలకు తెగుళ్ల బెడద అధికంగా ఉంది. చిక్కుడు కాయల్లో పురుగులు చేరి గింజలను తినేస్తున్నాయి. వంగ, టమోటాలపై తెగుళ్లు వ్యాపించి మచ్చలు పడుతున్నాయని అంటున్నారు. వంగ తోటల్లో కొమ్మ, కాయ తొలుచు పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంది. ఇక బత్తాయి తోటలపై నల్లిపురుగు సోకి పూతర కాత రాలుతున్నాయని దీంతో ఈ సారి దిగుబడి తగ్గి నష్టాలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని రైతులు కన్నీటి పర్యాంతమవుతున్నారు.

# కాంగ్రెస్ ముక్త భారత్ కోరుకుంటోంది

## కర్ణాటక మంత్రి దినేష్ గుండురావు

**హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ ముక్త భారత్ కోరుకుంటోందని కర్ణాటక మంత్రి దినేష్ గుండురావు అన్నారు. మంగళ వారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. అయితే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంటో గెలిచి తీరుతుంద న్నారు. వివిధ పార్టీలు ఈ ఎన్నికల్లో పాల్గొంటున్నాయని, కానీ గెలుపు కాంగ్రెస్ పార్టీది అన్నారు. కాంగ్రెస్ ముక్తభారత్ కోరుకుటుంద న్నారు. తెలంగాణలో బిఆర్‌ఎస్‌ను కాంగ్రెస్ ఎన్నికల్లో ఎదుర్కొబోతుందన్నారు. కర్ణాటక ఎన్నికల తరువాత కాంగ్రెస్ వేగంగా పుంజు కుందన్నారు.

అభివృద్ధి నినాదం మీద ఏర్పడిన తెలంగాణ కెసిఆర్ కుటుంబం చేతిలో ఉందన్నారు. తెలంగాణ మిగులు నిధులతో ఆర్థికంగా బలమైన రాష్ట్ర అన్నారు. కానీ అభివృద్ధి శూన్యం అన్నారు. కర్ణాటకలో ఐదు గ్యారెంటీలను మూడు నెలల్లోనే అమలు చేశామన్నారు. కేంద్ర మద్దతు ఇవ్వకపోయినా బియ్యం పంపిణీ చేస్తున్నా మన్నారు. మనదేశంలో లక్షల కోట్ల రూపాయలు ధనికులు, వ్యాపారులు కొల్లగొట్టార న్నారు. తెలంగాణలో కూడా ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతామన్నారు. విద్యుత్ విష యంలో తెలంగాణ పరిస్థితులు, కర్ణాటక పరిస్థి తులకు చాలా తేడా ఉందన్నారు. అయినా కర్ణాట కలో ఎలాంటి సమస్య లేదన్నారు. బిఆర్‌ఎస్, బిజెపి నాయకులకు ఏమైనాడా అనుమానాలు ఉంటే వచ్చి పరిశీలిన చేయాలన్నారు. తాము స్వాగతిస్తామన్నారు. సాధారణ పౌరులకు ఎలాంటి సమస్య లేకుండా కరెంటు చార్జీలు అమలు చేస్తున్నామన్నారు. కర్ణాటక రైతుల ధర్నా కావాలని ఆడిస్తున్న డ్రామా అన్నారు.

# బిజెపికి బిఆర్‌ఎస్ బి-టీం

## కేంద్ర మాజీమంత్రి మనీశ్‌తివారి

**హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త:** బిజెపికి బిఆర్‌ఎస్ బి టీం అని కేంద్ర మాజీ మంత్రి మనీశ్ తివారి అన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీనియర్ నేతలు గౌమత్ సేత్, రమణి, వచన్‌కుమార్‌లతో కలిసి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం కోసం ఎంతో మంది పోరాటం చేశారని, వందలాది మంది బలిదానాలు చేశారన్నారు. తొలి విడత, రెండో విడత, మలి విడత పోరాటాలు 2014 వరకు చాలా సుదీర్ఘంగా సాగాయన్నారు. 2014 ఫిబ్రవరి పార్లమెంటులో బిల్లు పెట్టామన్నారు. యువత బలిదానాలు, పోరాటాలు చూసి సోనియా రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. తెలంగాణ వచ్చి తొమ్మిది సంవత్సరాలు అవుతున్నా ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదన్నారు. బిఆర్‌ఎస్ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరలేదన్నారు. బిజెపికి బిఆర్‌ఎస్ బి టీం అన్నారు. పార్లమెంటులో అవకాశం వచ్చినప్పు డల్లా బిజెపికి బిఆర్‌ఎస్ బిఆర్‌ఎస్ మద్దతూ ఇస్తూ వచ్చిందన్నారు. నోట్ల రద్దును అన్ని పార్టీలూ వ్యతిరేకించినా బిఆర్‌స్ మద్దతు తెలిపిందన్నారు. రాష్ట్రాల సమాఖ్యవాదాన్ని కేంద్రం దెబ్బతీస్తూ బిఆర్‌ఎస్‌కు అంగా నిలిచిందన్నారు. జమ్ముకశ్మీర్ స్వయం ప్రతిపత్తిని కేంద్రం రద్దు చేస్తే అనుకూలంగా ఓటేసిందన్నారు. రాష్ట్రంలో కుటుంబ పాలన నడుస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరిపైనా లక్షా అరవై వేల అప్పు ఉందన్నారు. రాష్ట్రం వచ్చినప్పుడు మిగులు రాష్ట్రంగా ఉంటే ఇప్పుడు అప్పుల్లో కూరుకు పోయిందన్నారు. ప్రజాసంక్షేమాన్ని గాలికి వదిలేశారన్నారు. అన్ని స్కీముల్లో అవినీతికి పాల్పడుతు న్నారన్నారు. దళితబంధు, డబుల్ బెడ్‌రూం ఇండ్ల స్కీంలలో కమిషన్లు తీసుకుం టునా్రన్నారు. అందుకే ఈ ప్రభుత్వాన్ని పారదోలాల్సిన అవసరం ఉందన్నారు వచ్చే ఎన్నికల్లో కొత్త ప్రభుత్వాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందని, కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలన్నారు.

# కెసిఆర్ కుటుంబానికి లక్షల కోట్లు ఎలా వచ్చాయి!?

## 30వేల కోట్లకు పూర్తి కావాల్సిన కాళేశ్వరం ప్రాజెక్టు వ్యయం పెంచి భారీగా దోపిడీ

## బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్

**హుస్నాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త:** తిండికి లేని కెసిఆర్ కుటుంబానికి లక్షల కోట్లు ఎక్కడి నుండి వచ్చాయో రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని కరీంనగర్ ఎంపి, బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అన్నారు. మంగళవారం హుస్నాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్నర్ సమావేశానికి ముఖ్యఅతిధిగా హాజరైన ఆయన మాట్లాడుతూ 30 వేల కోట్లతో పూర్తి కావాల్సిన కాళేశ్వరం ప్రాజెక్టు వ్యయాన్ని ఇబ్బడిముబ్బడిగా పెంచేసి భారీగా దోచుకున్నారని మండిపడ్డారు. బిఆర్‌ఎస్, కాంగ్రెస్ తోడు దొంగలు అని రాష్ట్రంలో బిజెపి గెలవకుండా ఉండేందుకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు కెసిఆర్ వచ్చే ఎన్నికల్లో పెట్టుబడి పెట్టబోతున్నారని ఆరోపించారు. కరీంనగర్‌లో చెల్లని రూపాయి పొన్నం ప్రభాకర్ అని ఆ రూపాయి హుస్నాబాద్‌లో ఎలా చెల్లుతుందని ఎద్దేవా చేశారు. ఈ ప్రాంతంలోని గౌరవెల్లి ప్రాజెక్టు నిర్వాసితులపై ప్రభుత్వం లాఠీచార్జి చేయిస్తే అర్థరాత్రి ఢిల్లీ నుండి బయలుదేరి వచ్చి వారిని



మాట్లాడుతున్న బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్

ఆసుపత్రిలో చేర్పించి అండగా నిలిచిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి బొమ్మ శ్రీరాంచక్రవర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు లక్కిరెడ్డి తిరుమల, పార్టీ పట్టణ అధ్యక్షులు బత్తుల శంకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# మరో రూ.1,000 కోట్ల రుణం తీసుకున్న తెలంగాణ

**హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం తాజాగా మరో 1,000 కోట్ల రూపా యల మేర అప్పు చేసింది. బాండ్లను వేలం వేయడం ద్వారా ఈ మొత్తాన్ని సేకరించింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఈ వేలంలో సెక్యూరిటీ బాండ్లను తనఖా పెట్టి ఈ రుణాన్ని తీసుకుంది. ఇందుకుగాను 17 ఏళ్ల కాలపరిమితితో 7.73శాతం చొప్పున వార్షిక వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది.

# బలగాల మోహరింపుపై అధికారుల కసరత్తు

## మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేకదృష్టి



**హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త:** రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడు తుండడంతో జిల్లాలు, కమిషనరేట్లలో పోలీసు బలగాల మొహరింపుపై ఉన్న తాధికారులు కసరత్తులు చేయసాగారు. ఈ ఎన్నికలకు రాష్ట్ర పోలీసులతో పాటు కేంద్ర బలగాలు, పొరుగు రాష్ట్రాల పోలీసు సిబ్బంది కూడా బందోబస్తులో పాల్గొంటుం డడం తెలిసిందే. ఈ క్రమంలో స్థానిక పోలీసులతో పాటు ఏ ఏ ప్రాంతంలో ఎంతమేరకు పారా మిలటరీ బలగాలు, పొరుగు రాష్ట్రాల బలగాలను కేటాయించాలనేది ఇ ప్పుడు కీలకంగా మారింది. ఇదే సమయంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. పొరుగు రాష్ట్రం ఛత్తీస్‌గడ్‌లో ఎన్నికల స ందర్భంగా హింస చెలరేగడంతో దాని ప్రభావం తెలంగాణలో పడకుండా చూసేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని వారు నిర్ణయించారు.

రాష్ట్రంలో ఈ నెల 30వ తేదీన జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా రెండు వారాల గడువు మాత్రమే వుండడంతో పోలీసు శాఖ భద్రతా ఏర్పాట్లను వేగంగా చేయ సాగింది. ఈ ఎన్నికల కోసం నామినేషన్ల ఉపసంహరణకు బుధవారం తుది గడువు అవడంతో దీని తరువాత ప్రచారం వేగం పుంజుకోనుండడంతో ముందస్తుగా బందో బస్తుపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు. అసెంబ్లీ ఎన్నికల కోసం ఇప్పటికే ఎన్నికల సంఘం అధికారులతో పోలీసు ఉన్నతాధికారులు పలుదఫాలు సమావేశమవడం తెలిసిందే. ఇందులో బందోబస్తు గురించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఎన్నికల బందోబస్తు కోసం రాష్ట్ర బలగాలకు తోడుగా వుండేందుకు 200 కంపెనీల కేంద్ర బలగాలతో పాటు కర్నాటక, ఎపి, తమిళనాడు, ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్రల నుంచి మరో 20 వేల మంది వరకు పోలీసు సిబ్బంది వచ్చే అవకాశాలున్నాయి. కేంద్ర బ లగాలలో సగం వరకు ఇప్పటికే తెలంగాణకు చేరుకోగా మిగతావి మరో వారం రోజుల్లో రానున్నాయి.

ఇదే సమయంలో పొరుగు రాష్ట్రాల బలగాలు ఎన్నికలకు ఐదారు రోజుల ముందు చేరుకునే వీలుంది. ఇక ఎన్నికలు ఒకే దఫాలో జరుగుతుండడంతో బందోబస్తు కోసం కేటాయించే సిబ్బందిని ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి త రలించేందుకు అవకాశాలు లేవు. దీంతో బలగాల మొహరింపులో ముందుగానే పటిష్టమైన వ్యూహాన్ని ఎంచుకోవాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. పొరుగు రాష్ట్రాల కు చెందిన పోలీసు బలగాలు సమీపంలోని జిల్లాలకు కేటాయించే వీలుంది. కేంద్ర బలగాలలో సిఆర్‌పిఎఫ్, సిఐఎస్‌ఎఫ్ బలగాలే ఎక్కువగా వుండే వీలుంది.

ఈ బలగాలు రాష్ట్రంలోని పలుచోట్ల ఇప్పటికే పలు బెటాలియన్లలో వుండడంతో ఇక్కడి నుంచే కేటాయించే వీలుంది. ఒకవేళ ఇందులో ఏమైనా సమస్యలు వుంటే పొరుగు రాష్ట్రాలలోని బెటాలియన్ల నుంచి రప్పించే అవకాశాలున్నాయి. ఎన్నికలకు కనీసం వారం రోజుల ముందే బలగాల కేటాయింపు జరిగే వీలుంది. ఇదే సమయంలో నాలుగై దు రోజుల ముందు బలగాల మొహరింపు వుండే వీలుంది. కాగా ఎన్నికల బందోబస్తులో పారా బలగాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే బలగాలకు ఆయా జి ల్లాలు, కమిషనరేట్లలో ఇప్పటికే వసతి సౌకర్యం ఏర్పాటు చేశారు. ఈ ఏర్పాట్లు ఆయా జిల్లాలు, కమిషనరేట్ల అధికారులు చేబట్టారు. పోలింగ్ నాటికి ఈ బలగాలన్నీ తమకు కేటాయించిన ప్రాంతాలకు తరలివెళ్లేందుకు కూడా ఏర్పాట్లు పూర్తయ్యాయి.

### మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

ఇదిలా ఉండగా ఈసారి జరిగే ఎన్నికలకు మావోయిస్టు పార్టీ బహిష్కరించడం తెలిసిందే. ఎన్నికలను బహిష్కరించాలని ఆ పార్టీ ప్రజలకు పిలుపునివ్వడం విదితమే. మావోయిస్టు పార్టీ ప్రతీ ఎన్నికలను బహిష్కరించడం మామూలే అయినా ఎన్నికల వేళ హింసకు పాల్పడే అవకాశాలుం డడంతో పోలీసులు అందుకు తగినట్లుగా బందో బస్తులో మార్పులు చేర్పులు చేబట్టారు. తెలంగాణకు సరిహద్దులో గల ఛత్తీస్‌ఘడ్‌లో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మావోయిస్టు పార్టీ పలుచోట్ల హింసకు పాల్పడి న నేపథ్యంలో దాని ప్రభావం రాష్ట్రంలోని సరిహద్దు జిల్లాలలో పడకుండా చూడసాగారు.

గత ఎన్నికల సమయంలో మావోయిస్టు పార్టీ కొన్నిచోట్ల హింసకు పాల్పడడంతో వీటిని దృష్టిలో వుంచుకుని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలలో అదనపు బలగాలను ముందుగానే మొహరించారు. ఎన్నికలకు రెండు వారాల సమయం మాత్రమే వున్న సమయంలో మావోయిస్టు పార్టీ పలుచోట్ల అధికార బిఆర్‌ఎస్, ప్రతిపక్ష బిజెపి నాయకులను టార్గెట్ చేస్తూ కరపత్రాలను పంపిణీ చేయడం కలకలం రేపింది. దీ నిపైనా పోలీసు అధికారులు దృష్టి సారించారు.

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలలో ఎట్టిపరిస్థితుల్లోనూ ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని భావిస్తున్న ఉన్నతాధికారు లు అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోసాగారు.

# తప్పుడు లెక్కలు చూపితే అనర్హత వేటే

## రూ.40 లక్షల వరకే ఖర్చుకు పరిమితి

## ఎన్నికల పోల్ వ్యయంపై నియంత్రణ

**హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త:** ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ప్రచారం తదితర వాటి నిమిత్తం తాము చేసే వ్యయ వివరాలను ఎన్నికల కమిషన్‌కు సమర్పించాల్సి ఉంటుంది. అభ్యర్థులు ఇష్టం వచ్చినట్లు డబ్బును విచ్చల విడిగా ఖర్చు చేయడానికి అవకాశం లేదు. అభ్యర్థి చేసే ఎన్నికల ఖర్చుపై నియంత్రణను నిర్దేశించింది. ఎన్నికల ఖర్చును తప్పుడు లెక్కలు చూపినట్లయితే అభ్యర్థిపై అనర్హత వేటు వేసే అధికారం ఎన్నికల కమిషన్‌కు ఉంది. ఇందుకు అనుగుణంగా కమిషన్ నిబంధనలు, మార్గదర్శకాలు మేరకే వ్యయం చేయాలి. డబ్బు, కండ బలం దుర్వినియోగం లేకుండా ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా చూసుకోవడానికి ఎన్నికల సంఘం పలు చర్యలు చేపట్టింది. ?ఇందుకుగాను రాష్ట్రాల్లోని పరిస్థితులను బట్టి ఎన్నికల వ్యయాన్ని నిర్ధారిస్తుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఎన్నికలు ప్రక్రియ జరుగుతున్న 5 రాష్ట్రాల్లో ఎంత వరకూ వ్యయం చేయాలనేదానిపై స్పష్టత ఇచ్చింది. ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, తెలంగాణ, రాజస్థాన్ రాష్ట్రాల్లో 40 లక్షల రూపాయలు, మిజోరంలో 28 లక్షల రూపాయల వరకూ ఎన్నికల ఖర్చు చేయవచ్చు. ఎన్నికల వ్యయాన్ని ఎన్నికల కమిషన్ రెండు విస్తృత వర్గాలుగా విభజించింది. ఇందులో ప్రచారాలు, బహిరంగ సభలు, ర్యాలీలు, ప్రకటనలు కాగా, అక్రమ వ్యయాల విషయానికి వస్తే లంచం, డబ్బు, మద్యం, ఇతర వస్తువులు తదితర వాటిని ఓటర్లకు పంచడం వంటి అనుమతి లేని చట్ట విరుద్ధమైన ఖర్చులు ఉంటాయి. ఎన్నికల వ్యయ పర్యవేక్షణలో భాగంగా ఎన్నికల వ్యయాన్ని అభ్యర్థులు నిజాయితీగా నివేదించాల్సి ఉంటుంది. ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 77(1) ప్రకారం, ప్రతీ అభ్యర్థి ఎన్నికల ఖర్చులన్నింటికీ ప్రత్యేక, సరైన ఖాతను ఉంచడం తప్పనిసరి చేసింది. అభ్యర్థి, అతని ఎన్నికల ఏజెంట్ నామినేట్ చేయబడిన తేదీ నుండి ఫలితాల వరకూ ఆర్‌పి చట్టం 1951, సెక్షన్ 77(3) ప్రకారం నిర్దేశించబడిన పేర్కొన్న వ్యయం మొత్తం మించకూడదు. ఈ ఖాతాను సక్రమంగా నిర్వహించడంలో వైఫల్యం చెందితే అది ఎన్నికల నేరం కింద ఎన్నికల సంఘం పరిగణిస్తుంది. అంతేకాకుండా ఫలితాలను ప్రకటించిన 30 రోజుల లోపు, పోటీ చేసే అభ్యర్థి తప్పనిసరిగా తన ఎన్నికల ఖర్చుల ఖాతాకు సంబంధించి వాస్తవ వివరాల కాపీని జిల్లా ఎన్నికల అధికారికి విధిగా సమర్పించాల్సి ఉంటుంది. ఖతాలోని వివరాలు తప్పుగా లేదా అవాస్తవమని తేలితే ఎన్నికల సంఘం సదరు అభ్యర్థిని అనర్హులుగా ప్రకటిస్తుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఒక అభ్యర్థిచట్టం ద్వారా నిర్ణయించబడిన సీలింగ్‌కు అనుగుణంగా తన ఎన్నికల వ్యయాన్ని చేయడం, దానికి సంబంధించిన ఖాతాను కూడా నిర్వహించడం చేయాల్సి ఉంటుంది.

## వివేకానందరెడ్డి హత్య కేసులో

# కీలక పరిణామం

## తన పేరును తొలగించాలని

## సిబిఐ కోర్టులో దస్తగిరి పిటిషన్

**హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త:** మాజీమంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో మంగళవారం నాడు మరో పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఎ4 నిందితుడుగా వుండి అప్రూవర్‌గా మారిన దస్తగిరి సిబిఐ కోర్టులో ఓ పిటిషన్ దాఖలు చేస్తూ వివేకా హత్య కేసుకు సంబంధించి నిందితుల జాబితా నుంచి తన పేరును తొలగించాలని అభ్యర్థించాడు.

తనను కేవలం సాక్షిగానే పరిగణించాలని అతను కోరాడు. ఈ కేసులో సిబిఐ దాఖలు చేసిన మొదటి ఛార్జిషీట్‌లో తనను సాక్షిగా చేర్చిన విషయాన్ని అతను కోర్టుకు ఈ సందర్భంగా తెలిపాడు. కాగా దస్తగిరి పిటిషన్‌పై వివేకా హత్య కేసులో ఇతర నిందితులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దస్తగిరి పిటిషన్‌పై సిబిఐ కోర్టు బుధవారం నాడు విచారణ చేబట్టనుంది.

# ఆన్‌లైన్‌లో రాజకీయాలు.. సోషల్ మీడియాపైనే ఆధారం

## ప్రచార పంపిణీ నుండి రీఛార్జికీ డిజిటల్ వేదిక

## ఎన్నికల్లో మారుతున్న పార్టీల శైలి

**హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త:** ఇప్పుడు అంతా ఆన్లైన్లోనే. తినే తిండి దగ్గర నుండి వేసుకునే బట్టల వరకూ కాలు బయట పెట్టకుండానే అన్నీ ఇంటి వద్దకే వచ్చేస్తున్నాయి. ఇప్పుడయితే తాజాగా రాజకీయాలు కూడా ఆన్ లైన్‌లోకి ఎక్కేసాయి. ప్రచారం నుండి పంపిణీ వరకూ పార్టీలు ఓటర్లకు ఆన్ లైన్‌లోనే సప్లై చేస్తున్నాయి. ఇందుకు సోషల్ మీడియాను పెద్ద ఎత్తున పార్టీలు ఉపయోగించుకుంటున్నాయి. అలాగే ఆన్ లైన్‌లో పేమెంట్లు, గిఫ్ట్ కార్డుల నుండి ఇంటర్నెట్ బిల్లులు, మొబైల్ రీఛార్జ్‌లు వరకూ అంతన పగడ్బందీ వ్యవహారం నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. రాజకీయ పార్టీలు ఎంత టెక్నాలజీ పెరిగినా భారీ ప్రచారాలు, బహిరంగ సభలు, ర్యాలీలు, రోడ్ షోలు వంటివి పెట్టక తప్పని పరిస్థితి ఏర్పడింది. మెల్ల మెల్లగా ట్రెండ్‌లో మార్పులు వస్తున్నా, ఇంకా తప్పని పరిస్థితుల్లో బహిరంగ ప్రచారాలు చేస్తూనే ఉన్నాయి. మరోపక్క ఓటర్ల మొబైల్ ఫోన్ల లోకి నేరుగా దూసుకుపోయే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి. అయితే ఇది గత ఎన్నికలు నుంచే మొదలైనప్పటికీ ఇప్పుడు ఆ పద్ధతి కొత్త పుంతలు తొక్కుతుంది. నియోజకవర్గాలకు సంబంధించిన ఫేస్‌బుక్ అకౌంట్లు, మొబైల్ నెంబర్లు, ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలు, ఇన్‌స్టాగ్రామ్ ఐడీలు వంటి వాటిని రాజకీయ పార్టీలకు చెందిన సోషల్ మీడియా ఇన్‌ఛార్జులు ఇప్పటికే సేకరించాయి. ఏరియా, బర్త్ ప్లేస్ పేరుతో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో సెర్చ్ చేసి డేటా తయారు చేస్తున్నారు. కొన్ని ఏజెన్సీలు ప్రత్యేక సాఫ్ట్‌వేర్ల ద్వారా సంబంధిత నియోజయవర్గానికి సంబంధించిన ఓటర్ల వివరాలు అందిస్తున్నాయి. ఇప్పుడు చాలా మందికి సోషల్ మీడియా ఎకౌంట్‌ను ఓపెన్ చేస్తే వారి స్థానిక అభ్యర్థుల ప్రచారం ఆటోమేటిక్‌గా ప్రత్యక్షమవుతుంది. వాళ్లకు సంబంధించిన ఫోటోలు గంట గంటకూ దర్శనమిస్తున్నాయి. అంతేకాకుండా మొబైల్ నెంబర్లకి ఆటోమేటెడ్ వాయిస్ కాల్స్, మెసేజ్‌లు తరస్తూ వస్తున్నాయి. ఇందంతా డేటా అనాలసిస్ ద్వారానే సాధ్యమవుతుంది. కొంత మంది ఎమ్మెల్యేలు అయితే ముందు నుండి నియోజకవర్గానికి సంబంధించిన ఓటర్ల డేటాను పూర్తిగా సేకరించి పెట్టుకున్నారు. ఇలా నేరుగా వారి ఖాతాల్లో కనెక్ట్ అయిపోయి పనిలో పనిగా మొబైల్‌లో ఎన్నికల ప్రచారాన్ని చేస్తున్నారు.

ఇక ప్రచారంతో పాటు, పంపిణీ కూడా ఆన్ లైన్‌లో చేసే ఏర్పాట్లు జరుగుతున్నాయి. గూగుల్ పే, ఫోన్ ఫో, పేటీఎం, వాటాప్స్, అమెజాన్ తదితర పేమెంట్ వాలెట్ల ప్లాట్‌ఫామ్ ద్వారా పంపిణీ చేసేందుకు ఎమ్మెల్యే అభ్యర్థులు పలువురు రంగం సిద్ధం చేసుకున్నట్లు సమా చారం. ఎలక్షన్ కమిషన్ సీరియస్‌గా ఉండటం, పోలీస్, ఐటీ, ఎక్సైజ్ తదితర పలు శాఖల అధికారులు తనిఖీలు పెద్ద పెత్తున చేస్తుండటంతో ప్రత్యమ్నాయంగా డిజిటల్ వాలెట్‌ను ఆశ్రయిస్తూ ఇప్పటి నుండే వాటి ద్వారా అడపాదడపా నగదు బదిలీలు జరుగుతున్నట్లు తెలియవచ్చింది. మరికొందరు ప్రస్తుతం బూత్‌ల వారీగా ఫోన్ నెంబర్లు తీసుకోవడంతో పాటు, వారి బ్యాంక్ ఖాతా డిజిట్ వాలెట్ ఏ నెంబరుతో లింక్ అయిందో కూడా సేకరిస్తున్నారు. అయితే మనీ వాలెట్లపైన కూడా నిఘా ఉండటంతో స్థానిక నేతల నుండి కాలనీ పెద్దలకు, అక్కడ నుండి ఓటర్లకు డిస్ట్రిబ్యూషన్ అయ్యేలా ప్లాన్ చేశారు. అలాగే గిఫ్ట్ కార్డులు మరో రకం పంపిణీ అమెజాన్, ఫ్లిప్ కార్డ్, మిత్రా లాంటి ఈ కామర్స్ షాపింగ్ గిఫ్ట్ కూపన్లు పంపుతున్నారు. వీటిన నేరుగా అందచేయకుండా ఓటర్ల మొబైల్ ఫోన్లకు కూపన్ నెంబర్లు పంపించే ఏర్పాటున చేస్తున్నారు.

# నాంపల్లి అగ్నిప్రమాదంపై కొనసాగుతున్న విచారణ

## ఆసుపత్రిలో చేరిన భవన యజమానిని విచారిస్తున్న పోలీసులు

## యేళ్ల తరబడి కొనసాగుతున్నా పట్టించుకోని అధికారులు

**హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త:** నగరంలోని నాంపల్లి బజార్‌ఘాట్‌లో సోమవారం జరిగిన భారీ అగ్ని ప్రమాదంపై పోలీసు, అగ్నిమాపక విభాగాల విచారణ కొనసాగుతోంది. తొమ్మిది మంది మరణానికి దారితీసిన ఈ దుర్ఘటనకు భవనంలోని సెల్లార్‌లో రసాయన నిలువలు గల డ్రమ్ములు వుంచడం కారణమని ప్రాథమికంగా తేలడం తెలిసిందే. అయితే ఈ రసాయనాలు ఎక్కడి నుంచి తెచ్చారు...? జనావాసం ఎక్కువగా వుండే ప్రాంతంలో గల నాలుగంతస్తుల భవనం సెల్లార్ ఎందుకు వుం చారనేది ఇప్పటివరకు వెల్లడి కాలేదు. దీనిపై పోలీసులు, అగ్నిమాపక విభాగాల అధికారులకు కూడా పక్కా సమాచారం అందలేదు. మరోవైపు అగ్ని ప్రమాదం జరిగిన భవనం యజమాని రమేష్ జైస్వాల్ ప్రమాదం తరువాత అనారోగ్యం పాలై జూబ్లీహిల్స్‌లోని ఓ ఆసుపత్రిలో చేరారు. అతన్ని పోలీసులు అక్కడే విచారిస్తున్నారని తెలిసింది.

నగరంలో సంచలనం రేపిన బజార్‌ఘాట్ అగ్ని ప్రమాదంపై పోలీసు, అగ్నిమాపక శాఖల విచారణ వేగం పుంజుకుంది. సోమవారం ఉదయం తొమ్మిది గంటల 15 ని మిషాల సమయంలో భవనంలోని సెల్లార్‌లో గల రసాయనాల డ్రమ్ముల్లో ఒక్కసారిగా చెలరేగిన మంటల కారణంగా అగ్నికీలలు ఎగసిపడి, మొత్తం భవనం అంతా వా ్యపించడం తెలిసిందే. దీని కారణంగా పొగచూరి, ఊపిరిఆడక తొమ్మిది మంది మృత్యువాత పడడం విదితమే. ప్రమాదంపై వెంటనే స్పందించిన అగ్నిమాపక శాఖ రం గంలో దిగి 21 మందిని కాపాడారు. ఇదే సమయంలో సెల్లార్‌లో మంటలకు దూరంగా వున్న రసాయనాల డ్రమ్ములను బయటకు తరలించి ప్రమాద తీవ్రతను తగ్గిం చారు. ప్రమాదం జరిగిన భవనం నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారని అగ్నిమాపక శాఖ వెల్లడించింది. రెండంతస్తుల భవనానికే అనుమతులు పొందిన దీని యజ మాని అనంతరం నాలుగంతస్తుల వరకు నిర్మించాడని అగ్నిమాపక శాఖ తేల్చింది. ఇదే విషయాన్ని బల్దియా అధికారులు కూడా ధృవీకరించారు. భవన నిర్మాణం సంగ తి ఎలావున్నా సెల్లార్‌లో పదుల సంఖ్యలో రసాయనాల డ్రమ్ములను భవన యజమాని రమేష్ జైస్వాల్ ఎక్కడి నుంచి తీసుకువచ్చాడనే దానిపై పోలీసులు ఆరా తీయ సాగారు. కూలర్లలోని పరికరాలను అతికించేందుకు వాడే సొల్యూషన్ తరహాలోని రసాయనం మండే స్వభావం ఎక్కువగా వుండడంతో ఏ మాత్రం అగ్గి తగిలినా మంట లు చెలరేగే వీలుంటుందని అగ్నిమాపక శాఖ అధికారులు చెబుతున్నారు. సోమవారం ఉదయం సరిగ్గా ఈ పరిస్థితుల్లోనే మంటలు చెలరేగాయని వారంటున్నారు. మరోవైపు అగ్ని ప్రమాదం జరిగిన భవనం సెల్లార్‌లో రసాయనాల డ్రమ్ములు చాలా కాలంగా వున్నాయని, అయితే దీనిపై అధికారులెవరూ పట్టించుకోలేదని స్థానికులు చెబు తున్నారు.

రసాయనాల డ్రమ్ములు ఒకసారి వచ్చిన తరువాత కొన్ని రోజులకు మరోచోటికి వెళ్లడం, ఆ తరువాత మరో దఫాగా ఇంకొన్ని డ్రమ్ములు రావడం అనేది తర చూ జరుగుతున్నా దీనిపై తాము పట్టించుకులేదని స్థానికులు చెబుతున్నారు. ఈ రసాయనాల డ్రమ్ముల వల్ల ప్రమాదం ఇంత భారీగా వుంటుందని తాము ఊహించలేక పోయామని వారంటున్నారు. కాగా భవన యజమాని జైస్వాల్ ఆసుపత్రి నుంచి విడుదలయ్యాక అతన్ని అరెస్టు చేసే వీలుంది.

### నాంపల్లి, బజార్‌ఘాట్ ప్రాంతాల్లో మరిన్ని భవనాల్లో రసాయన నిలువలు

ఇదిలా ఉండగా సోమవారం నాడు అగ్నిప్రమా దం జరగడానికి కారణమైన రసాయనాలు నాంపల్లితో పాటు బజార్‌ఘాట్‌లోని మరిన్ని అపార్ట్ మెంట్లలో వున్నట్లు స్థాని కులు చెబుతు న్నారు. ఈ ప్రాంతంలో లారీలు, ఆటోలను మరమ్మత్తులు చేసే పలు పరిశ్రమలు వున్నాయని, దీంతో పాటు కూలర్లు తయారుచేసే పరిశ్రమలు కూడా వున్నాయని, వీటిలో రసాయనాల వాడకం తప్పనిసరి అవడంతో వీటి నిలువలు ఇక్కడ ఎక్కువగా వున్నాయని స్థానికులు తెలిపారు. ఈ విషయంలో పోలీసులతో పాటు అగ్నిమాపక శాఖ అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

# ఢిల్లీలో అగ్నిప్రమాదం, ఒకరు మృతి!

**న్యూఢిల్లీ, నవంబరు 14:** దేశరాజధాని ఢిల్లీలోని షకర్‌పూర్ ప్రాంతంలో చోటు చేసుకున్న భారీ అగ్నిప్రమాదంలో ఒక మహిళ మృతి చెందింది. తూర్పు ఢిల్లీలోని షకర్‌పూర్ ప్రాంతంలోని ఒక నివాస భవనంలో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఒక మహిళ మరణించగా, ఒక చిన్నారి సహా 26 మందిని అగ్నిమాపక సిబ్బంది రక్షించారు. మంటలు చెలరేగినప్పుడు భవనంలో 60 మంది ఉన్నారని, వీరిలో కొందరు భవనంపై నుంచి దూకి ప్రాణాలు కాపాడుకున్నారని అగ్ని మాపక శాఖ అధికారులు తెలిపారు. కాగా అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని, 26 మందిని ప్రమాదం బారి నుంచి కాపాడారు. అలాగే మంటలను అదుపులోకి తీసుకు వచ్చారు. అగ్నిప్రమాదం జరిగిన సమయంలో భవనంలో తొక్కిసలాట జరిగింది. ప్రమాదానికి సంబం ధించిన సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు. కొన్ని గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

# దేశంలో కరోనా తాజా కేసులు - 18

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 14:** భారత్‌లో కరోనా వైరస్ వ్యాప్తి కొనసాగుతోంది. గడిచిన 24 గంటల్లో దేశ వ్యాప్తంగా 18 కేసులు నమోదయ్యాయి. మృతి నమోదు కాలేదు. ఇప్పటివరకు దేశంలో కరోనా బారిన పడిన మొత్తం బాధితుల సంఖ్య 4,50,01,482కు చేరిందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ వెల్లడించింది. మొత్తం బాధితుల్లో ఇప్పటి వరకు 4,44,68,032 మంది కోలుకోగా 155 మంది దేశంలోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇప్పటి వరకు దేశంలో కరోనా కారణంగా మృతి చెందినవారి సంఖ్య 5,33,295కు చేరినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం దేశంలో కరోనా వైరస్ బారినపడి కోలుకుంటున్న వారి(రికవరీ రేటు) 98.81 శాతంగా ఉంది. దేశంలో కరోనా కారణంగా మరణాల రేటు 1.19 శాతంగా ఉంది. మహారాష్ట్రలో కరోనా పాజిటీవ్ కేసుల సంఖ్య 81,71,918కి చేరగా, 80,23, 347మంది వరకు కోలుకున్నా రు.1,48,563 మంది ప్రాణాలు కోల్పోయారు. కేరళలో కరోనా పాజిటీవ్ కేసుల సంఖ్య 69,07,498కి చేరింది. అందులో 68,35,397 మంది కోలు కున్నారు. 72,043మంది మరణించారు.




# హుజూరాబాద్‌లో చతుర్ముఖ పోటీ

**జమ్మికుంట - ప్రభాతవార్త**

ఉద్యమాలకు పురిటిగడ్డగా వాసికెక్కిన కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గం అటు విప్లవకారులను తయారు చేయడంలోను, కాకలు తీరిన రాజకీయ నేతలను తీర్చిదిద్దడం లోనూ హుజూరాబాద్ మట్టిగడ్డ తెలంగాణ ఉద్యమంలో పురిటిగడ్డగా మారి, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు పురుడుపోసుకున్న నియోజకవర్గం హుజూరాబాద్. రైతుబంధు, రైతుభీమా, దళితబంధు, మరెన్నో సంక్షేమ పథకాలకు పుట్టి నిల్లు అని చెప్పాలి. 1962సంవత్సరం రాజకీయాలు మొదలు కుని, నేడు 2023 నవంబర్ 30న జరుగుతున్న రాష్ట్ర అసెంబ్లీ సాధారణ ఎన్నికల వరకు ఈ నియోజకవర్గంలోని ఓటర్ల నాడి రాజకీయ విశ్లేషకులకు.. సర్వే సంస్థలకు పోటీలో ఉన్న అభ్యర్థులకు నామినేషన్ల పర్వం ముగిసినప్పటికి నేటికి అంతు చిక్కడం లేదంటే.. ఇక్కడ అంత ఆషామాషీ లేదు. ఈ నియోజకవర్గంలో నిజమైన ప్రజాస్వామ్యం ప్రతి ఎన్నికల్లోను విరబూస్తు ఉంటుంది. ప్రధాన పార్టీల అభ్యర్థులుగా ప్రస్తుత ఎమ్మెల్యే బిజెపి పార్టీ అభ్యర్థిగా ఈటల రాజేందర్, బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పాడి కౌశిక్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఒడితల ప్రణవ్‌బాబు, బిఎస్పి పార్టీ అభ్యర్థిగా పల్లె ప్రశాంత్ గౌడ్‌లు పోటీలో ఉన్నారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే, రాష్ట్ర బిజెపి ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ 2004నుండి ఇప్పటి వరకు ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది, ఏనిమిదోవ సారి పోటీ చేయడానికి అనావాయితిగానే ఇక్కడ ప్రచారం ప్రారంభించారు. ఆరుసార్లు బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా గెలుపొందిన ఈటల రాజేందర్, రెండుసార్లు మంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయగలిగారు. ఈటల రాజేందర్ బిఆర్ఎస్ పార్టీకి, ఎమ్మెల్యేగిరికి రాజీనామా చేసి బయటకు వచ్చి భారతీయ జనతా పార్టీలో చేరిన తరువాత 2021 అక్టోబర్ 30న జరిగిన ఉప ఎన్నిక విజయం సాధించారు. ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేసినా 23వేల 8వందల 55ఓట్ల మెజార్టీతో ఈటల గెలుపొందడం హుజూరాబాద్ రాజకీయ చరిత్ర సృష్టించారు. ఇప్పుడు జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలలో ఈటల రాజేందర్ ఏనిమిదోవ సారి హుజూరాబాద్‌లో పోటీ చేయడం, ఈటల గజ్వేల్‌లో కూడా రెండువైపులా గెలిస్తే ఇక్కడ రాజీనామా చేస్తాడా.. అక్కడ రాజీనామా చేస్తాడా.. అన్న సందేహాలు ప్రజల్లో మెదులుతున్నాయి. ఈటల రాజేందర్‌ను ఎలాగైన ఈసారి ఓడించి తీరాలన్న రాష్ట్ర ప్రగతి భవన్ ఆధేశాల మేరకు ఏరికోరి, ఎంపిక చేసుకున్న విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు తనను గెలిపిస్తాయన్న పూర్తి ధీమాతో కౌశిక్‌రెడ్డి గత ఆరు మాసాలుగా గ్రామాలలో ప్రచారం కొనసాగిస్తున్నాడు. హుజూరాబాద్ నియోజకవర్గానికి వెయ్యికోట్ల రూపాయల నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పథంలో నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతానని, ఓటర్లకు భరోసా ఇస్తున్నాడు. 2018లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన కౌశిక్‌రెడ్డి 61వేల 121ఓట్లు సాదించిన కౌశిక్‌రెడ్డి ఈటల రాజేందర్ చేతిలో 43వేల 7వందల ఓట్ల తేడాతో ఓటమి పాలైయ్యారు. ఆ తదుపరి కాంగ్రెస్ పార్టీ నుండి బిఆర్ఎస్ పార్టీలో చేరిన కౌశిక్‌రెడ్డి ఎమ్మెల్సీగా, ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు స్వీకరించి, హుజూరాబాద్‌లో తనదైన రాజకీయ పావులు కదుపుతూ ముందుకు దూసుకెళ్తున్నారు. కౌశిక్‌రెడ్డి ఆయన సతీమణి శాలిని రెడ్డి ప్రజలను ఓట్లు అడుగుతున్నారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు జమ్మికుంటలో నిర్వహించిన రోడ్‌షోకు భారీ సంఖ్యలో జనం హాజరైయ్యారు. హుజూరాబాద్ నియోజకవర్గ బాధ్యత, అభివృద్ధి తాను తీసుకుంటునని, కౌశిక్‌రెడ్డిని గెలిపించండి అంటూ ఆయన చేసిన ప్రచార హోరు బిఆర్ఎస్ పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచింది. గత 40సంవత్సరాలుగా హుజూరాబాద్ నియోజకవర్గంలో అభ్యర్థులు ఎందరు పోటీ చేసిన, రెండు పార్టీల మధ్యన నువ్వా.. నేనా.. అనే విధంగా పోటీ జరిగేది. అలాంటిది రాజకీయ నేపథ్యం ఉన్న సింగాపూర్ రాజేశ్వర్‌రావు మనమడు ఒడితల ప్రణవ్‌బాబు చిన్న వయస్సులోనే రాజకీయం అరంగేట్రం చేయడంతో హుజూరాబాద్ రాజకీయాలు ఉత్కంఠగా మారాయి. విధ్యావంతుడు, చిన్నవయస్కుడు అయినప్పటికి రాజకీయాలలో పావులు కదుపుడంలో ఉద్దన్నుడు. రాష్ట్ర నలుమూలాల కాంగ్రెస్ గాలి వీస్తుందంటూ ప్రచారం జరుగుతోంది. ఇదే గాలి హుజూరాబాద్ నియోజకవర్గంలో ముఖ్యంగా గ్రామాలలో కాంగ్రెస్ పార్టీని ప్రజలు కలవరిస్తున్నారంటే నియోజకవర్గంలో ప్రజలు ఎక్కడో ఒక చోట మార్పు కోరుకుంటున్నారు అన్న సంకేతాలు ప్రజల్లో బలంగా పనిచేస్తున్నాయని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ముఖ్యంగా యువతి యువకుల ఓట్లను ఆకర్శించేందుకు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ పథకాలపై తీవ్రంగా ప్రచారం చేస్తున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఓటర్లపై ప్రభావం చూపుతుందని భావిస్తున్నారు. నియోజకవర్గంలో విద్యావంతులు ఉద్యోగస్తులు, నిరుద్యోగులు ముఖ్యంగా మహిళ సంఘాలు, మైనార్టీలు పలు వర్గాల ప్రజలు ఈటల రాజేందర్, పాడి కౌశిక్‌రెడ్డి, ప్రణవ్‌బాబుల మధ్య ఉన్న రాజకీయ వ్యక్తుత్వాలను విశ్లేషిస్తున్నారు. కమలాపూర్ మండలానికి చెందిన బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా పల్లె ప్రశాంత్‌గౌడ్ న్యాయవాదిగా కొనసాగుతూ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు నమ్మిన బంటుగా బిఎస్పి పార్టీ బలోపేతానికి చాలా కాలంగా కృషి చేస్తున్నాడు. గౌడ సామాజిక వర్గానికి చెందిన ప్రశాంత్‌గౌడ్ బిసి సామాజిక అభ్యర్థి కావడంతో కొంత మేరకు ఎస్సి, ఎస్టి, బిసిల ఓట్లను చీల్చుతాడని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఈ నాలుగు పార్టీల నేతలు సభలకు, సమావేశాలకు అన్ని వర్గాల ప్రజలు బాహాటంగా వెళ్తున్నారు. మొన్న ప్రచారానికి వెళ్లింది వారే. నిన్న ప్రచారానికి వెళ్లింది వారే. ఈరోజు ప్రచారానికి వెళ్తుంది వారే. నియోజకవర్గ ఓటర్లు మనస్సున్న మహారాజులు, బిజెపి అభ్యర్థి ఈటల రాజేందర్‌ను, బిఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డిని, కాంగ్రెస్ అభ్యర్థి ఒడితల ప్రణవ్, బిఎస్పి అభ్యర్థి ప్రశాంత్‌గౌడ్‌ను ఎవ్వరిని తక్కువగా చూడకుండా ఆశల పల్లకిలో హుజూరాబాద్ ఓటర్లు వారిని ఊరేగిస్తున్నారు. నియోజకవర్గంలో ఇప్పటికి పాతిక సర్వే సంస్థలు ప్రత్యేక్షంగా, పరోక్షంగా సర్వేలు జరిపినప్పటికి హుజూరాబాద్ ఓటర్ల నాడి ఎవ్వరికి చిక్కలేదు. అంటే దటిజ్ హుజూరాబాద్ నియోజకవర్గ ప్రజలు అని చెప్పుకోవాలి. ఇంకో 10రోజులు గడిస్తే కానీ, పల్లకిలో కూర్చునేది ఏవరో.. పల్లికి దిగి వెళ్లిపోయేవారేవరు.. ఓటర్లే నిర్ణయించుకుంటారు.



హుజూరాబాద్ నియోజకవర్గంలో
మొత్తం ఓటర్లు 2లక్షల 44వేల 514
మహిళలు 1లక్షా 24వేల 833,
పురుషులు 1లక్షా 19వేల 676,
ఇతరులు 5.
మొత్తం పోలింగ్ స్టేషన్లు 305,
మొత్తం మండలాలు 5.

1. హుజూరాబాద్
2. జమ్మికుంట
3. కమలాపూర్,
4. ఇల్లందకుంట,
5. వీణవంక

# కరెంట్ చుట్టూ రాజకీయం

**హైదరాబాద్ - ప్రభాతవార్త నెట్‌వర్క్**

ఈ సారి ఎన్నికల్లో మరోసారి విద్యుత్ సరఫరా అంశం కీలకంగా మారింది. నాణ్యమైన విద్యుత్ ఇచ్చే విషయంపై బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపీలు ఎవరికి వారు ప్రకటనలు గుప్పిస్తున్నారు. కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి గతంలో మాట్లాడుతూ 5 గంటల కరెంట్ విషయం ప్రస్తావించారు. దీనిని బిఆర్ఎస్ ఒక ఆయుధంగా తీసుకుంది. కాంగ్రెస్ పార్టీ వస్తే విద్యుత్ సరఫరా కేవలం కొన్ని గంటలకే పరిమితం చేస్తారని బిఆర్ఎస్ ప్రచారం చేస్తోంది. అయితే ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రవేశపెట్టిందే కాంగ్రెస్ పార్టీ అని దానిని ఎలా తీసివేస్తామని రేవంత్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు పేర్కొంటున్నారు. ఇదే సమయంలో కర్నాటకలో కూడా ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఉచిత విద్యుత్ హామీతో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. ప్రస్తుతం కర్నాటక నుంచి కాంగ్రెస్ నేతలు ఇక్కడికి వచ్చి ప్రచారం చేస్తున్నారు. ఉచిత నిరంతర విద్యుత్ పేరుతో అధికారంలో వచ్చిన కాంగ్రెస్ పార్టీ కర్నాటకలో పథకం అమలులో విఫలం చెందిందని బిఆర్ఎస్ ఆరోపిస్తోంది. దీనికి అనుగుణంగా కొందరు కర్ణాటక రైతులు హైదరాబాద్‌లో ధర్నా నిర్వహించి విద్యుత్ సరఫరా విషయంలో కాంగ్రెస్ పార్టీని నమ్మవద్దని చెప్పేందుకు ప్రయత్నిస్తోంది. ఈమేరకు ధర్నా నిర్వహించడానికి అనుమతి ఇవ్వాలని ఎన్నికల అధికారులకు విజ్ఞప్తి కూడా చేశారు. కాగా తెలంగాణలో ప్రస్తుతం ఉచిత విద్యుత్ పథకం అమలులో ఉంది. అయితే ఈ విద్యుత్ సరఫరా నాణ్యతలోపంగా ఉందని, 24 గంటలు విద్యుత్ సరఫరా హామీ అమలుచేయడం లేదని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. తాము అధికారంలోకి వస్తే గతంలో ఇచ్చిన మాదిరిగానే నాణ్యమైన విద్యుత్ 24 గంటలు ఇస్తామని చెబుతున్నారు. ప్రస్తుతం బిఆర్ఎస్ ప్రభుత్వం ఇస్తున్న విద్యుత్‌లో నాణ్యత లేకపోవడం, 24 గంటల పాటు ఇవ్వకపోవడం వంటి కారణాల వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ నేతలు పేర్కొంటున్నారు. ఈ తరుణంలో ఇచ్చే విద్యుత్ కనీసం ఐదారు గంటల పాటు పూర్తి నాణ్యతతో ఇచ్చినా రైతులకు ప్రయోజనం ఉంటుందని తాము చెప్పిన మాటలను వక్రీకరించి రైతులను బిఆర్ఎస్ పార్టీ నేతలు తప్పు దారి పట్టిస్తున్నారని కాంగ్రెస్ నేతలు స్పష్టం చేస్తున్నారు.



# పాలమూరుపై పట్టెవరిది?

**మహబూబ్‌నగర్ బ్యూరో - ప్రభాతవార్త**

పాలమూరు అంటేనే రాష్ట్రంలోనే కాదు దేశంలోనే ఓ ప్రత్యేకత ఉంటుంది. వెనకబడ్డ జిల్లాగా, వలసలకు నిలయంగా గుర్తింపు పొందింది. స్వరాష్ట్రంలో తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, అమలు చేస్తున్న పథకాలు, సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ముందుడుగు వేయడంతో మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో మార్పు కనిపించింది. వలసలు తిరిగిరావడమే కాదు ఈ ప్రాంతానికే వలసలు వచ్చేలా మార్పులు జరిగాయి. స్వతంత్ర భారతదేశంలో 1952లో ప్రత్యేక నియోజక వర్గంగా పాలమూరు ఏర్పాటైంది. ఇప్పటి వరకు రెండు ఉపఎన్నికలతో కలిపి 17సార్లు ఎన్నికలు జరిగాయి. 5సార్లు కాంగ్రెస్ అభ్యర్థులు గెలువగా, మూడు సార్లు కాంగ్రెస్ అభ్యర్థులు, మూడు సార్లు స్వతంత్ర అభ్యర్థులు, రెండుసార్లు టీఆర్ఎస్, ఒక్కోసారి ప్రజాపార్టీ, కాంగ్రెస్ (ఐ) పార్టీల అభ్యర్థులు విజయం సాధించారు. అందులో 10సార్లు బీసీ వర్గాల నేతలు, నాలుగుసార్లు రెడ్డి వర్గం, రెండు దఫాలు మైనార్టీ నేతలు గెలుపొందారు. ఈ నియోజక వర్గంలో మొత్తం ఓటర్లు 2,43,367 కాగా అందులో పురుషులు 1,21,397, మహిళలు 1,21,960 ఉన్నారు. మహబూబ్‌నగర్ అర్బన్, మహబూబ్‌నగర్ రూరల్, హన్వాడ మండలాలు ఉన్నాయి. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ నుంచి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఏపీ మిథున్‌రెడ్డి బరిలో ఉండగా బీఆర్ఎస్ నుంచి బీసీ సామాజిక వర్గానికి చెందిన వీ శ్రీనివాస్ గౌడ్ నామినేషన్ వేశారు. బీఎస్పీ నుంచి పి.స్వప్న, స్వతంత్ర అభ్యర్థులుగా మున్నూరు రవి, మల్కాపురం శ్రీనివాస్‌గౌడ్, ఎం శ్రీనివాసులు, అశోక్‌కుమార్, కారుకొండ శ్రీనివాసులు, మహ్మద్ షరీఫ్, ప్రగతి శీల సమాజ్ నుంచి ఎంఏ ఖాదర్, భారత చైతన్య యువ జన పార్టీ నుంచి టి కృష్ణ, ధర్మసమాజ్ పార్టీ నుంచి కే రాములు తదితరులు నామినేషన్ వేశారు. అయితే ప్రధానంగా ఎపోటీ మాత్రం బీఆర్ఎస్, కాంగ్రెస్,బీజేపీ మధ్యే ఉండనున్నది.

**బిఆర్ఎస్‌కు పెరిగిన బలం**

వివిధపార్టీలకు చెందిన సీనియర్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరడంతో కారు గుర్తు పార్టీకి మరింత బలం చేకూరినట్లు అయ్యింది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, డీసీసీ మాజీ అధ్యక్షుడు ముత్యాల ప్రకాశ్, మాజీ మంత్రి పి చంద్రశేఖర్, మైనార్టీ సీనియర్ నాయకుడు ఇబ్రహీం పార్టీలో మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. దీనికితోడు బీసీ నేత కావడం, గత తొమ్మిదిన్న రేండ్లలో నియోజక వర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో శ్రీనివాస్‌గౌడ్ ప్రజల్లోకి వెళ్తున్నాడు. ముందు నుంచి స్థానికంగా ఉండడం, నిత్యం అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజల్లో ఉండేలా చూసుకోవడం మంత్రికి ప్లస్‌గా మారనున్నాయి. అయితే మొన్నటి దాకా బీజేపీలో ఉన్న యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల కాంగ్రెస్‌లో చేరి బరిలో నిలిచారు. అధికార పార్టీ నేతలు భూకబ్జాలు చేస్తున్నారని, మహబూబ్‌నగర్ ప్రజలను ఇబ్బందులకుగురి చేస్తున్నారని, ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, పేదలకు నిత్యం అండగా ఉంటానంటూ ప్రచార అస్త్రంగా వాడుకుంటున్నారు. మరోవైపు బీజేపీ అభ్యర్థిగా మిథున్‌రెడ్డి ప్రజల్లో ఉంటున్నారు. మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి తనకు వద్దని, తనయుడికి టికెట్ ఇప్పించుకున్నారు. యువకులు రాజీకయాల్లోకి రావాలని, గత నాలుగేండ్లుగా పార్టీ వ్యవహారాలు, సభలు, సమావేశాలు చూసుకుంటడంతో మిథున్‌రెడ్డి ప్రజల్లో ఉంటున్నారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా కొంతమేరకు కాంగ్రెస్ వేవ్ వస్తుండడం, మహబూబ్‌నగర్‌పై ఎంత మేరకు ప్రభావం చూపుతుందో చూడాల్సి ఉంది. అభివృద్ధి, సంక్షేమ నినాదంతో శ్రీనివాస్‌గౌడ్ దూసుకుపోతుండగా, మార్పు నినాదంతో యెన్నం శ్రీనివాస్‌గౌడ్, హిందుత్వం, కేంద్ర పథకాలతోనే అభివృద్ధి జరిగిందంటూ మిథున్‌రెడ్డి ప్రచారం నిర్వహిస్తున్నారు. 2014లో మహబూబ్‌నగర్‌లో టీఆర్ఎస్ విజయదుందుభీ మోగించింది. ఉద్యమ, ఉద్యోగ నాయకుడిగా ఉన్న వీ శ్రీనివాస్ గౌడ్ మహబూబ్‌నగర్‌లో విజయం సాధించారు. సమీప బీజేపీ అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి 42,308ఓట్లు రాగా శ్రీనివాస్‌గౌడ్‌కు 45447 ఓట్లు సాధించారు. మూడో స్థానంలో సయ్యద్ ఇబ్రహీం 27396 ఓట్లు, నాలుగో స్థానంలో ఒబేదుల్లా కొత్వాల్‌కు 22744ఓట్లు వచ్చాయి. 2014అనంతరం పాలమూరు రూపురేఖలు మార్చడంతోపాటు తాగునీటి గోసను తీర్చడంతో రెండో సారి శ్రీనివాస్‌గౌడ్‌ను మహబూబ్‌నగర్ ప్రజలు అఖండ మెజార్టీతో గెలిపించారు. కాంగ్రెస్ టీడీపీ పొత్తులో కలిసి ఎం.చంద్రశేఖర్ పోటీ చేయగా 28,699ఓట్లు రాగా, 21,664 ఓట్లతో బీఎస్పీ నుంచి పోటి చేసిన సయ్యద్ ఇబ్రహీం అభ్యర్థి మూడో స్థానంలో నిలిచారు.



**10సార్లు బిసి నేతలకు పట్టాభిషేకం**

| అభ్యర్థి పేరు | పార్టీ | సంవత్సరం | సమీప అభ్యర్థి |
|---|---|---|---|
| 1. పి హనుమంతరావు | కాంగ్రెస్ | 1952 | ఎస్ రావు |
| 2. ఇ చిన్నప్ప | ప్రజాపార్టీ | 1957 | ఎం రామిరెడ్డి |
| 3.ఎం రామిరెడ్డి | స్వతంత్ర | 1962 | ఎండీ ఇబ్రహీం అలీ |
| 4.ఇబ్రహీం అలీఅన్సారీ | కాంగ్రెస్ | 1967 | రాజేశ్వర్‌రెడ్డి |
| 5.ఇబ్రహీం అలీఅన్సారీ | కాంగ్రెస్ | 1972 | టీఆర్‌రెడ్డి |
| 6.ఎం రామిరెడ్డి | కాంగ్రెస్‌ఐ | 1978 | కేకే రెడ్డి |
| 7.ఆంజనేయులు | కాంగ్రెస్ | 1980 | ఆర్.రెడ్డి |
| 8.పి చంద్రశేఖర్ | టీడీపీ | 1983 | ఎంఏ షకూర్ |
| 9.పి చంద్రశేఖర్ | టీడీపీ | 1985 | జి సహదేవ్ |
| 10.పులివీరన్న | కాంగ్రెస్ | 1989 | పి చంద్రశేఖర్ |
| 11.పి చంద్రశేఖర్ | టీడీపీ | 1994 | పులివీరన్న |
| 12.పి చంద్రశేఖర్ | టీడీపీ | 1999 | పులివీరన్న |
| 13.పులివీరన్న | స్వతంత్ర | 2004 | పి చంద్రశేఖర్ |
| 14.రాజేశ్వర్‌రెడ్డి | స్వతంత్ర | 2009 | ఇబ్రహీం |
| 15.యెన్నం శ్రీనివాస్‌రెడ్డి | బీజేపీ | 2012 | ఇబ్రహీం |
| 16.వీ శ్రీనివాస్‌గౌడ్ | టీఆర్ఎస్ | 2014 | యెన్నం శ్రీనివాస్‌రెడ్డి |
| 17. వీ శ్రీనివాస్‌గౌడ్ | టీఆర్ఎస్ | 2018 | ఎం చంద్రశేఖర్ |

# అలంపూర్ ప్రజల ఆశీస్సులెవరికి!

**- ఆధ్యాత్మిక క్షేత్రం..చేనేతలో ప్రత్యేక గుర్తింపు**
**- పోటాపోటీగా కాంగ్రెస్-బీఆర్ఎస్**

**మహబూబ్‌నగర్ బ్యూరో - ప్రభాతవార్త**

అలంపూర్ రాజకీయంలో పార్టీల ప్రభావం కంటే వ్యక్తుల ప్రభావం అధికమని చెప్పవచ్చు. 2014లో తెలంగాణ వచ్చాక రాష్ట్రమంతా బీఆర్ఎస్ గాలి వీచినా అలంపూర్‌లో మాత్రం కాంగ్రెస్ అభ్యర్థి ఎస్ఏ సంపత్‌కుమార్ స్వల్ప మెజార్టీతో గెలిచారు. 2004లోనూ చల్లా వెంకట్రామారెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. ఈ నియోజకవర్గానికి మొత్తం 16సార్లు ఎన్నికలు జరుగగా 8దఫాలు కాంగ్రెస్, మూడు దఫాలు బీజేపీ, రెండు దఫాలు టీడీపీ, ఒక్కో దఫా జనతా, టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు నెగ్గారు. గత ఫలితాలను బట్టి చేస్తే ముఖ్యంగా కాంగ్రెస్ ప్రాబల్యం ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తుంది. 2004 వరకు ఒక లెక్క తర్వాత ఒక లెక్క అనే తీరులో ఓటర్లు తీర్పునిస్తున్నారు. ముఖ్యంగా స్థానికులకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

**చివరి నిమిషంలో అభ్యర్థుల మార్పు..**


బీఆర్ఎస్ నుంచి విజేయుడు, కాంగ్రెస్ నుంచి ఎస్ఏ సంపత్‌కుమార్, బీజేపీ నుంచి రాజగోపాల్‌కు బీఫాం అదించాయి ఆయా పార్టీల అధిష్టానాలు. అయితే బీఆర్ఎస్, బీజేపీ నుంచి నామినేషన్ చివరి రోజువరకు అభ్యర్థుల విషయంలో క్లారిటీ రాలేదు. బీఆర్ఎస్ నుంచి వీఎం అబ్రహం పేరు మొదటి జాబితాలోనే ఖరారు చేసినా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డికి అభ్యర్థి విషయంలో విముఖంగా ఉన్నారు. అయితే తన అనుచరుడు విజేయుడికి సీటు కేటాయించాలని, ప్రతిపాదన చేశారు. చివరి వరకు క్లారిటీ రాకపోవడంతో కార్యకర్తలు, నాయకులు సైతం అయోమయంలో పడ్డారు. అయితే వీఎం అబ్రహాన్ని అధిష్టానం బుజ్జగించినట్లు సమాచారం. ఈక్రమంలో చల్లా మద్దతు తెలిపిన విజేయుడికి అధిష్టానం బీఫాం ఇచ్చింది. అయితే తదనతరం పార్టీ వ్యవహారాలకు, ప్రచారాలకు దూరంగా ఉంటున్నారు వీఎం అబ్రహం. బీజేపీ అధిష్టానం నామినేషన్ చివరిరోజు మధ్యాహ్నం తర్వాత అలంపూర్‌కు చెందిన రాజగోపాల్‌కు కేటాయించింది. గతంలోబ్యాంక్ ఉద్యోగిగా పని చేశాడు. గత రెండేళ్లుగా పార్టీ కోసం నియోజకవర్గంలో పని చేస్తున్నారు. బీజేపీ నుంచి అయిజ నుంచి మాదన్న టికెట్ ఆశించినా నిరాశే మిగిలింది. రిటైర్డ్ ఎంఈవో మేరమ్మకు పేరు తెరమీదికి వచ్చినా చివరికినిర్ణయం మార్చారు. ఇక్కడ ఎస్సీ సామాజిక వర్గానికి సుమారు 50వేలకుపైగా వరకు ఓటర్లు ఉన్నారు. అయితే ప్రధానంగా పోటీ మాత్రం కాంగ్రెస్ బీఆర్ఎస్ అభ్యర్థుల మాధ్యనే ఉండనున్నది. బీఆర్ఎస్ అభ్యర్థి విషయంలో మార్పులు చేయడం, కొన్ని విషయాల్లో వ్యతిరేఖత ఉండడంతో కాంగ్రెస్ వైపే ఓటర్లు మొగ్గు చూపనున్నట్లు తెలుస్తున్నది.

**భూగోళిక అంశాలు..**

అలంపూర్ నియోజకవర్గం 1952లో ఏర్పడింది. 1953లో కర్నూల్ రాజధానిగా ఉన్న సమయంలో రెండో ఎన్నిక, 1957లో హైదరాబాద్ రాజధానిగా ఉన్న సమయంలో మూడో ఎన్నిక జరిగింది. 1952, 1953 సార్వత్రిక ఎన్నికల సమయంలో అలంపూర్ ఎస్సీ రిజర్వ్‌గా ఉన్నది. 1957లో జనరల్ స్థానంగా మారింది. అయితే 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో ఎస్సీ రిజర్వ్‌గా మారింది. తదుపరి అలంపూర్, మానవపాడు, ఇటిక్యాల, రాజోళి,ఉండవెల్లి,వడ్డేపల్లి మండలాలతో పాటు అయిజ మండలం అలంపూర్‌లోనే కలిసింది. అప్పటిదాకా అలంపూర్‌లో ఉన్న పెబ్బేరు మండలం వనపర్తి సెగ్మెంట్‌లో కలిసింది. అష్టాదశ శక్తిపీఠాలోల ఐదో శక్తిపీఠం అలంపూర్ క్షేత్రం విరాజిల్లుతున్నది. ఇటిక్యాల మండలంలోని బీచుపల్లి ఆంజనేయస్వామి క్షేత్రం ఉన్నది. అగ్గిపెట్టెలో పట్టే చీరను నేసిన చరిత్ర రాజోళి చేనేతలది. ఆర్డీఎస్, తుమ్మిళ్ల, జూరాల ద్వారా సాగునీరు అందుతుంది. అలంపూర్ నియోజకర్గం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక మూడు రాష్ట్రాలకు సరిహద్దుగా ఉన్నది. అలంపూర్ మొదటి ఎమ్మెల్యేగా అలంపూర్ మండలం లింగనవాయికి చెందిన నాగన్న కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచారు. అదేవిధంగా 1953లో నిర్వహించిన ఉప ఎన్నికలోనూ కాంగ్రెస్ అభ్యర్థిగా నాగన్న గెలిచారు. 2014లో కాంగ్రెస్ అభ్యర్థి ఎస్ఏ సంపత్‌కుమార్ గెలుపొందగా, టీడీపీ నుంచి వీఎం అబ్రహం 50,689ఓట్లు పొంది రెండోస్థానంలో నిలువగా, బీఆర్ఎస్ నుంచి మంద శ్రీనాథ్ 38,004 ఓట్లు గెలుపొంది మూడో స్థానంలో నిలిచారు. వీఎం అబ్రహం బీఆర్ఎస్‌లో చేరడంలో పార్టీ మరింత బలపడింది. దీంతో 2018ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సంపత్‌కుమార్‌పై 44679 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. వీఎం అబ్రహంకు 102,105ఓట్లు రాగా కాంగ్రెస్ అభ్యర్థికి 57,426 ఓట్లు వచ్చాయి. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,36076 మంది ఉండగా అందులో పురుషులు 1,16,989, మహిళలు 1,19,080 ఉన్నారు. కాగా ఈ నియోజకవర్గ పరిధిలో 8 మండలాలు ఉన్నాయి. అవి అలంపూర్, మానవపాడు, రాజోళి, వడ్డేపల్లి, అయిజ, ఉండవెల్లి, ఇటిక్యాల, ఎర్రవల్లి.

**1952 నుంచి ఎమ్మెల్యే పేర్లు..**

| | | |
|---|---|---|
| 1. కె. నాగన్న | కాంగ్రెస్ | 1952 |
| 2. కె. నాగన్న | కాంగ్రెస్ | 1953 |
| 3. జయలక్ష్మీదేవమ్మ | కాంగ్రెస్ | 1957 |
| 4. డి.మురళీధర్‌రెడ్డి | కాంగ్రెస్ | 1962 |
| 5. టి చంద్రశేఖర్‌రెడ్డి | కాంగ్రెస్ | 1967 |
| 6. టి చంద్రశేఖర్‌రెడ్డి | కాంగ్రెస్ | 1972 |
| 7. చల్లా రాంభూపాల్‌రెడ్డి | జనతా | 1978 |
| 8. రజినీబాబు | టీడీపీ | 1983 |
| 9. రావుల రవీంద్రనాథ్‌రెడ్డి | బీజేపీ | 1985 |
| 10. రావుల రవీంద్రనాథ్‌రెడ్డి | బీజేపీ | 1989 |
| 11. కొత్తకోట ప్రకాశ్‌రెడ్డి | టీడీపీ | 1994 |
| 12. రావుల రవీంద్రనాథ్‌రెడ్డి | బీజేపీ | 1999 |
| 13. చల్లా వెంకట్రామిరెడ్డి | స్వతంత్ర | 2004 |
| 14. వీఎ అబ్రహం | కాంగ్రెస్ | 2009 |
| 15. ఎస్ఎ సంపత్‌కుమార్ | కాంగ్రెస్ | 2014 |
| 16. విఎ అబ్రహం | టీఆర్ఎస్ | 2018 |



# ఇంటింటి ప్రచారానికి పెరుగుతున్న ఖర్చు

**హైదరాబాద్ - ప్రభాతవార్త నెట్‌వర్క్**

ఎన్నికల్లో విజయం సాధించేందుకు ఇంటింటి ప్రచారం కూడా అత్యంత కీలకమైన అంశం. ప్రతి ఓటరు ఇంటికి ఎన్నికల పోలింగ్ నాటికి కనీసం రెండు మూడు సార్లు వెళ్లి ఓట్లు అభ్యర్థించాల్సి ఉంటుంది. అభ్యర్థి నియోజకవర్గం మొత్తం తిరగాలంటే అయ్యే పనికాదు. పైగా సమయం తక్కువగా ఉంది. ఇంకా నామినేషన్ల ఉపసంహరణ కార్యక్రమం పూర్తి కాలేదు. దీనితో రెబల్స్‌ను బుజ్జగింపులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఆ తరువాత నియోజకవర్గంలో కొందరు పెద్దలను కలిసి మద్దతు కోరాల్సి ఉంటుంది. కుల సంఘాలతో సమావేశమై వారిని సంతృప్తిపరచాల్సి ఉంది. రాష్ట్ర, జాతీయ స్థాయి నాయకులు హాజరైన సభలకు, రోడ్ షోలకు వెళ్లాల్సి ఉంటుంది. ఈ హడావిడిలో ఇంటింటి ప్రచారం నిర్లక్ష్యం చేస్తే ఓట్లు పడే అవకాశం ఉండదు. సాధారణంగా ఇంటికి వచ్చి ఓట్లు అభ్యర్థిస్తేనే ఓటర్లు అనుకూలంగా ఉంటారు. లేకపోతే తటస్థులు వేరే పార్టీకి, వేరే అభ్యర్థికి ఓట్లు వేసే అవకాశం ఉంటుంది. ఈ సందర్భంగా నేరుగా అభ్యర్థి రాకపోయినా ఆయన తరపున ద్వితీయ శ్రేణి నేతలు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తారు. ఈ సమయంలో ఆ నేతలతో కనీసం 20 నుంచి 30 మంది జనాలు ఉంటే ప్రచారం జోరుగా నిర్వహిస్తున్నారని ఓటర్లు భావిస్తారు. అయితే ఇక్కడే చిక్కువచ్చి పడింది. కనీసం పది బృందాలు తిరగాలంటే 150 నుంచి 200 మంది అవసరం, దీనితో డబ్బు చెల్లించి జనసమీకరణ చేస్తున్నారు. వీరంతా రోజువారీ కూలీలు కావడంతో ఏ రోజుకు ఆరోజు సాయంత్రం డబ్బు చెల్లించాల్సి ఉంటుంది. వీరిని ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉపయోగించుకుంటారు. దీనతో టిఫిన్లు, టీలు, మధ్యాహ్నం భోజనం వంటివి సమకూర్చాల్సి ఉంటుంది. పురుషులు అయితే క్వార్టర్ బాటిల్ మద్యం కూడా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. దీనితో ఒక్కొక్క వ్యక్తి 600 నుంచి వెయ్యి రూపాయలు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. దీనితో ఇంటింటి ప్రచారం ఖర్చు తడిసిమోపెడు అన్నట్లు తయారైంది. ఎన్నికల పోలింగ్ సమీపించడంతో కార్యకర్తలు కూడా తమ భత్యం పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ఇక వీరు కాకుండా ప్రతి అభ్యర్థి వెంట సుమారు 30 మంది ద్వితీయ శ్రేణి నేతలు ఉంటున్నారు. వీరు రోజువారీ డబ్బు తీసుకోకపోయినా బిర్యానీలు, టిఫిన్లు, కూల్‌డ్రింకులు ఇవ్వవలసి ఉంటుంది. అంతే కాకుండా ప్రతిరోజూ మద్యం పార్టీ ఇవ్వవలసి ఉంటుంది. మద్యంతో పాటు నాన్‌వెజ్, బిర్యానీ పెట్టాలి. ఇది కనీస మర్యాదగా భావిస్తారు. ఇక మరికొందరు ఎన్నికల ప్రచారం చివరి వరకు అభ్యర్థితో ఉండటానికి పది వేల నుంచి రెండు లక్షల రూపాయల వరకు స్థాయిని బట్టి అడుగుతున్నారు. ఎన్నికల్లో విజయం సాధించాలంటే ఇవన్నీ తప్పవు కాబట్టి అభ్యర్థులు ఖర్చుకు వెనకాడటం లేదు.



# భారత్‌లో దివాలీ సంబరాలు..చైనాకు లక్ష కోట్లు నష్టం!

**చైనా, నవంబరు 14:** భారత్‌లో దీపావళి సంబురాలతో చైనాకు లక్ష కోట్ల ఆదాయం తగ్గింది. అదెలా అంటే మన దేశంలో ప్రతి యేడాది రక్షా బంధన్‌తో ప్రారంభమైన ఫెస్టివల్ సీజన్ న్యూ ఇయర్ వరకు ఇలా ఐదు నెలల పాటు కొనసాగుతోంది. ఈ సమయంలో వ్యాపారస్థులు, ఎగుమతిదారులు పండుగ సమయాల్లో ప్రజలకు అవసరమయ్యే నిత్యావసర వస్తువుల్ని చైనా నుంచి భారత్‌కు తెస్తుంటారు. ఆ మొత్తం విలువ సుమారు రూ.80 వేల కోట్లు. అయితే 2020 జూన్ 15న తూర్పు లద్దాఖ్ వద్ద గల్వాన్ నది లోయలో భారత సైనికులు వివిధ అవసరాలకు ఉపయోగిస్తున్న ఓ తాత్కాలిక వంతెనను డ్రాగన్ సైన్యం తొలగించేందుకు ప్రయత్నించింది. ఇది రెండు దేశాల సైనికుల మధ్య హింసాత్మక ఘర్షణకు దారితీసింది. నాటి ఘటనలో భారత్‌కు చెందిన 20 మంది సైనికులు అమరులయ్యారు. అప్పటికి వంతెనపై ఉన్న కనీసం 38 మంది చైనా సైనికులను చైనా కోల్పోయింది. ఈ హింసాత్మక ఘటన తర్వాత భారత్, చైనాను అన్ని విధాలుగా నిలువరించే ప్రయత్నాలు ప్రారంభించింది. అప్పుడే ప్రధాని మోడీ 'వోకల్ ఫర్ లోకల్' పేరుతో ప్రజలు దేశీయ ఉత్పత్తులకు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. అలా దేశంలోచైనా ఉత్పత్తులపై మొదలైన బాయ్‌కాట్ ఉద్యమం ప్రతి సంవత్సరం చైనాను కోలుకోలేని దెబ్బతీస్తుంది. ఫలితంగా ఈ యేడాదిలో దీపావళి వరకు జరిగిన పండుగల్లో దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో రూ.3.75 లక్షల కోట్ల విలువైన వ్యాపార లావాదేవీలు జరిగాయని వ్యాపార సంస్థల సంఘం కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ (సిఎఐటి) పేర్కొంది. నవంబరు 14 నుంచి ప్రారంభమయ్యే గోవర్ధన్ పూజ, భాయా దూజ్, నవంబరు 19 ఛాత్ పూజ, నవంబర్ 24న జరిగే తులసీ వివాహ్ వంటి పర్వదినాల నేపథ్యంలో మరో రూ.50 వేల కోట్ల విలువైన వ్యాపారం జరిగే అవకాశం ఉందని కెయిట్ సెక్రటరీ జనరల్ ప్రవీణ్ ఖండేల్వాల్ తెలిపారు. ఇక నాలుగు రోజుల పాటు జరిగిన దీపావళి ఫెస్టివల్ సీజన్‌లో దేశవ్యాప్తంగా స్థానిక ఉత్పత్తుల అమ్మకాలతో చైనాకు రూ.లక్ష కోట్ల ఆదాయం తగ్గిందని వెల్లడించారు. 'ఇంతకు ముందు దేశవ్యాప్తంగా దీపావళి సందర్భంగా దాదాపు 70 శాతం చైనా ఉత్పత్తులే అమ్ముడయ్యేవి. కానీ ప్రధాని నరేంద్ర మోడీ అభ్యర్థన మేరకు వ్యాపారులు స్థానిక ఉత్పత్తులపై విక్రయించారు.



# ఐపిఒకు 'ఐఆర్ఇడిఎ'




**న్యూఢిల్లీ, నవంబరు 14:** ప్రభుత్వ రంగ 'ఇండియన్ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ' ఐపిఒ నవంబర్ 21, ప్రారంభం కానుంది. నవంబరు 23న ముగుస్తుంది. ఒక్కో షేరు ధరల శ్రేణిని కంపెనీ రూ.30-32గా నిర్ణయించింది. గరిష్ట ధర వద్ద రూ.2,150 కోట్లు సమీకరించాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు నవంబరు 20న ఐపిఒ ప్రారంభమవుతుంది. గత యేడాది మే నెలలో ఎల్‌ఐసి ఐపిఒకి వచ్చిన విషయం విదితమే. ఆ తర్వాత పబ్లిక్ ఇష్యూకు వస్తున్న ప్రభుత్వ రంగ సంస్థ ఐఆర్ఇడిఎనే. కొత్తగా 40.31 కోట్ల షేర్లను జారీచేస్తోంది. దీంతో రూ.1,290 కోట్ల సమీకరణ జరగనుంది. మరో రూ.860 కోట్లు విలువ చేసే 26.88 కోట్ల షేర్లను 'ఆఫర్ ఫర్ సేల్' కింద అందుబాటులో ఉంచనుంది. ఐపిఒ ద్వారా సమీకరించిన నిధులను కంపెనీ భవిష్యత్ మూలధన అవసరాలు, రుణ మంజూరుకు వినియోగించనుంది. ఇష్యూలో అందుబాటులో ఉన్న షేర్లలో దాదాపు సగం 'అర్హత గల సంస్థాగత ఇన్వెస్టర్ల'కు కేటాయించారు. మరో 35 శాతం రిటైల్ ఇన్వెస్టర్లు, 15శాతం 'సంస్థాగతయేతర ఇన్వెస్టర్ల'కు రిజర్వ్ చేశారు. ఇన్వెస్టర్లు కనీసం 460 షేర్లకు బిడ్లు దాఖలు చేయాల్సి ఉంటుంది. ఈ లెక్కన గరిష్ట ధర వద్ద కనీసం రూ.14,720 పెట్టుబడిగా పెట్టాలి. ఐఆర్ఇడిఎ నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ కింద పనిచేస్తున్న మినీరత్న కంపెనీ. వివిధ దశల్లో ఉన్న పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు ఈ సంస్థ ఆర్థిక సహకారం అందచేస్తుంటుంది. ఈ క్రమంలో అనేక ఫండ్, నాన్-ఫండ్ ఆధారిత ఫైనాన్షియల్ ప్రోడక్ట్‌లను అందిస్తోంది. బిఒబి కేపిటల్ మార్కెట్స్, ఎస్‌బిఐ కేపిటల్ మార్కెట్స్, ఐడిబిఐ కేపిటల్ మార్కెట్స్ అండ్ సెక్యూరిటీస్ ఈ ఐపిఒకి బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా వ్యవహరిస్తున్నాయి.

# 2 దశాబ్దాల తర్వాత టాటా ఐపిఒ

**న్యూఢిల్లీ, నవంబరు 14:** టాటా గ్రూప్ నుంచి చాలా రోజుల తర్వాత ఐపిఒ వస్తోంది. ఇన్వెస్టర్లు ఎంతగానో ఎదురుచూస్తున్న టాటా టెక్నాలజీస్ ఐపిఒ నవంబరు 22న ప్రారంభం కాబోతోంది. నవంబరు 24తో సబ్‌స్క్రిప్షన్ ముగియనుంది. టాటా గ్రూప్ నుంచి చివరిగా టిసిఎస్ ఐపిఒకు వచ్చింది. మళ్లీ దాదాపు 2 దశాబ్దాల తర్వాత టాటా గ్రూప్ నుంచి వస్తున్న ఐపిఒ ఇదే కావడం విశేషం. దీంతో ఇన్వెస్టర్లలో ఆసక్తి నెలకొంది. టాటా మోటార్స్‌కు చెందిన టాటా టెక్నాలజీస్ ఇంజినీరింగ్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ డిజిటల్ సర్వీసెస్ సంస్థ. టాటా మోటార్స్, జాగ్వార్ ల్యాండ్‌రోవర్ సహా టాటా గ్రూప్‌లోని ఇతర సంస్థలకు ఇది ప్రధానంగా సేవలందిస్తోంది. అలాగే ఇతర ప్రైవేట్ ఈక్విటీ సంస్థలైన ఆల్ఫా టిసి హోల్డింగ్ 2.4శాతం, టాటాకేపిటల్ గ్రోత్ ఫండ్ 1.2శాతం చొప్పున తమ వాటాలను విక్రయించనున్నాయి. ఐపిఒలో భాగంగా టాటా టెక్నాలజీస్, టాటా మోటార్స్ ఉద్యోగులకు 10శాతం షేర్లను రిజర్వ్ చేశారు. టాటా టెక్నాలజీస్ ఐపిఒకు జెఎం ఫైనాన్షియల్ లిమిటెడ్, సిటీ గ్రూప్ గ్లోబల్ మార్కెట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, బోఫా సెక్యూరిటీస్ ఇండియా లిమిటెడ్ బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా వ్యవహరించనున్నాయి. అయితే ఐపిఒ సైజ్, ధరల శ్రేణి వంటి వివరాలను ఇంకా తెలియరాలేదు.




### టాటా స్టీల్‌లో 800 ఉద్యోగులకు ఉద్వాసన

క్రమంగా కర్బనరహిత తయారీ విధానాలను అమలు చేస్తున్న టాటా స్టీల్ కీలక నిర్ణయం తీసుకుంది. నెదర్లాండ్స్‌లోని తమ కంపెనీ విభాగంలో దాదాపు 800 మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ప్రకటించింది. మరింత సుస్థిర తయారీ విధానాలను అవలంబిస్తున్న నేపథ్యంలో కంపెనీ లాభదాయకతను పెంచేందుకుగానూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ప్రస్తుతం నెదర్లాండ్స్ టాటా స్టీల్ విభాగంలో 9,200 మంది పనిచేస్తున్నారు. ఇప్పటికే పలు వ్యయ నియంత్రణ చర్యలను చేపట్టినట్లు కంపెనీ తెలిపింది. అయినా మరిన్ని చర్యలను తీసుకోక తప్పడం లేదని పేర్కొంది. తాజాగా తొలగిస్తున్న వారిలో ఎక్కువ మంది మేనేజర్ స్థాయి, సపోర్ట్ స్టాఫ్ ఉన్నారని వెల్లడించింది. మరోవైపు కంపెనీని కర్బనరహితంగా మార్చడంలో భాగంగా రానున్న రోజుల్లో భారీఎత్తున పెట్టుబడులు పెట్టనున్నట్లు తెలిపింది. నెదర్లాండ్స్‌లో వెలువడుతున్న మొత్తం కార్బన్‌డయాక్సైడ్ ఉద్గారాల్లో ఏడు శాతం టాటా స్టీల్‌దేనని అంచనా. ఈ నేపథ్యంలో బొగ్గు, ఇనుప ఖనిజం ఆధారంగా జరుగుతున్న ఉత్పత్తిని రానున్న రోజుల్లో లోహాల తుక్కు, హైడ్రోజన్‌తో రీప్లేస్ చేస్తామని కంపెనీ తెలిపింది. 2030 నాటికి కొత్త తయారీ విధానాలను అమలు చేస్తామని ప్రకటించింది.

# కేంద్ర మంత్రికి మస్క్ క్షమాపణలు

**కాలిఫోర్నియా, నవంబరు 14:** విద్యుత్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా ప్లాంట్‌ను కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ సందర్శించారు. మంగళవారం కాలిఫోర్నియాలోని ఫ్రెమోంట్‌లో ఉన్న ఈ కేంద్రంలో విద్యుత్ కార్ల తయారీని పరిశీలించారు. ఈ సందర్శన గురించి ఆయన ట్విట్టర్ వేదికగా వెల్లడించారు. అయితే ఆ సమయంలో టెస్లా అధినేత ఎలాన్ మస్క్ మంత్రి వెంట కనిపించలేదు. దీనిపై గోయల్‌కు మస్క్ క్షమాపణలు తెలియచేశారు. 'ఫ్రెమోంట్‌లోని టెస్లా తయారీ కేంద్రాన్ని సందర్శించాపను. ఈ కేంద్రంలో సీనియర్ హోదాలో పనిచేస్తోన్న భారత ఇంజినీర్లు, ఆర్థిక నిపుణులను చూడడం చాలా ఆనందాన్ని కలిగించింది. టెస్లా అద్భుత ప్రయాణంలో వారు అందిస్తోన్న సహకారం అమోఘం. టెస్లా సప్లయ్ చైన్‌లో భారత్ నుంచి విడి పరికరాల సరఫరాకు ప్రాముఖ్యత పెరుగుతుండడం గర్వంగా ఉంది. ఈ పర్యటనలో మస్క్‌ను మిస్ అవుతున్నాను. ఆయన త్వరగా కోలుకోవాలి' అని తన పర్యటన చిత్రాలను పీయూష్ గోయల్ పోస్టు చేశారు. మంత్రి ట్వీట్‌పై మస్క్ నుంచి స్పందన వచ్చింది. 'మీరు టెస్లాను సందర్శించడం మాకు గొప్ప గౌరవం. ఈ రోజు కాలిఫోర్నియాలకు రాలేకపోయినందుకు క్షమాపణలు తెలియచేస్తున్నాను. త్వరలో మీతో భేటీకి ఎదురుచూస్తున్నాను' అని ఈ టెక్ దిగ్గజం సోషల్ మీడియాలో రాసుకొచ్చారు.



# వాణిజ్యం

# ఒబెరాయ్ గ్రూప్ ఛైర్మన్ పిఆర్ఎస్ ఒబెరాయ్ ఇకలేరు

**న్యూఢిల్లీ, నవంబరు 14:** భారత ఆతిథ్య రంగ అభివృద్ధికి విశేష కృషి చేసిన ఒబెరాయ్ గ్రూప్ చైర్మన్ పృథ్వీ రాజ్ సింగ్ ఒబెరాయ్ ఇకలేరు. మంగళవారం ఉదయం ఆయన తుదిశ్వాస విడిచినట్లు కంపెనీ ఓ ప్రకటనలో తెలిపింది. హాస్పిటాలిటీ పరిశ్రమలో ఒబెరాయ్ సాధించిన కీర్తి సరిహద్దులను దాటిందని పేర్కొంది. ఆయన సేవలు ఈ రంగంలో చెరగని ముద్ర వేశాయని కొనియాడింది. భారత పర్యాటకం, ఆతిథ్య రంగ అభివృద్ధికి పిఆర్ఎస్ ఒబెరాయ్ చేసిన కృషికి గానూ ప్రభుత్వం ఆయనను పద్మ విభూషణ్‌తో సత్కరించింది. ఆయన ఐఎల్‌టిఎం జీవిత సాఫల్య పురస్కారాన్ని కూడా అందుకున్నారు. యుఎస్ఎ హోటల్స్ మ్యాగజైన్ 'కార్పొరేట్ హోటలియర్ ఆఫ్ ది వరల్డ్' అవార్డుతో గౌరవించింది. బెర్లిన్‌లో జరిగిన ఇంటర్నేషనల్ హోటల్స్ ఇన్వెస్ట్‌మెంట్ ఫోరంలోనూ జీవిత సాఫల్య పురస్కారాన్ని అందుకున్నారు. వీటితో పాటు వివిధ వ్యాపార, వాణిజ్య సంస్థలు ఆయనను పలు సత్కారాలతో గౌరవించాయి. రాబోయే రోజుల్లో ఆయనకు గుర్తుగా పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఒబెరాయ్ గ్రూప్ వెల్లడించింది. వాటి వివరాలను త్వరలో ప్రకటిస్తామని పేర్కొంది. ఢిల్లీలోని కాప్‌సహేడా ప్రాంతంలో ఉన్న భగవంతి ఒబెరాయ్ ఛారిటబుల్ ట్రస్ట్‌కు చెందిన ఒబెరాయ్ ఫామ్‌లో ఆయన అంతిమ సంస్కారాలు నిర్వహిస్తామని వెల్లడించింది. 1929లో ఢిల్లీలో జన్మించిన పిఆర్ఎస్ ఒబెరాయ్ బికీ పేరుతో బాగా ప్రసిద్ధి. ఆయన తండ్రి ఒబెరాయ్ గ్రూప్ వ్యవస్థాపకుడు దివంగత రాయ్ బహదూర్ ఎంఎస్ ఒబెరాయ్. ఇఐహెచ్ లిమిటెడ్‌కు పిఆర్ఎస్ ఒబెరాయ్ సుదీర్ఘకాలం ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా వ్యవహరించారు. ఆయన హయాంలోనే ఈ సంస్థ ఓ వెలుగు వెలిగింది.



# థ్రెడ్స్‌లో రెండు కొత్త అప్‌డేట్లు!

**వాషింగ్టన్, నవంబరు 14:** బిలియనీర్ ఎలాన్ మస్క్‌కు చెందిన సామాజిక మాధ్యమ దిగ్గజం 'ఎక్స్'కు పోటీగా మెటా తీసుకొచ్చిన థ్రెడ్స్ తక్కువ సమయంలోనే ఎంతో ఆదరణ పొందింది. ఇన్‌స్టాగ్రామ్ అనుసంధానంతో పనిచేసే ఈ యాప్ ఇంకా ప్రాథమిక దశలోనే ఉంది. ఇంకా చాలా ఫీచర్లను ప్రవేశపెట్టాల్సి ఉంది. తాజాగా ఇన్‌స్టాగ్రామ్ హెడ్ ఆడమ్ మోస్సేరి, థ్రెడ్స్‌కు సంబంధించిన రెండు కీలక అప్‌డేట్లను వెల్లడించారు. జులైలో అందుబాటులోకి వచ్చిన థ్రెడ్స్‌లోకొన్ని ఫీచర్ల విషయంలో యూజర్లు తొలి నుంచీ అసంతృప్తి వ్యక్తం చేస్తూ వస్తున్నారు. ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌ను డిలీట్ చేయ కుండా థ్రెడ్స్ ప్రొఫైల్‌ను తొలగించలేకపోవడం అందులో ఒకటి. అయితే తాత్కాలికంగా డీయాక్టివేట్ చేసే ఆప్షన్‌ను మాత్రం ఇచ్చారు. తాజాగా దీనిలో మార్పులు చేసినట్లు ఆడమ్ వెల్లడించారు. ఇకపై థ్రెడ్స్ ప్రొఫైల్‌ను డిలీట్ చేయాలంటే దానితో అనుసంధానమై ఉన్న ఇన్‌స్టా అకౌంట్‌ను తొలగించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. సెట్టింగ్స్‌లోకి వెళ్లి అకౌంట్‌ను సెలెక్ట్ చేసుకుంటే డిలీట్ లేదా డీయాక్టివేట్ ఆప్షన్లు కనిపిస్తాయని వెల్లడించారు. థ్రెడ్స్ పోస్టులను ఎవరు చూడాలో నియంత్రించుకునే అవకాశం ఇవ్వడం తాజాగా వచ్చిన రెండో అప్‌డేట్. ప్రస్తుతం థ్రెడ్స్‌లో చేసే పోస్టులు మెటాకు చెందిన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ఫీడ్‌లలోనూ కనిపిస్తాయి. తమ కొత్త ప్లాట్‌ఫామ్‌పై ఎంగేజ్‌మెంట్‌లను పెంచడం కోసమే మెటా ఇలా చేసింది. అయితే దీనిపై యూజర్ల నుంచి నెగెటివ్ ఫీడ్‌బ్యాక్ వచ్చింది. తమ పోస్టులు ఎక్కడ కనిపించాలో నిర్ణయించుకునే ప్రైవసీ తమకు ఉండాలని చాలా మంది అభిప్రాయపడ్డారు.







# నేడే కీలక సమరం

## భారత్, న్యూజిలాండ్ మధ్య తొలి సెమీ ఫైనల్

## సెమీ, ఫైనల్ మ్యాచ్‌లకు రిజర్వ్ కేటాయింపు

**హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త:** వన్డే ప్రపంచ కప్ మ్యాచ్ సెమీ ఫైనల్‌కు రంగం సిద్ధమైంది. తొలి సెమీఫైనల్ ఈ నెల 15వ తేదీన భారత్, న్యూజిలాండ్ మధ్య జరుగనుంది. అలాగే ఈ నెల 16వ తేదీన జరిగే రెండో సెమీఫైనల్‌లో దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా జట్లు తలపడనున్నాయి. ఇక ఫైనల్ మ్యాచ్ అహ్మదాబాద్ వేదికగా ఈ నెల 19వ తేదీన జరగనుంది. వన్డే వరల్డ్ కప్‌లో అజయంగా దూసుకెళుతున్న భారత క్రికెట్ జట్టు ఇక కీలక సమరానికి సన్నద్ధమైంది. లీగ్ దశలో 9కి 9 మ్యాచ్‌లు గెలిచిన రోహిత్ నేతృత్వంలోని భారత్ సేన బుధవారం న్యూజిలాండ్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. ఫైనల్ బెర్తుపై కన్నేసిన భారత్ ముంబైలోని వాఖండే స్టేడియంలో మధ్యాహ్నం జరిగే తొలి సెమీ ఫైనల్లోన కివీస్‌ను మరోసారి ఓడించాలనే పట్టుదలతో ఉంది. 2019 ఎడిషన్ సెమీస్‌లో పరాభవానికి ప్రతీకారంగా కివీస్‌ను ఇంటికి పంపాలని రోహిత్ సేన పట్టుదలతో ఉంది. భారీ అంచనాలతో సాగే సెమీస్ ఫైట్‌ను చూసేందుకు విశిష్ట అతిధిగా ఇంగ్లండ్ మాజీ ఫుట్‌బాలర్ డేవిడ్ బెకహామ్ రానున్నాడు. యూనిసెఫ్ గుడ్‌విల్ అంబాసిడర్‌గా ఉన్న బెకహామ్ మూడు రోజుల పర్యటనలో భాగంగా భారత్‌కు రానున్నాడు. స్వతహాగా ఫుట్‌బాలర్ అయిన బెకహామ్‌కు క్రికెట్ అంటే ఇష్టం. పైగా వరల్డ్ కప్ మెగా టోర్నీని బాగా ఫాలో అవుతున్నాడు. కాగా క్రికెట్ అభిమానులకు ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ శుభవార్త చెప్పింది. వరల్డ్ కప్ సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లకు రిజర్వ్ డేని ఏర్పాటు చేసింది. షెడ్యూల్ ప్రకారం మ్యాచ్‌లు జరగకపోయినట్లయితే మరుసటి రోజు రిజర్వ్ డే న జరగనుంది. ఈ లెక్కన సెమీ ఫైనల్ లేదా ఫైనల్ మ్యాచ్ ఒక్క రోజులో పూర్తికాకపోయినట్లయితే మళ్లీ మరుసటి రోజు తొలి రోజు ఆగిపోయిన చోటు నుంచే ఆటను కొనసాగిస్తారు. రిజర్వ్ రోజున కూడా సెమీ ఫైనల్స్ పూర్తి కాకపోయినట్లయితే పాయింట్ల పట్టికలో అగ్ర స్థానంలో ఉన్న జట్టు ఫైనల్‌కు చేరుకుంటుంది. అంటే భారత్, న్యూజిలాండ్ సెమీ ఫైనల్ వర్షం కారణంగా రద్దయినట్లయితే భారత జట్టు ఫైనల్‌కు చేరుకుంటుంది. ఎందుకంటే పాయింట్ల పట్టికలో భారత్ మొదటి స్థానంలో నిలవడంతో ఇది ఫైనల్‌కు చేరుకుంటుంది. అదేవిధంగా దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా మధ్య జరిగే సెమీ ఫైనల్ వాష్ అవుట్ అయితే పాయింట్ల పట్టికలో నంబర్ టులో ఉన్న దక్షిణాఫ్రజకా ఫైనల్‌కు చేరుకుంటుంది. అయితే ఫైనల్ మ్యాచ్‌లో పాయింట్ల పట్టిక ఆధారంగా విజేతను నిర్ణయించడం జరగదు. ఈ నెల 19న అహ్మదాబాద్‌లో జరిగే ఫైనల్ మ్యాచ్ రోజున వర్షం పడినట్లయితే రిజర్వ్ డే ప్రకారం మరుసటి రోజు 20వ తేదీన మ్యాచ్ జరుగుతుంది. ఈ రిజర్వ్ రోజున కూడా అంతరాయం ఏర్పడి ఫలితం రాకపోయినట్లయితే ఫైనల్‌లో తలపడే రెండు జట్లూ వరల్డ్ కప్ ట్రోఫీని పంచుకుంటాయి.

## భారత్, న్యూజిలాండ్ సెమీస్‌కు అంపైర్ల ఎంపిక

**హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త:** వన్డే వరల్డ్ కప్‌లో సెమీ ఫైనల్స్ సమరానికి రంగం సిద్ధమైంది. ఈ మెగా టోర్నీ తొలి సెమీ ఫైనల్లో ఈ నెల 15వ తేదీన ముంబై వేదికగా భారత్, న్యూజిలాండ్ తాడోపేడో తేల్చుకోనున్నాయి. అనంతరం ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఈ నెల 16వ తేదీన రెండో సెమీ ఫైనల్లో దక్షి మామాణాఫ్రికా, ఆస్ట్రేలియా జట్లు తలపడనున్నాయి. ఈ సెమీ ఫైనల్స్ పోరుకు అంపైర్ల జాబితాను అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ప్రకటించింది. భారత్, న్యూజిలాండ్ మధ్య జరగనున్న తొలి సెమీ ఫైనల్‌కు ఆన్ ఫీల్డ్ అంపైర్లుగా ఇంగ్లండ్‌కు చెందిన రిచర్డ్ ఇల్లింగ్ వర్త్, ఆస్ట్రేలియాకు చెందిన రాడ్ టక్కర్ వ్యవహరించనున్నారు. అదేవిధంగా థర్డ్ అంపైర్‌గా జోయెల్ విల్సన్, ఫోర్త్ అంపైర్‌గా అడ్రియన్ హోల్డ్‌స్టాక్ విధులను నిర్వర్తించనున్నారు. మ్యాచ్ రిఫరీగా ఆండీ పైక్రాఫ్ట్‌ని నియమించింది.
కాగా ఈ మ్యాచ్‌రాడ్ టక్కర్‌కు అంపైర్‌గా 100 అంతర్జాతీయ మ్యాచ్ కావడం విశేషం. మరోవైపు వన్డే ప్రపంచ కప్-2019లో భారత్, న్యూజిలాండ్ మధ్య జరిగిన సెమీ ఫైనల్లో కూడా రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్ ఫీల్డ్ అంపైర్‌గా వ్యవహరించాడు. ఆ మ్యాచ్‌లో కివీస్ చేతిలో భారత్ ఓటమి పాలైంది. ఇక ఆసీస్, దక్షిణాఫ్రికా మధ్య జరగనున్న రెండో సెమీ ఫైనల్‌కు రిచర్డ్ కెటిల్‌బరో, నితిన్ మీనన్ ఫీల్డ్ అంపైర్లుగా ఎంపికయ్యారు. థర్డ్ అంపైర్‌గా క్రిస్ గఫానీ, ఫోర్త్ అంపైర్‌గా మైఖేల్ గోఫ్ వ్యవహరించనున్నారు. అలాగే మ్యాచ్ రిఫరీగా జావగల్ శ్రీనాథ్ ఉండనున్నారు.

## వరల్డ్ కప్ తర్వాత ఆస్ట్రేలియాతో భారత్ టీ 20 సీరీస్

**హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త:** వన్డే వరల్డ్ కప్ తర్వాత భారత్ టీ 20 సీరీస్‌లో పాల్గొనబోతోంది. వరల్డ్ కప్ తర్వాత మూడు రోజుల విరామం తదుపరి ఆస్ట్రేలియాను ఢీ కొట్టనుంది. ఈ రెండు జట్ల మధ్యన 5 మ్యాచ్‌ల టీ 20 సీరీస్ జరగనుంది. మొదటి మ్యాచ్ నవంబరు 23వ తేదీన విశాఖపట్నం పేదికగా జరుగుతుంది. రెండవ మ్యాచ్ ఈ నెల 26న త్రివేండ్రంలోను, 28న మూడవ మ్యాచ్ గౌహతిలో ఆడనున్నారు. ఇక మిగిలిన ఆఖరి రెండు మ్యాచ్‌లను వరుసగా డిసెంబరు 1వ తేదీన నాగపూర్‌లోను, 3వ తేదీన హైదరాబాద్ వేదికగా జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ఈ మ్యాచ్‌లకు భారత్, ఆ స్ట్రేలియా నుండి కీలక ప్లేయర్లు పాల్గొవడం లేదు.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.: No.HSD/337/21-22 **Air Surcharge:** Delhi : 40 Ps.